మార్చి 1935 — ఆంధ్రభారతి — సంపుటము-3, సంచిక-10


1. [illegible] — 705
2. [illegible] — 706-708
3. [illegible] — 709-713
4. [illegible] — 714-716
5. [illegible] — 716
6. [illegible] — 717-723
7. [illegible] — 724-727
8. [illegible] — 727-731
9. [illegible] — 732-734
10. [illegible] — 735-738
11. [illegible] — 739-741
12. [illegible] — 742-744
13. [illegible] — 745-753
14. [illegible] — 753
15. [illegible] — 754
16. [illegible] — 755-759
17. [illegible] — 760-761
18. [illegible] — 762-763
19. [illegible] — 764-765
20. [illegible] — 766

స్థాపితము ౧౯౩౩. సాలు చందా రు. 3.

# ఆంధ్రభూమి

సర్వవిషయములను చర్చించు సచిత్రాంధ్ర మాసపత్రిక

సంపుట. 3. ✢ సంచిక. ౧౦.

## నవజీవనము

౧

మరల నుదయాద్రి నెత్తమ్ము లరుణ బాల
నవ్య లాక్షార్ద్ర చరణ చిహ్నముల మెరసె;
కప్పుకొనియున్న నెత్తమ్మి రెప్ప కొనల
కాంతి చిగురించె వలపు తపంత విరియ.

౨

మొరసె కాబోలు శ్యామసుందరుని మురళి;
భువనమోహన కలకంఠ రవళి! నాదు
జీవనమె కాదు పల్లవించెను సమస్త
చేతనము లీ వసంతవిభాత వేళ.

౩

ప్రేమ మధురిమ హృదయపాత్రికను నింపి
తొగరు తెర లొత్తిగించుచు తొంగిచూచు
ఆ ప్రణవ మట్లు నా యంతరాత్మ కూడ
ఎవరి కోసమో యింత ప్రతీక్ష నుండె!

౪

ప్రాగ్దిశాకాశ మింత యెఱ్ఱవడె నేమి
దేవ తరుణు లెందరు కెంపు మోవి రేకు
లదిమి రిచ్చుట? యీ తొలియుదయమందు
ప్రత్యూషువు ఆవినూతన ప్రభ చెమర్చు.

౫

కోకిలా! పాడు మొకపాట గ్రొత్త నీను
ధాత్రి మధురమ్ముగా, యీ యుగాది వేళ;
చెలిమిఁగొని యిద్దరము నవజీవనమున
కిది మొదలుగా నుపక్రమించెదము గాక!

—బొడ్డు బాపిరాజు.

# రుచీదేవి

(వచనరూపకము)

తృతీయాంకము : రంగము ౧.

కాలము : ఉదయము.

స్థలము : విజయనగరమునం దొకవీధి.

(అచ్చటచ్చట ప్రజలు గుంపులుగూడి ఏదియో గుసగుసలాడుచున్నారు. కొందరు బిగ్గరగా మాటాడవలదని, స్నేహితులను వారించుచున్నారు. ఆ వీధియం దొకచెట్టు క్రింద ఆలోచించుచు కూర్చుండియున్న సిద్ధాంతి, మిత్రుడగు రామశాస్త్రిని తిలకించి మెల్లగా చేతులుతట్టుచు:)

సిద్ధాంతి :—రామశాస్త్రి!....రామశాస్త్రి!.........రామశా....

రామశాస్త్రి :—(వెనుదిరిగి చూచి)....ఓ...ఏమి?....

సిద్ధాంతి :— (లేచి శాస్త్రివైపునకు నడచుచు) ఎచ్చటికి వెళ్ళుచున్నావు? నీకేదో సుస్తిచేసినదని విన్నాను, నిజమేనా?

శా :—ఏమిసుస్తి! కొంచెము ఆకలి మందగించినది. మన రాజుగారింట గృహప్రవేశమహోత్సవము జరిగిన సమయమున సమారాధనలో కొంచెము పప్పుదినుసు ఎక్కువ తగిలినదిసుమా?

సిద్ధా :—నిజమే...నాకును ఈ మధ్య (కడుపు నిమురుకొనుచు) కొంచెము కడుపు నొప్పి కలిగినది. శివశాస్త్రి మంచిమందు ఇచ్చినాడుసుమా!

శాస్త్రి :—మంచిది. నీ విచ్చటేమి చేయుచున్నావు? చెట్టుక్రింద కూర్చుండి తగవులేవైన తీర్పుచెప్పుచున్నావా?

సిద్ధాం :—(మెల్లగా) తీర్పుచెప్పుటకు శక్యముగాని నేరమొకటి జరిగినది సుమా!

శాస్త్రి:—(ఆశ్చర్యములో) ఏమినేరము! గొల్లగంగి ఆవుపెయ్యతో సహితము తెల్లవారునరికి ప్రాలిమేకదాటి లేచిపోయిన విషయమా?

సిద్ధాం :—బిగ్గరగా మాట్లాడవలదు. అమాయకులగు సంసారులలోకన్న ఈ కాలమున గొప్పవారిండ్లయందే కలవరములు బయలుదేరినవి సుమా!

శా:—(మెల్లగా) గొప్పవారేమి కొలదివారేమి? గుణము ముఖ్యముగాని కులము ముఖ్యమా? మనయూరి మాదిగవెంకని రెండవకూతును చూచితివా? మిగుల దొడ్డబుద్ధి గలది; అయితే తక్కువకులములోనిది; కనువిందుగూర్చు చక్కదనముగల కాకిదొండపండు విషపూరితము—గజిగజిగ నుండు సీతాఫలమునందలి గుజ్జు అతిమధురము—

సి:—మొత్తముమీద నీవు లోకప్రవృత్తిని బాగుగా తెలసికొనినావు. అసలు విషయము అంతరించి వేదాంతము మితిమీరినది. అయితే అసలు సంగతి వింటివా?

శా:—(నవ్వుచు) పెద్దవారింటిలో, కలవరమంటివి! ఎవరికొంప తీయనున్నావో?

సి:—(శాస్త్రి చేయిపట్టుకొని) మన మా కనుపించు గుడిలోనికిపోయి ఆమండపములో కూర్చుండి రహస్యముగ నొకసంగతి చెప్పుకొందమురమ్ము. ఇది అతిరహస్యముసుమా!

శా:—(గుడివైపున కేగుచు, మెల్లగా నవ్వుచు) ఇది చేమంతి సంగతికాదు గదా!

సి:—(పెద్దగానవ్వి) ఇది చేమంతి సంగతి కాదు; కాని చేమంతి వినిపించిన సంగతి.

శా:—(ఆతురతతో) ఏది, ప్రారంభింపుము. మొత్తముమీాద కోటలోని దాసియగు చేమంతిసహవాసము అన్నివిధముల ఉపయోగమేనుమా ?

సి:—(శాస్త్రితో మండపములోనికేగి సమీాపమున కూర్చుండి మెల్లగా) ఈసంగతి గ్రామమంతయు వ్యాపించియుండవచ్చును. అయినను మనము జాగ్రత్తతో నుండవలయును. ఇది పెద్దలకుచెందిన విషయము. చేమంతి ఏవిషయము నాకు చెప్పకుండ మనసులో దాచుకొననేరదు; మనవలన ఈ విషయము బయల్పడిన చేమంతికి చేటు రాగలదు జాగ్రత్త.

శా:—(మాతిత్రిప్పుచు) సంగతి చెప్ప లేదు, అప్పుడే నిబంధనలు ! నియమములు!

సి:—(మెల్లగా) మన ప్రభువగు కృష్ణరాయ డదృష్టవంతుడు. ఈపాటికి మన పట్టణ మల్లకల్లోలములో నుండవలసినది—శ్రోత్రభార్యయగు రుచీదేవి, కృష్ణరాయని సంహరింప గడచినరేయి పడకటింట కత్తి దూసినదట !

శా:—(గ్రుడ్లు మిటకరించి) ఆ! ఆ! త్రాచుపాము! గోధుమవన్నె త్రాచుపాము.

సి:—మెల్లగా మాట్లాడుము, ఎవరేని విందురు.

శా:—సంగతి సగమే చెప్పితివేమి ? పడకటింట పతిని సంహరింప దొరకొనిన పడతి, పరమనిర్భాగ్యురాలు సుమా !

సి:—రాజు నిద్రించుచుండగా మెల్లగా లేచి, తాటిబిగించి, ఇదివరలో గుప్తపరచి యుంచిన కత్తిని తీసికొని; రాజు పేరురమున నాటబోయినదట !—రాజు మేల్కాంచి ఆమె చేయిపట్టుకొని వారించెనట.

శా:—(ఆతురతతో) తరువాత జరిగిన విషయమేమి ?

సి:—ఏమిజరగినది? ఆమె మూర్ఛబోయి నేల వ్రాలినదట

శా:—మంచిపని చేసినది! ... ....నిన్న మొన్నటివరకు సిప్పాలు గ్రక్కుచున్న గజపతి, పిలచి పిల్లనిచ్చెదనని పలికినపుడే, నాకనుమానము గలిగినది. వెఱ్ఱివాడు రాజు వేగిరపడినాడు. తియ్యనిమాటలతో, ముసిముసి నగవులతో, మాటలాడు మానవుల యుదరములు విషపూరితములని మనరాజెఱుంగడు.

సి:—ఈ వృత్తాంతము ఎవరికిని చెప్పవలదు.

శా:—మనకు తెలియుటకు పూర్వమె దేశ మెల్లెడ మారుమ్రోగి యుండును. అయినను మనమేల ఈవిషయమును బయల్పరుప వలయును ?

సి:—ఇకపై నేమిజరుగునో తెలిసికొనవలసియున్నది. చేమంతి ఏనాటి వృత్తాంతమానాడు మనకు సమకూర్పగలదు.

శా:—ఈరోజు సూరావధానిగారింట భారసాల, నేను తొందరగ పోవలెను.

సి:—సూరావధాని నన్ను పిలువనే లేదు సుమా !

శా:—నీకర్మము! నాయదృష్టము! నేను పోవుచున్నాను. (నిష్క్రమించును).

సి:—లోకమున మానవుల మర్యాదలతివిచిత్రములు నాకడ అన్నివిషయములు తెలసికొని వీడు భోజనముమాట వచ్చినంతనె దారిబట్టినాడు. పనితీరినతరువాత గవ్వపాటి విలువయైన జూపింపలేదు కదా ! మానవుల బుద్ధు లిట్లుండుటచేతనే కాటకములు బలసిపోవుచున్నవి ... ....(తలవంచి ఆలోచించుచు వెడలిపోవును.)

రంగము, ౨. స్థలము : రహస్యాగారము.
కాలము : మధ్యాహ్నము.

(లజ్జావనతవదనుడై రాయలు, ఒకచో కూర్చుండియున్నాడు. సమీపమున అప్పాజి, ఆలోచించుచు నిలచియున్నాడు. గవాక్షము నుండి వచ్చుచున్న గాలికి తోరణముగట్టి, ఎండిపోయియున్న మామిడాకులు, రెపరెప కొట్టుకొనుచు చప్పుడుచేయుచున్నవి.)

అప్పాజి:—(కొంచెము ముందునకువంగి, వినయమున) ప్రభూ! జరిగినదేమో జరిగినది. విచారించిన లాభమేమి?

రాయలు:—(మెల్లగా) ఈవార్త, దేశ మెల్లెడ నావరించియుండును ... ....

అ:—ఈవిషయము, మీజీవితమునందు కొన్ని మంగళకరమగు మార్పులను తేగలదు. మీకిపుడు లోకప్రవృత్తి చక్కగా తెలియగలదు;—గడచిన దానికి యోచించిన లాభమేమికలదు? ముందుజరుగవలసిన దానికై ... ... ...

రా:—ఇంకను యోచింపవలసినపని యేమికలదు?—పుట్టినింటికి పంపివేయుట యుక్తము.

అ:—(ఆలోచనతో) రాజా! వలదు! త్వరపడవలదు!

రా:—(మెల్లగా) అప్పాజీ! మీరునూ నాపక్షమున లేరా? ...ఆనాడు నా చెవిలో రహస్యముగ మీరు చెప్పకుండిన, నేమి జరిగియుండెడిదో? ......

అ:—(చిరునగవుతో) ఆమె, జనకుని ప్రోత్సాహమున నిట్టి కృత్యమునకు సమకట్టి యుండును. ఆమె, మిమ్ము మిగుల ప్రేమించు చున్నది. అది ముమ్మాటికి నిజము. అనూర్యంపశ్యలగు రాచవారింటి బిడ్డల కిట్టి విరుద్ధభావములు తమంత నుద్భవింపవు.

రా:—(మొగమెఱ్ఱబార, కనుల నటు నిటు త్రిప్పుచు.) అప్పాజీ! నాయందు మీకు వాత్సల్యము పూర్తిగ వన్నగిలినది—త్రాచుపామును, పూలదండయని మెడను ధరింపమనియెదరా? లోకమేమనుచున్నదో వినుచున్నారా? ...ఆమెను, అంతఃపురమునందే యుంచుటెట్లు? ఆమెను ప్రేమతో పలుకరించుటెట్లు? ఆమె మొగము నెట్లు చూడగలను? చూచి లోని పరిభవానలమును దిగమ్రింగవలయునా? ఇది మానవుడు చేయగల కార్యముకాదు! పెద్దలగు మీమాట త్రోసిపుచ్చినందులకు క్షమింపుడు. నే నీవిషయమై ఎక్కువగ చర్చింపజాలను.

అ:—(యోచించి) మీహృదయము నెఱింగితిని. అది సలసల క్రాగిపోవుచున్నది! కాలము దాటినకొలది అది చల్లబడును.—ఆమెను పుట్టినింటికి పంపివేయుడు—తమ యాజ్ఞ వెంట రేపే సర్వమును సిద్ధపరచి ఆ పని జరిపింతును.

రా:—(బిగ్గరగా) రేపటివరకు......... ... ......... ... నేడే పంపివేయుడు ... ........ ........ఒక్కక్షణమైన ఇచ్చటామెకు నిలువ నీడలేదు........

అ:—(ముందునకు నడచి, మరల వెను దిరిగి, వినయముతో) రాజా! ఈపలుకుల యందెట్టి మార్పుకలుగదా?

రా:—(బిగ్గరగా) ముమ్మాటికి కలుగదు.

అ:—శలవు (వెడలిపోవును.)

రా:—ఈపని ముగియువరకు మిన్నకుండుట యుక్తముకాదు. నేనును, అప్పాజి ఈ పని, ఎట్లు నెరవేర్చునో పొంచి చూచెదను. (వేగముగ వెడలిపోవును.) (తెర.) (సశేషము.)

--చిరుమామిళ్ల శివరామకృష్ణప్రసాదు, బి.ఏ.



# పైడయ్య దరిద్రదేవత

[గమళ్ళవారి పాశాలమ్మ ఇచ్చే కల్లుదొప్ప పాటుపడే గునపానికంటుతే ఏమౌతుంది?.... ఈ చిన్నకథ చదవండి.]

అక్కడికు నాలుగైదు సంవత్సరాలనుంచి పెద్ద గోదావరి, అంటే, వంతెనకు దిగువ ఆనకట్టు కెగువనున్న విశాలమైన నీటిప్రవాహము వరద రోజుల్లో కొత్తదారిపట్టి తూర్పుత్తట్టు కోస్తా నట్టేట పెద్దపెద్ద ఇసక మేటలు వేయడం రివాజు అయిపోయింది. కుడికు నిడుము అక్కట్టుతోట కెదురుగుండా వున్న పోతగట్టు తెగ్గొట్టకు పక్కనున్న మాలగూడెమ్మీద పడిపోతుందా అన్నంత అలజడి కలగజేసింది. కాని ఆ ఒకేమట్టు తప్పింది. 'ఈ కోతను పుచ్చుకుమాస్తే మేమెక్కడ వేసేదంటుందా' అని అప్పట్లో యోచిస్తే ఎక్కడ వేసివుంటుందో ఎవరూ చెప్పలేకపోయినారు కాని గోదావరికేత ప్రారంభించే సరికి కాకినాడ కాలువమొగ ధవళేశ్వరం దగ్గరది పూర్తిగా కప్పడిపోయింది. పడవలకు దారిలేదు. చేలకు నీరులేదు. లక్షరూపాయలకుపైగా అవుతుంది ఆ ఇసక తవ్వు అని పెద్దపెద్ద ఎంజనీర్లు అంచనావేసి టెండర్లు పిల్చి కంట్రాక్టరు కిచ్చి తవ్వు 1934 తొలకరించకుండా పూర్తి కావాలన్నారు. కంట్రాక్టరు క్రిందామీదా పడి జల్లిసీమనుండి సింహాచలంవరకూ వున్న కూలీలను అయిదారువేల మందికి కుంట 1-కి మూడు నాలు కూలిస్తానని లేవదీసుకువచ్చి ధవళేశ్వరమంతా కూలీలమయంచేసి పారేశాడు. ఒక్క అయిదార్నెల్లు.

1934 మే నెల వచ్చింది. ఇసకతవ్వ ఆఖరయింది. ఇక రాయిపరవడం తరువాయి. ఆపని బంటావాళ్ళది కాదు. అంచేత ఆనాటి తెల్లవాఱగట్ట బంటావాళ్ళంతా మఱోచోట పనిమాడుకోవడానికై పోవాలని అనుకొంటూవున్నారు.

అపరాహ్ణం రెండుగంటలవ్వడు. ఎండ తీవ్రంగా గాస్తూవుంది. బంగనబయలున ఆ కూలీలు ఏలాపడితే ఆలా అడ్డదిడ్డంగా వేసికొన్నవి తాటాకువి-ఆకొమ్మల్వి, వీటిలో నిలిచేటప్పుడుకు వేసే పాకలాంటి నవాసాలను చేసుకున్నవి - ఇళ్ళు మన్నాడు ఖాళీ. 'ఆ పనివాళ్ళంతా వెళ్ళిపోతారు, ఆడవాళ్ళు, మగవాళ్ళు, పిల్లలంతా వెళ్ళిపోతారు. ఊరు చిన్నపోతుంది' అనుకొంటున్నారు కొందఱుకొందఱు గ్రామస్థులు చెట్లక్రిందకూర్చొని— కాదుమఱీ— ఊరికి జనసంఖ్య ఎక్కువగా ఉండడం ఒకనిండు అందులోనూ పనిపాటలుచేసికొనే పాటకపుజనం పొరుగూరువాళ్ళు చాలామంది వచ్చివుంటే అదో వింతకూడాను. ఎక్కడెక్కడి ఆడవాళ్ళు ఎక్కడెక్కడి మగవాళ్ళు ఒకళ్ళ మొగాలొకళ్ళంతక్రితం ఎఱుగుండని వాళ్ళంతా ఊళ్ళోవాళ్ళతో ఏకమైపోయి అక్కడ కైదార్నెల్లనుంచి కలిసిమెలిసి తిరుగుతూ చటక్కున ఓ తెల్లవాఱగట్ల - కేనంతా డేరాలువిడిచిపెట్టి

వెళ్ళిపోయినట్టు - వెళ్ళిపోవడం అంటే అందరికీ అదో కించగా ఉండకమానదు. వాళ్ళకోపమని నిజంగా కొన్నికొన్ని, కొత్తకొత్త మిఠాయిదుకాణాలు, కొన్ని కొన్ని కొత్తకొత్త కల్లంగళ్ళు, కొన్నికొన్ని కొత్త భజనమందిరాలు, కూడా బయలుదేరినవి. అన్నీకూడా మర్నాడునుంచి ఎత్తిపెట్టివేయవలసిందే. నూతిదగ్గర నీళ్ళతోడేచోట వాళ్ళమూలంగా 60, 70, కుండలు ఉత్తవి ఎప్పుడూ వంతులు తెగక తోడుకోడానికి చోటులేక వుండిపోతూవుండేవి. మర్నాటినుంచి ఆ సందడిఅంతా చెల్లు.

అటువంటి పరిస్థితిలో పైడయ్యగాడనే బంటా వాడు ఎక్కడికో పోవాలనుకుంటూవున్నాడు. పోవాలనుకుంటూ గుడిసె యీవలకువచ్చి ఆకాశంకేసి చూచేడు. 'ఓరబ్బో! ఏంఎండ! మండుకుపోతూందే!' అనుకొన్నాడు. గుడిసె యీవలవున్న తన గునపంమీద చెయ్యివేసి చూచేడు. 'ఓరమ్మో! చుఱ్ఱుమంటోన్నాది, కొలిమిలో ఎఱ్ఱనుడ్డావానికి మల్లే: ఊఁ' అనుకొన్నాడు.

"ఎన్నాళ్ళుపాటద్ద యీగునపమేమిగులు
ఎందుకుర యీజన్న మోరన్నా!
కంటరాక్టరు మేడ కలకటేరు ఓడ
కట్టుకుని ఎంచక్క సౌఖ్యపడుతూవుంటే
మీందూరు ఏదంటు మోసపోయేమనకు
ఎందుకుర యీ జన్న మోరన్నా!"

అని పాడుతూ దిక్కులు చూచేడు.

గవల్లోరి అడపడుచు పాకాలమ్మ కుఱ్ఱగుంట పదారేళ్ళది-అనుబోడు కాళ్ళను, ఈడిమంత చేతను- ఆపాట వినీ వినకో వాసకు 'పయిడయ్య బావా! తెల్లారగట్ల వెళ్ళిపోతారు కాబోసు,' అంది. పయిడయ్య చూచేడు కల్లెత్తి. తనబిస్సా తానూ మఱిచిపోయినాడు.

"ఎండసెగలూ చెఱుగుతున్నా
ఊడిమంతకు వేడిలేదు:
కల్లుమంతకు కాక లేదు:
గవల్లోరి పాకాలమ్మ
కళ్ళచలవకు తిరుగు లేదు."

అని పదమ్మార్చి గట్టిగాపాడి 'వెళ్ళేముందు నీకట్లన మడే వెతుకాకో మఱిదలా!' అన్నాడు. 'అయితే నివ్వొచ్చేదాకా కూసుంటాను చప్పునరా!' అంది.

గవళ్ళపాకాలమ్మ ఊరికి దూరంగా తూర్పుగావున్న ఓతాళ్ళమునుసులో జొఱబడిపోయింది. ఓఘడియ అటూఇటూ పయిడయ్య చూచేడు. ఆకాశం పడమట వైపు బొబ్బర్లంక ఆకాయల ఉఱిమినట్టు వినవచ్చింది వాడికి. 'ఓరయ్యోర్ల, ఉఱుములోస్తుంది ఆకాశం.' అని ఏటిగట్టెక్కి చూచేడు. మతో నిమిషానికి దూరాన్నే ఇసక లేస్తోంది రంయిమంటూ—మేఘాలు, నాటకరంగమ్మీద తెరలు పైనుంచి కింద కొంత గబగబా దిగజారతాయో అంతగబగబా అవి క్రిందనుంచి పైకి వన్నెరస్సల్తో లేచిపోయినాయి. లేచిపోయి క్రమేణా ధూమ్రవర్ణంలోంచి నల్లనల్లగా మారి కాఱునల్లనై చల్లని గాలితో ప్రాకిపోయినాయి. గోదావరి నీరంతా ఓవైపు అకుపచ్చనచాయగా మారిపోయింది, రెండోత్తట్టు కొంతసేపు ఉత్తరపుదిస సూర్యకాంతిని ప్రతిఫలించి అట్టే అదికూడా మాయంజేసివేసింది. అంతా ప్రళయమే ఘుఝుంఝూమారుతమయమై పోయి కళ్ళల్లో ఇసకా, దుమ్మూ కొట్టడం ప్రారంభించింది. పయిడయ్య వెనక్కి తిరిగి మళ్ళీ వూళ్ళో పడేసరి వెనకనుంచి ఎదో పెనుభూతంచెయ్యెట్టి తోస్తూ వున్నట్టు పెద్దగాలి రింవురింవు కొట్టసాగింది. పయిడయ్య తనగుడిసె చెంతకు వచ్చేసరికి గుడిసెమీదవి ఆకులైదారగిరిపోయినవి. ఉన్న నాలంగాకులుమీద అంతంత చినుకు టపటపా పడుతూవుంది. వడగళ్ళు కూడానేమో అని అనుకొన్నారు కొందఱు. ఇంకా మేఘం కమ్ముకుపోతూవుంది. చీకటి అయోమయం అయిపోయింది. ఇళ్ళల్లో దీపాలుపెడితే ఉండడంలేదు. తలుపులు ధమధిమ కొట్టుకోవడం మొదలుపెట్టి కొన్ని కొన్ని వాటంతటవే చిలకలంపడిపోయి సద్దణగి పోసాగినయి. పావిళ్ళు బూజుతో, కోడ్డుపట్టితో నిండిపోయినాయి. రంయిని ఆకాశం మెఱుస్తూ డబడబా ఉఱి

మితే ఒకమూల కొడిగిపోయి అమ్మమ్మలు 'అర్జునః ఫల్గుణః పార్థివః' అంటూవుంటే కుర్రవాళ్ళు దానికో దీనికో ఉలికిపడిపోవడం నాలుగైదుసార్లు జరిగింది. మోటర్లకోసమని వేసిన టిన్ రేకు షెడ్డులు ఎగిరిపోయి మోటారుకార్లు తడిసిపోయినయి. కొబ్బరాకు మట్టలూ బొబ్బాసి గొట్టాలు ఎగిరిఎగిరి సరిగా సైడుకాల్వలలో పడి నీటిప్రవాహాలకు అడ్డుకుని నీరంతా రోడ్లు ముంచేసేట్టు చేసివేసినయి. ఇక పడిపోయిన దడులకు, కూలిపోయిన గోడలకు, ఎగిరిపోయిన బళ్ళగూళ్ళకు, పరుగులెత్తిన పశువులకు లెక్కలేదు. ఒక్కనిమిషంలో తారుమారైపోయింది ప్రకృతి. ఒకగంట క్రితం ఎంత ఎండ అనిపించిందో గంట అయినతరువాత అంత చలి అనిపించ సాగింది.

కూలీలంతా తమగుడిసెలమీద ఆకు లెగిరిపోయిన కొద్దీ ఇక గుడిసెల్లోవున్నా వొకటే ఈవల నించున్నా వొకటే అని ఎంచుకొన్నవారై యివలకువచ్చి "అరె! కూర్చుండుకు ఒకకునుకుతీసి వెళ్ళిపోదాం అనుకుంటూంటే యింతలోకే ముంచుకొచ్చింది ముండా గాలి దుమారం." అని ఒకళ్ళకేసి వొకళ్ళు ఒకొక్కమాటు చూచుకుంటూ అందరూ కలిసి ఆకాశంకేసి చూడసాగేరు. వాన ఆగేటట్టుగాని గాలి మానే మాత్రంగాని కనిపించడంలేదు. పయిడయ్యకూడా అందరితో ఇవతలకువచ్చి "ఏంట్రా! అలాపరకాయిస్తారు. మనకేముందని? గునపాలు బుట్టాన్ని వేసికొని ఏ సత్రపు పంచకో పోదాం నడుండి' అన్నాడు. 'నీకేం చెబుతావు—పిల్లలు గలాళ్ళం, పెళ్ళాలు గలాళ్ళము మేం నీలాగు ఇట్టేలేచిపోలేం' అన్నాడు బసవయ్య అనే మతోటంటూవాడు. 'అయితే మీరు నిదానించుకురాండి. నేపోతా'నన్నాడు పయిడయ్య. అని తన గునపం బుట్టాన్ని పెట్టుకొని 'ఓసి! దీన్ని తగలెయ్య. ఇంకైపోయింది ఈ కాకీపట్లో' అని అనుకొంటూ తడిసిపోయి గోచీతోనే నడవసాగేడు— 'ఉండరా! మేమూవస్తాం' అని కొందరు కొడికూలీలు అంటూవున్నాగానీ—బసవయ్య 'వాడి చూపువేఱు. పోనియ్యండి గాడిదకొడుకుని' అని సణుక్కున్నాడు, కుట్టుగాచూసేడు పయిడయ్యకేసి. పయిడయ్య వీళ్ళే వినిపించుకోలేదు. తిన్నంగా తాళ్ళమునుగులోకి పయిడయ్య వెళ్ళేడు - సత్రప్పంచకూ కాదు, చలివేంద్ర పంచకూ కాదు.

పయిడయ్య తాళ్ళమునుగులోకి వెళ్ళేటప్పటికి గాలి యొక్క ఉద్ధృతం చాలావరకు తగ్గిపోయింది. జీమూతంగా మబ్బులింకా కమ్ముకుపోతూ జోరుగా వాన కురుస్తూవుంది మధ్యమధ్య ఓమాటు ఆగుతూ వచ్చినా. పయిడయ్య ఆ తాడిచెట్టు ఆ తాడిచెట్టు చాటునా మాటునా తాను నిలవడమే కాకుండా తనలాగే ఆ చెట్టు అవల పెనబడిగి గవళ్ళది తనకోసం ఎదురుచూస్తుం దేమోనని చెట్టుచుట్టూ తిరిగేవాడు.

క్రమంగా వానతగ్గింది. ఒక్కసారిగా పడమట దిక్కుంచు తెలుపియిచ్చిందేమో గఢీమని తాటిచెట్ల మీదకు ఈరండ పక్షి వ్రాలినట్లు వ్రాలింది. 'ఇంకా ప్రాణముకూలే' దనుకున్నాడు పయిడయ్య. ఆఖరుసారి ఆకాశాన్నంతా కౌగిలించుకు మరీ వెళ్ళిపోదామని సూర్యు డనుకొన్నట్టుగా ఒక్కసారి ఎఱ్ఱెఱ్ఱగా రంగు కూర్చుకుంటూకూడా ఎగచూపించి కుంకిపోయినాడు. 'ఓసి! అప్పుడే కుంకిపోయిందే పొద్ద'నుకున్నాడు పయిడయ్య. పక్షులు—గోరింకలేమిటి, చిలకలేమిటి, కాకులేమిటి, కొంగలేమిటి - అన్నీ కిలాకిలారావాలు చేస్తూ ఇవతలకువస్తూ లోపలకుపోతూ చెట్లశిరాల చుట్టూ తిరుగుతూ పెద్ద సందడిచేశాయి. ఆ సందడి ఎంతోసేపువిన్నాడు పయిడయ్య. ఎక్కడా ఆ సందడిలో పాకాలమ్మ గాజులు చప్పుడు కాలేదు. 'అరే ఈ వానకు గాలికి జడిసిపోయి వెళ్ళిపోయింది లాగుంది! కడసారి దానిచేతికల్లు కాసంత తాగి, ఓమాటుపోగాని దానివొళ్ళో ఉయ్యాలలూగి మరీ పోవాలనుకుంటే సాగిందికాదుకందా! దిక్కుమాల్న గాలిదుమారం— 'అయితే నివొచ్చేదాకా కూకుంటాను. చప్పునిరా' అంది—చప్పునే వచ్చాను—కూకుందికాదే! నే వచ్చేదాకా?' అని ఇలా పరిపరివిధాల వగలుపోయి నాడు.

తాటిచెట్ల మువ్వలుకేసిచూచినాడు. లొట్టిలన్నీ వేలపడిపోయి కొన్నీ, కిందపడిపోయి కొన్నీ చిన్నబోయి కనిపించేయి. ఓ జాము ఏమీతోచక తిరిగాడు తిరిగాడు, యిక తిరగలేక ఒకచోట తనబుజాన్ని వున్న గునపం నేలను దిగేసి విశ్రమిద్దామనుకున్నాడు. అనుకొని చతికిలబడ్డాడు, గరప నేలా కాసంత తెలుపి నేలా చూచుకొని.

వామా చతికిలపడేసరికి నడి ఆకాశంకూడా బొల్లిచ్చి చంద్రుణ్ణి వెలిబుచ్చింది. చూచేడు పయిడయ్య పైకి—'వహ్వా!

దివిజల్లు భువికొస్తె
భువికల్లు దివికెళ్ళె'

అని పాడేడు. పాడి తనపాట కనుక్రుతిగా విన్నాడు.

''కల్లుకుండా చుట్టు
కల్లు నురువేసూడు
దివిలోన భువిమీద
మూతికాడే కట్టు
పయిడయ్య బావా!
మూతికాడే కట్టు
పయిడయ్య బావా!''

చుట్టూచూచేడు. గవళ్ళ పాకాలమ్మ ఆ కుఱ్ఱకుంట గొంతల్లే వినబడ్డది. జాడకూడా చూపుల్లోపడ్డది. 'ఓ మఅదలా. ఆ కాడ దప్పతో దొప్పవుంది. నా దొప్ప వుంది తెచ్చిపెట్టు' అన్నాడు గట్టిగా. 'వెన్నెల్లో వెండిదొప్పంటూ పట్టుకొస్తావుంది జవ్వని జవ్వని చేతిలో లొట్టిలేదు. 'లొట్టిలేందే దొప్పెందుకు? పాకాలమ్మా! లొట్టుచ్చుకురా' అన్నాడు పయిడయ్య. జవ్వని దొప్పపారేస్తూ బాగా దగ్గఱకొచ్చి 'లొట్టిలన్నీ పగిలిపోయినయి, ఈవేళ. పయిడయ్యబావా! ఎంతఒట్టు పెడితే అంతఒట్టు' అంది. 'గాలికి నిట్టతాళ్ళన్నీ ఊగిసలాడిపోయి డీడిక్కు-లుకొట్టుకుంటె కామోను పిల్లా!' అన్నాడు పయిడయ్య. 'అయితేం. వెన్నెలపక్కే—కావు!' అంది జవ్వని. 'వెయ్యడమే కాదు. చంద్రుడిలో నలుపంతా భాండంగా కనిపిస్తే నలువు చుట్టు తెలుపంతా నురువులాగు పొంగివుంటే

నిన్నందివుచ్చుకోమంటున్నా పాకాలమ్మా!
నీవంది పుచ్చుకు వడ్డిస్తే పాకాలమ్మా!
దోసిటితో నా దోసిటితో
తాగబోతువున్నానే పాకాలమ్మా!
లొట్ట లేస్తువున్నానే పాకాలమ్మా!
లొట్టిలన్నిపోతే నేం పాకాలమ్మా!
దొప్పసితికి పోతేనేం పాకాలమ్మా!

అని రాగాలాపం సేయసాగినాడు. జవ్వని 'అంతి ఎత్తులేను బావా!' అంది. 'నా నడుంపట్టుకో ఎగిరి పోతాం' అన్నాడు పయిడయ్య. 'నా బొమ్మ కుండలు దిగనాగుతాయేమో పయిడయ్యబావా!' అంది జవ్వని. నీ మావిలేపి కైపెక్కించే నేన్' అన్నాడు పయిడయ్య. ఇలాగ్గా సరాగంమీద సరాగం, పరాసికంమీద పరాసికం ఆడుకుంటూ కిందామీదా పడుతూన్న నొసందులో చంద్రుడు మళ్ళీ మబ్బులలో పడిపోయినాడు. ఆసంగతి తెలియకుండా పయిడయ్య పాకాలమ్మ వళ్ళుమఱచి ఒకళ్ళనొకళ్ళు కాగిలించుకు నిదరోయినారు.

అర్ధరాత్రి చీకటి గుయ్యారంగా వుండిపోయింది.—వేసంగిలో కురిసినవాన కాబట్టి నేల ఆరిపోయింది. గాలి అదిరిగా బయలు కేరింది. నరదులూ, అసురులూ సంచారం ప్రారంభించేయి. మధ్యమధ్య దేవతలూ దయ్యాలూ కనబడసాగినయి. ఎవరికి? వొళ్ళు తెలిసిన వారికి. ఒళ్ళు తెలియనివాళ్ళకు? ఒక టేనిద్ర

నిద్రపోతూవున్నా నిద్ర పోతూ వున్న వాళ్ళను భద్రంగా చూచే దేవత భాగ్యదేవత వుంది, ఆ వనంలో. వాళ్ళ జే పాడు చెయ్యాలనిచూచే దరిద్రదేవతా వుంది ఆ వనంలో.

ఆ యిద్దఱూ సంచారంలో ఆరాత్రి కలుసుకొని ఒకరిప్రతాపం ఒకరితో చెప్పుకుంటూ యీ నిద్ర పోతూవున్న పయిడయ్య పాకాలమ్మగార్ల పడక దగ్గఱకు వచ్చినారు.

ఒకరికి తెలియకుండా ఒకరు, బాగుచేదామని భాగ్యదేవతా, పాడుచేదామని దరిద్రదేవతా పన్నాగాలు పన్నుతూవున్నారు.

దరిద్రదేవత కల్లుదొప్పను తీసుకువచ్చి పాతినగునపానికి కిరీటంగా పెడతానంటుంది. భాగ్యదేవత గునపం పుచ్చుకు కల్లుదొప్పను చీల్చిపారేస్తానంటుంది. ఇద్దరికీ పెద్దకయ్యం ప్రారంభమైంది. కల్లుదొప్పను తగలకుండాతీసి ఇనపగునపాన్ని బంగారు ఖడ్గీగాచేదామని భాగ్యదేవత తలంపు. ఏలాగన్నా కల్లుదొప్ప గునపానికి తగిలించి ఇనపగునపాన్ని చీపురుపుల్లగా చేసేదామని దరిద్రదేవత చలపట్టు. ఆ దేవతలియిద్దరి పరస్పరార్భాటానికి కలగనిలేచిన వాళ్ళమల్లే పయిడయ్యా, పాశాలమ్మా మేలుకొన్నారు. దేవతలిద్దరూ చెలిరేయిక పైపునకు పారిపోయినారు.

పయిడయ్య చుట్టూచూచి 'ఎవరూలేరు' అన్నాడు. 'తెలపోవడమేమిటి? ఇద్దరాడోళ్ళు కజ్జా ఆడుకుంటూవున్నట్టయితేనే' అంది పాశాలమ్మ. 'నీవు అవితే నాకొచ్చిన కల్లాంటికలే వచ్చిందే' అన్నాడు. 'అది కలేఅంటావా?' అంది పాశాలమ్మ. 'కాకపోతే మనుష్యులేరీ?' అన్నాడు పయిడయ్య. పాశాలమ్మ అంది 'అపరాత్రి తిరిగింది. నేనింటికిపోతా.' నంది. పయిడయ్య అన్నాడు 'కోడికూసేవేళ నేనూవెళ్ళిపోతా, నీచేతికల్లియేళ సహనూడ్లిచ్చినావుకాదు కందా?' అన్నాడు పయిడయ్య. 'నేనేంచేసేది బావా! గాలి దుమారంవచ్చింది' అంది పాశాలమ్మ. ఒకరిమీదొకరొరిగి ఒదిగి పడిపోయి వీడ్కోలు గొన్నారు. పయిడయ్య నిదరబట్టాడు. పాశాలమ్మ వెనక్కి చూస్తూ 'ఉంటే తాగిపోతా డీపా ఉంకాలం.' అని తనకాళ్ళ ముందున్న కల్లుదొప్పతీసి వాని గునపాన్ని తగిలించి చక్కాపోయింది.

'నేచేసేపని అదేచేసింది.' అంది దరిద్రదేవత. అని అట్టై మంత్రించింది. ఇనపగునపం కర్రముక్క అయిపోయింది. భాగ్యదేవత సిగ్గుపడిపోయి నిష్క్రమించింది. దరిద్రదేవత చంకలు కొట్టుకొంటూ గంతులు వేసింది.

తెల్లవారగట్ల కోడికూసేతలికి పయిడయ్యలేచేడు. చుట్టూచూచి గునపంకోసం వంగున్నాడు. అది కర్రగావుంది. ఆకర్రకో దొప్పవుంది. 'ఓరి దీంతగలెయ్య! పాశాలమ్మ కాదులాగుంది. పిశాచం అనుకుంటాను. నా గునపం! నా పనిముట్టు! నా జీవనసాధనం!' అనుకుంటూ ఆకర్ర ఆదొప్ప పుచ్చుకుని తిన్నగా ఊళ్ళోకి గరువళ్ళగూడెంలోకి పరుగెత్తేడు.

పరుగెత్తి పాశాలమ్మవున్న యింటితలుపుకొట్టేడు. 'పాశాలమ్మా? పాశాలమ్మా!' అన్నాడు. 'ఓయి వెళ్ళేలే పయిడయ్యబావా!' అంది పాశాలమ్మ. 'ఇల్లారా' అన్నాడు పయిడయ్య, 'నన్నింత మోసం చేస్తావా!' అన్నాడు. అని కర్రాదొప్పా చూపించేడు. 'నా గునపం పట్టుకుపోతావు?' అన్నాడు. పాశాలమ్మ అంది 'అలాంటి పాడుమాటలు అన్నావా అంటే నాకాలి అకుజోడు కదరాద్ది' అని. సిగ్గుపడిపోయేడు పయిడయ్య. 'బాకీ డబ్బులుంటే రామట్టుకోవాలిగాని మోసంగా నా కాడతొంగుని దొంగపని సేస్తావా!' అని అనుకొన్నాడు లోలో పయిడయ్య. ఆ ముక్కలు వినింది పాశాలమ్మ. 'నీవేం బాకీలేవు బావా! వెళ్ళు, వెళ్ళు.' అంది పాశాలమ్మ. అంటూ తలుపు వేశేసుకుంది 'తోట్లో పరుశ్శు పూళ్ళు త్రొక్కడు తమ్మలుతినేవు' అంది తలుపుసందులోంచి చూస్తూ.

'కర్రా, దొప్పా పయిడయ్య చేతికొచ్చినయి. మోసంచే మారు' అనుకున్నారు అంతాను. భాగ్యదేవత వొక్కక్షణమాత్రం 'వాడికర్మ వాళ్లైకుడిపింది' అని అనుకుంది. ఎంచేత? తనశాయశక్తులా తంటాలు పడింది, కల్లుదొప్ప పాటుపడే గునపానికంటరాదని. కాని సహాగ్యకోపం తప్పించడానికి సాధ్యంకాక పోయింది, భాగ్యదేవతకైనాను.

పయిడయ్యకు మళ్ళీ కల్లోసినవాళ్ళూ లేరు కలోసినవాళ్ళూ లేరు - పాపం!

—కవికొండల వేంకటరావు,
బి.ఏ.,బి.యల్.

# సత్యాన్వేషణ

[ఆలోచనశీలురు ఈ వ్యాసమును తప్పక పఠింపవలసినదిగా మా పాఠకులను కోరెదము. 'మనం చాటుగా చేస్తున్న పనులు ఇతరదేశాల్లో బహిరంగంగా చెయ్యటంవల్ల మనకు ఆ దేశాలనుచూస్తే కొంత నిరసన కారణమన్నముక్క మరిచిపోగూడదు! అంత సత్యాన్ని మనం ఎదుర్కొనేస్థితికి వచ్చినతరవాత-కాలక్రమాభివృద్ధిలో-మనం వాళ్ళల్లే కావటానికి అనేక అవకాశాలు లేకపోలేదు!' అను ఇందలి వాక్యములోని అంతరార్థము ఏవిధమో తర్కించుడు.]

సత్యాన్వేషణ ఎందుకు చెయ్యబడాలంటే ఎవరూ చెప్పలేరు. సూర్యాస్తమయం కాగానే దీపాలు వెలిగించుకోవటం ఎందుకు? భగవంతుడిచ్చిన చీకటితో తృప్తిపడి ఉండరాదూ? అజ్ఞానికూడా ఉండరాదనే తోస్తుంది మరి. తమస్సులో పుట్టాం; సత్యాన్వేషణ చేసి తీరాలి. కాలక్రమాన మనోచైతన్యంకలవాడికి "ఇది పరమార్థం" అనే నమ్మకం ఎప్పటికో అప్పటికి కలిగి తీరుతుంది. సందేహం లేదు.

సత్యమనేది భిన్నంగా ఉంటూంటుంది. గణితశాస్త్రానికి సంబంధించిన సత్యం ఒకటుంటుంది. యాభైమంది కూలీలు ఒక బండను ఒక నిమిషంలో యాభై అంగుళాలు దొర్లించగలిగితే, గణితశాస్త్రం ప్రకారం ఒకడు అదేకాలంలో అదేబండను ఒక అంగుళం దొర్లిస్తాడనటం సత్యం. ఆ ముక్క పదార్థవిజ్ఞానశాస్త్రజ్ఞుడికి చెప్పితే "ఫ్రిక్షన్" అనే కొత్తవిషయం ఒకటి ఎత్తి ఒకడి కాబండ మొదలు కదలనేకదలదంటాడు. తార్కికుణ్ణడిగితే మనుష్యులంతా సమానమైన బలంగలవాళ్లుగా ఉండాలి కదా లెక్కచెయ్యటానికంటాడు. మనం కూడా కొంత తర్కంఉపయోగించి ఈ ఒక మనిషి సరిగా ఆ యాభైమంది యొక్క మొత్తం బలంలో యాభయ్యోవంతు బలంగలవాడనుకోమనాలి. అప్పుడు అవతలవాడు అది సరిగా నిర్ణయించటం కంటె ఒకడిచేత ఈడ్పించిచూడటం చాలా సులభమని చెప్పి గణితశాస్త్రం ఎందుకూ పనికిరానిదని నిరూపిస్తాడు.

కనక సత్యమనేది భిన్నంగా ఉంటూంటుంది,

కొంచెం ఆలోచిస్తే సత్యమనేది లేనే లేదని సిద్ధాంతం చెయ్యవచ్చును. మనకు కనపడుతున్న ప్రపంచాన్ని గురించి మనం తెలుసుకోవాలంటే పంచేంద్రియాలు తప్ప గతిలేదు. వాటిలోపాలన్నీ. కంటి అద్దం యొక్క రంగల్లే సత్యవీక్షణానికడ్డం అవుతై. భూదేవి ఒకవిధమైన గంధం—దుర్గంధమైనా సరే, సుగంధమైనా సరే—వెదజల్లుతూండవచ్చును. మనం కనుక్కోగలగటం అసంభవం. గాలికి రంగుండవచ్చును. మనకు తెలీదు. దూరాన చాకలవాడు బట్టలు ఉతుకుతూంటాడు. కన్ను మూసిన కొంతసేపటికి చెవి వింటుంది. కొత్తలో కన్ను నిర్ఘాంతపోయింది. కంటిలోపంకంటె చెవిలోపం జాస్తని తెలుసుకున్నప్పుడు కన్ను చెవిని హేళనచేస్తుంది. చలికాలంలో గచ్చుతగలగానే ప్రాణం

పోతుంది, కంబళి కప్పుకోగానే వెచ్చగా ఉంటుంది. కాని గచ్చెంత చల్లగాఉందో కంబళీ అంత చల్లగానేఉంది. ఐతే గచ్చు నీవేడి నాకిమ్మంటుంది; కంబళి అనదు! వెధవగచ్చు చల్లగా ఉందంటాం! అబద్ధం!

ఈ సందర్భంలో ఒకప్రశ్న? సత్యాన్వేషణపరుడికి గచ్చూ, గొంగళీ సమానంగా చల్లగా ఉన్నవనేది ఎంతవరకు ఉపయోగిస్తుంది?

ఇంకో ఉదాహరణ :—

ఒక ఎల్లమ్మ ఒక పుల్లయ్యతో పోతున్నదని ఏమీలేందే పుకారుపుట్టింది. ఎల్లమ్మ అందరితో పోయి "నన్ను పుల్లయ్యతో పోతున్నానంటున్నారో?" అని మొరపెట్టుకుంది. అప్పు డెవరైనా తార్కికుడు ఎల్లమ్మతో "నువు పుల్లయ్యతో పోయినావంటున్నారనేనా, నీ అభ్యంతరం? అసలుపోయినమాట ఉత్తదేకదా? అవటానికొస్తే నీనోటిమీదిగా నువ్వూ అంటునే ఉంటివిగా— వాళ్ళన్నదానికి నూరిన్నిపార్లు?" అంటాడనుకుందాం. తార్కికుడు చెప్పింది నిజమే ఐగాక! ఎల్లమ్మ ఆత్మ వంశాంతించింది?

ఆవిధంగానే—మశూచికం మహామారీ కాదూ మట్టిగడ్డలూ కాదు, క్రిములవల్లకలిగే జాడ్యంఅని తెలుసుకున్నంతమాత్రం చేత మశూచికంపడ్డవాడి కేం ఒరిగింది?

ఇది ఇట్లాఉండగా సత్యాన్వేషణ ప్రియుడు జాగర్తగా ఉండకపోతే ప్రమాదం ఉంది!

థామస్ హార్డీ మహాశయుడు రాసిన ఒక నవలలో కథానాయిక తనేదో మంచిపని చేస్తున్నాననుకుని తనభర్తతో తన్ను చిన్నతనంలో మరోడు చెరిచిన సంగతి చెప్పేస్తుంది. ఆక్షణంనించీ కథ నిరాఘాటంగా విషాదాంతం కావటం మొదలుపెడుతుంది. ఎవరుకానీ భరించలేని సత్యాన్ని తెలుసుకోకూడదు ఇటువంటిది దాంపత్యంలో ప్రతి స్వల్పవిషయంలోనూ జరుగుతూంటుంది. పెద్దవిషయా లట్లాఉంచి సంఘంలో ఒకరిని గురించి ఒకరు అనేకస్వల్పవిషయాలు తెలుసుకోకూడదు. కాఫీ అలవాటైనవాళ్లు ఒక్కొకరు కాఫీ తాగుతుంటే అటువేసి చూడకూడదు!

తెలుసుకోకూడని విషయాలున్నట్లే తెలుసుకోబడవలసిన విషయాలున్నై. అవి మతాచారాలదాస్యంనించి విముక్తిపొందటమూ వాటితాలుకు సత్యం ప్రచారం చెయ్యబడటమూ జరగాలి. మశూచికంఉంది. దాన్ని వెపకటిమాదిరిగా నమ్మకాలతో నయం చేసుకోనక్కర్లేదు. రాకుండాచేసుకోటానికీ వస్తే నయంచేసుకోటానికీ వైద్యంఉంది. ఆ విధంగానే ఈ రోజుల్లో 'ఏమోనబ్బా! నాకు పరలోకాన్నిగురించి ఎంతమాత్రమూ నమ్మకంలేదు. నేను ఉమర్ ఖయామ్ పద్ధతి మీద నడుస్తాను!' అనక్కర్లేదు. ఆవిషయమై ఇంగ్లీషులో కావలసినంత వాఙ్మయంఉంది.

ముఖ్యంగా మతం నమ్మకాలతో కూడినది. వందసంవత్సరాలక్రితం మతగ్రంథాలలో ఉండదగిన విషయా లీకోజున శాస్త్రగ్రంథాల్లో ఎక్కుతున్నై. అందుచేత మతం సంస్కరింపబడుతూండాలి. అటువంటి పని చెయ్యటం ఇష్టమో శక్తో లేక అవసరమైన సత్యప్రచారాని కడ్డుపెట్టటం మూర్ఖలక్షణం.

సత్యాన్వేషణను గురించి నాకు తోచిన అంశా లివి.

(1) ఏ అమానుషదృష్టిలోనైనా సత్యం మిధ్యకావచ్చుగాక. సత్యాన్వేషణ చేసే

వాడికి మానుషదృష్టే ఆదర్శం. సత్యాన్వేషణకు ప్రత్యేకశాస్త్రీలంతటివ పరిపూర్ణత్వం లేదు.

(2) సత్యాన్వేషణ మానవతత్వానికి సరిపడేటట్టుండాలి. ఆ తత్వంయొక్క అభివృద్ధి సత్యాన్వేషణకు అనుకూలంగా జరగాలి కాని ప్రతికూలంగా జరిగరాదు. ఆ రోజు కారోజు మనిషి ఎక్కువసత్యాన్నెదుక్కుంటూండడమే రానురాను కలికాలమనిపించుకుంటూండటానికి ముఖ్యకారణం. వెనకటి చరిత్రలు కవులురాస్తే ముందురాబోయే చరిత్రలు శాస్త్రజ్ఞులు రాస్తారు—ఆ మాట మరిచిపోగూడదు! మనం చాటుగాచేస్తున్న పనులు ఇతరదేశాల్లో బహిరంగంగా చెయ్యటంవల్ల మనకు ఆ దేశాలనుచూస్తే కొంత నిరసనకు కారణమన్నముక్క మరిచిపోగూడదు! అంత సత్యాన్ని మనం ఎదుక్కునే స్థితికి వచ్చినతరవాత—కాలక్రమాభివద్ధిలో — మనం వాళ్ళల్లే కావటానికి అనేక అవకాశాలు లేకపోలేదు!

(3) సత్యాన్వేషణ చేయబడ్డ విషయాలనుగురించి నమ్మకాలు కలిగిఉంటాననటం పొగరుబోతుతనం.

నమ్మకాలు సహజమైనవి కావు. ఆ మాటకొస్తే మనిషి ఒకకాలిమీద నిలబడటంకూడా అసహజమే. కాని నడిచిపోతున్నవాడు ప్రతిమరుక్షణమూ ఒకకాలిమీద ఉంటుంటాడు. అట్లాగే ముందుపొయ్యేవాడు సత్యాన్వేషణ చెయ్యబడని విషయాలనుగురించి నమ్మకాలు కలిగించుకోవటం తప్పులేదు. వాటిని యుగాలతరబడి నమ్మకాలకిందనే ఉండనివ్వటం చాలా అసహజం.

—కొడవటిగంటి కుటుంబరావు.



## "అదియ యేకాంత మైన"

అదియ యేకాంతమైన అన్యోన్యమధుర
భాషణమ్ముల ప్రసరించి ప్రణయరాగ,
మన్నదావేశకళ లంటి, ఐక్యపరచి
మన మనమ్ముల పాడుకొమ్మనదె మనల
నవ్యగీతాలు;
శాశ్వతానందకాంతు
నెవరు కనరానిచోటుల కెగిరిపోయె!
కనుగొనల నుండివదలిన, మినుకుమినుకు
మనిన, ఎడద కలంచిన ఆర్ద్రీయ
దృక్కుల స్రవించె ప్రేమసందేశలహరి!
తేల్చి తేల్చియు, పై రెప్ప వాల్చి, ఆచి
ఆచి, దృగ్గోళికల నూపినైచినావు!
వేడినిట్టూర్పు గాలికి వెచ్చగిల్లి
నీలధమ్మిల్లశిఖలలో వ్రేలబడిన
మల్లె విరిచెండులే నాట్యమాడదొడగ!
చూపువాలున తరలి నావైపుజాగు
కోమలారుణపాణి గైకొన దలంచి
చకితహృదయుడ నే చేయి చాచులోన
ముడుచుకొనినావు;
నాప్రవాలుమె డిటుత్రిప్పి,
జీరవోయిన గొలుగు కుంచించి, 'హా' యు
టన్న దూరాన నా కేక కద్రరాజు
నిద్రలేచి తలెత్తి కన్విచ్చిచూచె!

—రెండుచింతల లక్ష్మీనరసింహశాస్త్రి.

# అరవిందబాబు జయిలుడయిరీ

(అముద్రితము)

['గౌతమశాక్యముని జన్మదినము భారతదేశమునకు దుర్దినము —బౌద్ధుడు భారతీయులకు దయాదృష్టినిచ్చి వారిని నపుంసకులనుగా చేసినాడు—శృంగారమును సాహిత్యమున ప్రధానాంగముగ భావించి మన దేశము తప్పుమార్గమును పట్టినది.' అని ఈ వ్యాసమున దేశపాండే అనుచున్నాడు. సావకాశమున చదివి ఈ విషయములు చర్చింపదగి యున్నవి. కార్యక్షేత్రమున, కావ్యక్షేత్రమున పూర్తియగు మార్పు వచ్చినగాని భారతదేశమునకు ముక్తిలేదా ?]

ప్రాతఃకాలపు సంధ్యావందనము, అగ్నిహోత్రము అయిన వెనుక నాగదిముందు వసారాలో కంబళిమీద కూర్చున్నాను. ఇంతలోనే దేశపాండే వచ్చినాడు. అతని వెనుకనే మోహనలాలు.

నేను:—ఏమి నేడింత తొందర?

దేశపాండే:—రాత్రి నిద్రయే పట్టలేదు.

నేను:—కూరుచుండుడు. ఎందుచేతనని?

దేశపాండే మోహనలాలులు నా ప్రక్కగా కంబళిమీద కూర్చున్నారు.

మోహనలాలు నవ్వి అన్నాడు:—ఏమిచెప్పను? జనానికి బుద్ధిలేదు. వారినిచూచిన ఆశ్చర్యము వేయుచున్నది.

నేను:—సరే, నిన్నటి చర్చ కాక, నీవు చక్కని విషయమెత్తినావు. అన్నివిషయములు నా కిష్టములేక పోయినను నీ యుద్దేశాలు వినవలెనని యున్నది.

మోహనలాలు:—అవును. తప్పక చెప్పండి.

దేశపాండే:—అందుకే నేను వచ్చినాను. నేను అనుచున్నాను—గట్టిగ అనుచున్నాను. ఏనాడు భారతదేశంలో గౌతమశాక్యముని జన్మించినాడో ఆనాడే భారతవర్షపు టదృష్టము బ్రద్దలయినది. భారతవర్షమునకది చాల దుర్దినము.

నేను అదరిపడ్డాను:—ఎందుకని?

దేశపాండే:—ఎందుకనియా? అతడు భారతనాగరకతలో క్షత్రియుడయి యుండి యొక నీచమనో వృత్తికి ప్రాధాన్యమిచ్చినాడు. దానివల్లనే ఈదేశము ఈజనులు ఇంతవరకు బాధపడుచున్నారు.

నేను:—ఎట్లు? నీ యుద్దేశము స్పష్టముగా చెప్పు.

దేశపాండే:—నా యుద్దేశమిది. దయాధర్మములు - జినతీర్థంకరులు, బుద్ధుడు ప్రచారముచేసిన దయాధర్మములు దేశములో పిరికితనముగ వ్యాపింపజేసినవి. భయమునకు, పిరికితనమునకు, హృదయదౌర్బల్యమునకు ధర్మమనెడి చక్కని రూపమునొసగి, దేశజీవనమునకు ప్రాణమువంటి శక్తిని, భావమును నాశముచేసినారు. నాకు క్షత్రియధర్మమన్న నిష్టము. కళింగయుద్ధములో అశోకుడు హృదాహతుడైనాడు, ఏడ్చుచున్న కొందరు సైనికులనుజూచి యుద్ధమును అసురమని, నింద్యమని, త్యాజ్యమని నిశ్చయించినాడు. దయాధర్మమునకు, బౌద్ధధర్మమునకు దాసుడైపోయినాడు. కొంచెము ఆలోచించండి ఇది దేశదృష్టిలో నెంత భయంకరమైన ప్రమాదమో ! యుద్ధము......

దేశపాండే తన సంభాషణమును సాగించుచునే యున్నాడు. కాని నామిత్రుడు మోహనలాలు-మధ్యమధ్య ప్రశ్నలడుగు స్వభావము గలవాడు—పలికినాడు.

'పాండే! కొంచెమాగు. నే నొకమాట అడుగవలసి యున్నది. నీవు యుద్ధమును యుద్ధవిద్యను దేశజీవితమునకు ప్రాణమనుచున్నావు. ఈ సిద్ధాంతము ననుసరించియే యూరపు వినాశమార్గమున పోవుచున్నదని, ఈ

సిద్ధాంతమునకనుసరించి ఎప్పుడో యొకనాడు అక్కడి సమస్తజాతులు, వాని సంపూర్ణ నాగరకత నాశమగునని నీకు తోచుటలేదా? భారత దేశమింకను బ్రతికి యున్నది.'

దేశపాండేముఖము ఎఱ్ఱనైనది. తనచోటున దృఢముగా కూర్చుండెను.

అతడన్నాడు:—భారతము బ్రదికియున్నది! భారతము బ్రతికియున్నది!! దాని బ్రదుకుమీద నీకు అభిమానమున్నది.

ఇట్లనుచు దేశపాండే తనచేతిలోని పుస్తకము నేలపై విసరికొట్టెను.

మరల నతడు:—'ఏమిటి? భారతము బ్రదికియున్నదా? ఎక్కడ! దేనిలో ప్రాణమున్నదో, చైతన్యమున్నదో, ఆత్మాభిమానమున్నదో నొప్పించినచో నేది అదరిపడునో, దేనిని దూషించినచో పోరాటమునకు నడుముకట్టునో అది బ్రదికియున్నట్లు. కాని దేనిలో జీవితమునకు ఉన్నతికి పూనికలేదో, ఏది పరరాష్ట్రముల కాలితాపులు పెక్కులుతినియు తెలియలేదో, అది బ్రతికియున్నట్లు చెప్పుదుమా? దానియెడల నభిమానమా? ముక్కు-మూసికొని చావవలసినది. జీవితము పశ్చిమరాష్ట్రములలో నున్నది. జర్మనీలో జీవితమున్నది. నీవు పశ్చిమరాష్ట్రమున బ్రదుకుచూడలేదు. నేను బర్లినులో నున్నప్పుడు, ఏమిచెప్పను! నీకు జర్మనీ జీవనశక్తిని కొంత చూపుదువచ్చితిని

గడచిన యిరువది సంవత్సరములలో జర్మనీకి ఏయే యాపదలు కలిగినవో, అదియే కష్టముల నెదుర్కొన్నదో ఆ యాపదలు చైనా, భారతము, పారసీకము మున్నగు తూర్పురాష్ట్రములకే కలిగియున్నచో నవి నేటిలేకుండపోయియుండును. మొన్నటి మహాయుద్ధములో జర్మనీ యొక్కటే నాలుగున్నర సంవత్సరములదాక జాగ్రత్తగ తయారుచేసిన సమస్తప్రపంచ సైన్యములతో డీకొన్నది.

ఈ యుద్ధములో ధనము, జనము ఎంత బలియైనదో యెల్లరకు దెలియును. దానికీయుద్ధమునకు ప్రతిదినము ఏడున్నరకోట్ల రూపాయలు ఖర్చుపెట్టవలసివచ్చినది. దాని నోడింపవలయునను పట్టుదలతో నెదిరిరాష్ట్రములు చేయని యెత్తులులేవు. చివరకా యుద్ధమున జర్మనీ యోడిపోయినది. అందుకు ఫలముగా పడమటిప్రష్యా, ప్రోసెను, డేన్జిగు, అలసేసు, లోరేను మున్నగు ప్రాంతములు దానిచేతినుండి జారిపోయినవి. వానితోబాటు దాని వ్యాపారమంతయు పాడయిపోయినది.

జర్మనీవారు తమ యధినివేశములందు వ్యాపారమున పెట్టిన 160 కోట్ల రూపాయలు, వ్యాపారప్రవాహలు, లక్షలకొలది విలువచేయుభాగ్యు, రైలుపట్టాలు, యంత్రములు, మందులు, శస్త్రములు లోబఱచుకొన్నారు. 80కోట్ల రూకల యంత్రసామగ్రి పాడుచేసినదని దాని సామానంతయును గెలిచినవారుదములో లాగుకొన్నారు. 700కోట్ల రూపాయలరొక్కము దానినుండి గుంజుకొన్నారు. జర్మనీకి అధినివేశములు పోవుటవలన 1600కోట్లు నష్టమయింది. యుద్ధముచేయుటకు 2400 కోట్లు తాను ఖర్చుచేయవలసివచ్చెను. అయినను 20 సంవత్సరములలో నది యీ సమస్త కష్టనష్టములను పౌరుషముతో గడచగల్గినది.

భారతమునకేమి కష్టము కలిగినది? మహమ్మదు గజనీగోరీల యాక్రమణము నీవు చెప్పవచ్చును. కాని యెదుట నివి యెంతపాటివి? భారతమునకు ప్రాణమే యున్నచో నిరువది సంవత్సరములలో నా లోటును గూడ దీసికొనునది. వేయిసంవత్సరములదాక నలిగి నలిగి కృశింపనక్కరలేదు.

పాండే దారి తొలగిపోయినాడు. అప్పుడు నే నన్నాను.

'అసలు విషయముపోయినది. గౌతమబుద్ధుని విషయము వెనుకపెట్టి, యుద్ధములోనికి పోదలచి, జర్మనీమీదికి పోయినావు. మరల అసలు విషయములోనికిరా.'

దేశపాండే:—అవును, నేను యుద్ధవిషయము చెప్పుచున్నాను. క్షాత్రధర్మమే ప్రధానధర్మమని నా దృఢనిశ్చయము. దీనిని కుశలతాపూర్వకముగ పాలించిననే బ్రాహ్మణధర్మము, వైశ్యధర్మము, శూద్రధర్మము

నెఱవేరగలవు. ఈ ధర్మమును నిరాకరించినచో బ్రాహ్మణుడు బ్రాహ్మణుడుకాడు. వైశ్యుడు వైశ్యుడు కాడు. అంతయు శూద్రులే. శూద్రులైనను కూటికి కఱవే. పశ్చిమరాష్ట్రములలోకూడ నిటువంటి కష్టము ధర్మమురూపముతో గలిగినది. అక్కడ యేసుక్రీస్తు జన్మించినాడు. ఈయనయు బౌద్ధధర్మమువలెనే దయాధర్మము ప్రచారముచేసినాడు. ఎక్కడైన నొకని చెంపను గొట్టినచో రెండవచెంపనిమ్మని చెప్పియుండెను.

'పాశ్చాత్యదేశములు క్రైస్తవమతమును స్వీకరించినవి. కాని దాని నిజభాగమును గాదు. క్రైస్తవదేశములు క్రీస్తుధర్మము నవలంబించియుండినయెడల తమ సైన్యములను కట్టుదిట్టములు చేసికొనజాలవు. ఇంత యభివృద్ధిని పొందియుండవు. అవియు భారత, చైనాలవలె నెవరో యొకరాజుక్రింద నుండునవి. కనుక నా యభిప్రాయమేమనగా హిందూదేశమున నూతనయుగములో క్షాత్రముధర్మప్రధానమైనమతము ప్రచారము కావలయును. బౌద్ధమతమువలన గలిగిన నపుంసకత్వము ఈ జాతినుండి తీసిపారవేయవలయును.

కేశపాండే పూనికగా కూర్చున్నాడు. చాల పట్టుదలతో మాటలాడసాగెను. అతడన్నాడు.

'రెండవవిషయము దయాధర్మములు వ్యక్తిగతరూపముగా పాటింపబడినయెడల మంచిదియున్నను సంతోషమే. కాని దేశదృష్టితో జూచినచో మిగుల హానికరము, భయంకరము.'

మోహనలాలు అన్నాడు:—'అదెట్లా?'

కేశపాండే: 'ఒకయూరు మంచి దనుకొనుడు. దరిద్ర బిచ్చగాండ్రందరికి అంబలి అన్నము దొరకును. రోగులకందరికి సేవాశుశ్రూషలు వారు చేయుదురు. మంచి శ్రద్ధతో వారు దివ్యాన్నములను సంపాదించుకొనగలరు ఆ యూరిలో. కుంటియావులను, చావనున్న యావులను వారు చక్కగ మేపుదురు. భారతదేశములోనున్న నన్ని యూళ్ళు ఇట్లు దయాపద్ధతి ననుకరించినచో యేమగును? దేశములోనున్న ధనమంతయు తెలివితక్కువ వారిక్రింద, అనారోగ్యుల క్రింద ఖర్చయిపోవును.

అప్పుడు ప్రోత్సాహము దేనికి కలుగును? తెలివితక్కువకు అనారోగ్యతకు. పోషింపదగనివారలను, పనికిరాని వారిని పోషించుచు కూర్చున్నచో దేశమున కేమి లాభము? ఆరోగ్యనియమములను లక్ష్యపెట్టనివారియెడల, అనవసరరోగపీడితులయెడల, పాలుగను లోభులకై పొట్టను చెడగొట్టుకొని గ్రహించి తెచ్చుకొన్న వారియెడల, మద్యపానము, వ్యభిచారము, స్వేచ్ఛాప్రవర్తనముల మూలమున క్షయరోగమును గొని తెచ్చుకొన్నవారియెడల సానుభూతి యెందులకు జూపవలయును? వారి క్రింద నొక్కదమ్మిడీ యయిన నేల ఖర్చుపెట్టవలయును? వీరు దయకు పాత్రులుగారు. అట్టివారి నా దేశములో కాపాడినను వారివలన లాభమేమియుండును? ఎప్పుడైన దేశముపై పరదేశీయులు దాడియెత్తి వచ్చినచో నప్పుడు వీరెల్లరు కడుపునొప్పి యనుచు, తల పట్టుకొనుచు 'మా యారోగ్యము సరిగాలేదు. మేము లేవలేము' అందురు. లేక సాధారణగృహస్థాశ్రమమునందున్నచో దేశసంతతిసంతతిని పాడుచేయుదురు. ఏమనగా వీరిపిల్లలు దుర్బలులు, రోగులు, దురాత్ములు అగుదురు. మీరు వినలేదా జర్మనీలో హిట్లరు రోగులను బలహీనులను నపుంసకులగ జేసివైచినాడు. ఎందువలన? పనికిరాని గేదెను, ఆవును మేపవలయునన్నచో మందినుండి దానిని వేఱుగా లాగివేయవలయును. కుక్కలకు పంజరములు పెట్టుచుండువారిని జూచిన నాకు నవ్వువచ్చుచుండును. అట్టి పిల్లికుక్కలను కేయించికి పెంచినను ప్రయోజనమేమి? కనుక ఈ దయాపద్ధతి దేశదృష్టితో ఆర్తులను బ్రతికించుటకు సహాయపడుచున్నది. దయాపద్ధతిని వదలిపైచి అర్హతాపద్ధతిని స్వీకరించినచో అనగా కుశలులకే సహాయము చేసినచో కొద్దిదినములలోనే మనదేశము బలవంతులు, ఆరోగ్యులు, ధీరులు, వీరులు అగు స్త్రీపురుషులతో నిండిపోవును. బలహీనులు, తెలివితక్కువ, వెర్రిదద్దమ్మలు, పనికిరాని జీవచ్ఛవాలు, రోగిష్టులు ఒక్కతరములో పీడ వదలిపోవుదురు. ఈ కఠినపరీక్షలో నెగ్గినవారు దృఢకాయులు, బలవంతులు, వీరులు.

కేశపాండే ముఖమునపై అకస్మాత్తుగా—అకార

ణముగా లేతవయస్సు ప్రసవించినది. అతడు సాగించినాడు.

నేను మీకొకకథ చెప్పెదను. సహాయనిరాకరణోద్యమములోనికి రాకముందు నే నొకపట్టణములో డిస్ట్రిక్టుఇంజనీయరును. అప్పటి వదియేడ సరకారువా రొకవంతెన కట్టించుచుండిరి. నేనును ఇన్‌చార్జిగా నున్నాను. నా కిద్దరుముగ్గురు ఓవర్సీయర్లు కావలసివచ్చినారు. వార్తాపత్రికలలో ప్రకటించినాను. దరఖాస్తులు చాలవచ్చినవి. ఎవరిని తీసికొనవలయునో నిర్ణయింపవలసినది నేను. చలికాలము. ఒకనాడు ఉదయమున తేనీరుత్రావి నా వరాండాముందు చిన్నబల్లవేసికొని కొన్ని కాగితములు చూచుకొనుచుంటిని. ఇంతలో నా సేవకుడు వచ్చి 'ఎవరో పెద్దమనుష్యుడు తమ దర్శనమునకు వచ్చినాడు' అని చెప్పెను. రమ్మని కబురంపితిని. ఒకనవయువకుడు షరాయి, కోటు మొదలగునవి తీరుగా వేసికొని వేగమె నాయొద్దకువచ్చి మిక్కిలి వంగివంగి నమస్కారముచేసి చేతులుజోడించుకొని నిలువబడి పలికెను. 'అయ్యా! నా పేరు సంతరాము. నేను మిక్కిలి బీదవాడను.'

'అతని యుద్దేశము నాకు తెలియలేదు. నేనన్నాను. సరే! చెప్పండి, మీ రెందుకు వచ్చినారు?'

అతడన్నాడు. 'నేను...స్కూలులో ఓవర్సీయర్ పరీక్షకు చదివినాను. అయినను నాభార్య అప్పుడు ప్రసవించి చనిపోవుటవలన నేను పరీక్షమాత్రము మీయలేదు. నాతండ్రికూడ చనిపోయినాడు. నేను భుక్తికి కూడ జరుగకుండనున్నాను. తమరు దయతలచినచో తామే భోజనముపెట్టినవారగుదురు. పిల్లలు తమపేరు చెప్పుకొని బ్రదుకుదురు.'

'నే నప్పుడేమియో నాలుగుమాటలుచెప్పి అతని నవతలికి పంపినాను అప్పుడు నామనస్సులో నాలోచనలు కలిగినవి. హిందూజాతి స్వభావ మెంత విచిత్రమైనది. నాకు కావలసినది ఓవర్సీయరు, అతడు వంతెన కట్టుబడిలో నాకు కుడిబుజముగా నుండవలెను. వంతెనయో ఎంతపెద్ద వరదవచ్చినను చలింపరాదు. మిక్కిలి బరువుగల రైలుబండి-ఇంజను వెళ్ళినను కదలరాదు. కాని యీతడువచ్చి తన బీదతనమును జెప్పుకొన సాగినాడు.

'సామాన్యహిందువు ఒక బీదవానికి సహాయము చేయవలయునని దయాతిరేకముతో సంతరాము నుద్యోగములో చేర్చుకొనును. దేశదృష్టితో నీ యాలోచన యెంత హానికరమో, ప్రాణఘాతుకమో మనకు తెలియును. నే నొకసేనానాయకు డనుకొనుడు. జపానులు మనదేశము నాక్రమించినారు. వారి నెదుర్కొనుమని దేశము నా కాజ్ఞాపించెనని యనుకొనుడు. నేనప్పుడు సిపాయీలను చేర్చుకొనుటకు ప్రకటన చేయుదును అనుకొనుడు. తుపాకులు, మందులు కొందును. భోజనపదార్థములుకూడ తెప్పించుచున్నాను. అప్పుడు నాయొద్దకొకసజ్జనుడువచ్చి 'అయ్యా నేను బీదవాడను, నాతండ్రి చనిపోయినాడు. నా పినతండ్రిని పెద్దపులి తినివేసినది. నాతల్లి గంగలో పడిపోయినది. ఆసైనికాహారముచేర్చు నుద్యోగము నాకిచ్చినయెడల నన్ను మీరు రక్షించినట్లు.' అని ప్రార్థించును. నేను దయాశీలుడనై యిటువంటివారికే అన్నిపనులలోను నియమించినచో నే నెంతమంచి సేనానాయకుడనో బాగుగ ప్రకటమగును గాదా!

కనుక నా దయాపద్ధతి జాతీయదృష్టితో నింద్యము. ప్రావీణ్యమునకే గౌరవముండవలయును.'

బయట వాకిలియొద్ద కొంచెము చప్పుడయినది. రైలు సూపరింటెండెంటు వచ్చువేళ. పాండే తనగదికి వెళ్ళినాడు. మోహనలాలు తనగదికి వెళ్ళిపోయినాడు. నేను పాండే చెప్పిన విషయము నాలోచించుచునే యుంటిని. నవీనయుగమునకు నూతన ధర్మముండవలయునన్నట్లే నాకు తోచినది. అనగా నీ నూతన ధర్మము మన ప్రాచీనమత, నాగరకతల యుత్తమ సిద్ధాంతములను త్రోసి రాజనవలెనని కాదు. అటులే యయినచో నది వార్తాపత్రికల కందము నొడగూర్పవచ్చును. సభారంగముల ప్రతిధ్వనింపవచ్చును. కాని దేశ మెప్పుడును దానిని స్వీకరింపదు.

నూతనధర్మమనగా నా యుద్దేశ మేమి? భారతీయులు తమ ప్రాచీనార్యధర్మమును, తమ కుటుంబ

పద్ధతిని, తమ యమనియమములను, తినుత్రావు పద్ధతులను, జీవనాదర్శమును కాలదన్ని, వానికి వ్యతిరేకపద్ధతులను గ్రహించి మద్యమాంసము ఇష్టము వచ్చినట్లుపయోగించుచు జీవనమును విషయసుఖములకొఱకు వినియోగింపవలయుననియా? లేక కన్నులు మిరుమిట్లుగొలుపు పాశ్చాత్యనాగరకతను అవలంబించి మన దేశజీవనమున నూతనాధ్యాయమును ప్రారంభింపవలయుననియా? అని మీరడుగవచ్చును. ఇందులకు నా ప్రత్యుత్తరము 'అవును, కాదు.'

పాశ్చాత్యనాగరకతయన్న కొందరు బూతులాడెదరు. పశ్చిమము సర్వము శ్రేష్ఠమే యనువారి భావము వలె నదియు ననుచితమే యగును. పాశ్చాత్యులయందు లక్ష దుర్గుణములున్నను వారియం దొక్క గుణము కలదని మనమంగీకరింపక తప్పదు. ప్రాచ్యనాగరకతను వారు జీవనసంగ్రామమునందు నీచముగ జేసివైచినారు. మనపై వారి కధికారమున్నది. మన యిహలోకయాత్ర కంటె వారి యిహలోకయాత్ర యధికసుఖవంతము. కావున పాశ్చిమనాగరికతను మనము నిందలాడుటలో నర్థములేదు. కనుక మనము నూతనధర్మము నాలోచించునపుడు వృధాభిమాన - దురభిమానములను విడిచిపెట్టి దోషమును నిరాకరించుచు గుణమును గ్రహింపవలయును.

యుద్ధవిద్య విషయమున నేను దేశపాండేతో నేకీభవింపజాలను. నే నహింసానురక్తుడను. మనుష్యమాత్రుడు జీవింపవలయునన్నచో భావియుద్ధము క్రియారూపముగ గాక యహింసారూపముగ నుండవలయును. కాని మనమొక ఘోరప్రమాదమున నున్నాము. సాంఘికజీవనమును, సాంఘికప్రవృత్తులను చక్కబెట్టకున్నను మనవ్యక్తిగతజీవనమును ఆదర్శరూపముగ గడపుకొనగలమని మనతలంపు. అంతర్ముఖులమై ఆచరణమున సత్య - అహింసలను, యమనియమములను పాలించుచున్నచో సాంఘికపవిత్రతను, దేశస్థితిగతులను విచారింపకపోయినను చక్కగ జీవింపగలమని మన యుద్దేశము. ఇదియే మన యధఃపతనమునకు గారణము. మన యౌన్నత్యమార్గమునకిదియే బాధకము.

చారిత్రికోదాహరణములతో నా యభిప్రాయమును స్పష్టపఱతును. క్రీ. శ ౧౨వ శతాబ్దినుండి మనము పడిపోవుచున్నను వ్యక్తిరూపమున మేము వీరులము, అదియే చాలును అని తలంచియుంటిమి. ప్రపంచమున యుద్ధకళ యెట్లభివృద్ధి నొందుచున్నదో మనము గమనింపవచ్చును; గమనింపక పోవచ్చును. వ్యక్తిగతశక్తి గాక, యింకొక మహత్త్వమైనది విజ్ఞానశక్తియు గలదని మనమూహింపనేలేదు. మనదేశ మింతవఱకును దానిని గమనింపనేలేదు. ముసల్మానులచేతిలో రాజపుత్రులోడిపోవుటకిదియే మూలము. పృథ్వీచక్రవర్తి వీరత్వమున నెవ్వరికిని వెనుదీయడు. అతని సైనికులను ఎవ్వరికంటెను తక్కువ శూరులు గారు. కాని వారు తమ యుద్ధకళయందున్న దోషమును గాని, ప్రపంచమున యుద్ధకళయందున్న యభివృద్ధి గాని చూడలేదు. తమ బాహుబలముమీద వారికి విశ్వాసము గలదు. వారు భారతదేశపు సామూహికశక్తి నుపయోగించుకొనలేదు తమకు తోడుపడునదేదైన శక్తి గలదా యనినైన వారాలోచింపలేదు. కనుకనే వారాశక్తిని తమకు విరుద్ధముగా కూడ జేసికొన్నారు.

తన సంఘశక్తిని కూర్చుకొనక పోవుట, కూర్చుకొనలేకపోవుట హైందవజాతియందున్న గొప్పదోషము. కావుననే పరరాష్ట్రముల సంఘర్షణము కలిగినపుడెల్ల నిది హైన్యమును గాంచుచు వచ్చినది. పృథ్వీరాజు మహమ్మదుగోరీతో పోరాడునపుడు తక్కినరాజులు కులాసాగా కాలక్షేపము సేయుచు 'శేష్, పృథ్వీరాజోడినాడులే' యనుకొనుచుండిరి. గోరీ పృథ్వీరాజును ఓడించి తక్కినవారికిగూడ నా పాఠమునే నేర్పెను. ప్రపంచమున రాజపుత్రులవంటి వీరులుండుట దుర్లభము. వారంత వీరులయ్యు, త్యాగులయ్యు తమ వారిని కట్టుదిట్టముచేసికొని తనుబలమును పఠానుల యెదుట చూపజాలక పోయిరి,

సంఘశక్తిలేకుండుట, దూరదృష్టి కొఱవడుట, వ్యక్తిత్వప్రాబల్యము ఇవి హిందూజాతిలోని భయంకర దోషములు.

కావున నవీనధర్మమునందు తొలుదొల్త 'సంఘ

ధ్వంసంబదిధ్వం' ఆదర్శమును సృష్టింపగలయును. 'సహచర్యంకరవావహై' అని మనము ప్రార్థింపగలము. వ్యక్తిగతజీవనమును నిజమైదారినుండి బయట బడవేయగలయును.

• • •

౧౦ గంటలకు సూపరింటెండెంటు జైలుకువచ్చినాడు. అతనితో జిల్లా డిస్ట్రిక్టు మేజస్ట్రేటు గూడ నున్నాడు. గంట మ్రోగగనే మేమెల్లరము బయటికి వచ్చి నిలిచితిమి. ఎవరును మాటలాడలేదు.

౧౧ గంటలకు భోజనము వచ్చినది.

౧౨ నుండి ౨ గంటలదాక విశ్రాంతి.

౨ గంటలకు పండిత ఉమాశంకరపాండే 'ప్రేమీ' వచ్చినాడు.

వారు అన్నారు:—'అవినాశబాబూ! నేను మీకు వినిపించుటకొక చక్కని పద్యము తెచ్చితిని.' అనుచు వారు నా మంచముమీద గూర్చుండిరి. నేనుగూడ లేచి కూరుచుంటిని.

ఆ పద్యమిది.

తనదు సవతాలివంతున దనప్రియుండు
అన్యకామిని గవయుట నాలకించి
మగనిగూర్చి తనగూర్చి మిగులపోగులు
వలుక హేళన రాగము లందు నొకట.

'ప్రేమీ' దీనిపై వ్యాఖ్య యారంభింపగనే దేశపాండే వచ్చినాడు. వెనుకనే మోహనలాలు.

స్థలము ఇఱుకగుటచే కంబళిని బైటపఱచి కూరుచుంటిమి. ప్రేమీగారికి దేశపాండేతో నింతవరకు పరిచయములేదు. కనుక నేను దేశపాండేతో 'వీరు నా మిత్రులు పండిత ఉమాశంకరపాండే 'ప్రేమీ' మంచి కవీశ్వరులు. హిందీసాహిత్యమున నుద్దండపండితులు. గంగాగంజినుండి రాజద్రోహనేరమున రెండు సంవత్సరముల శిక్షనొందివచ్చియున్నారు.' అని, ప్రేమీగారితో నిట్లు చెప్పియున్నాను. 'వీరు బలవంత దామోదర దేశపాండేగారు. వీరియందు ౧౦ సంవత్సరము లున్నారు. ఇంజినీయరు పరీక్షనెగ్గినవారు. ౧౯౪౦ లో నౌకరికి రాజీనామాయిచ్చి క్రిమినల్ లా ప్రకారము ౬ మాసముల శిక్షకు వచ్చినారు.'

నేను దేశపాండేతో:—మేమిప్పుడొకపద్యవిషయము నాలోచించుచున్నాము. ప్రేమీగారు దానిని వివరించుచున్నారు. అని పద్యము చదివినాను.

ప్రేమీగారు వివరణ మారంభించిరి.

'మానవుడు కవి ప్రతిభ. ఒకని కిరువురు భార్యలు. వారు ఒక్కొక్క దినముచొప్పున వంతులు వేసికొన్నారు. ఆనాడు వంతులేనికాంత తనమనస్సున 'నేను నా సవతిది.' అని తలచుచుండగా తన భర్త యా రాత్రి మఱియొక కాంతతో గడపినట్లు తెలిసినది. తెలిసి యిదివఱకొక సవతితోనే వేగుచుండగా నీ రెండవసవతి యొక్కడదాపురించినది యని దుఃఖించును. క్రొత్తకాంత యింటికి వెళ్ళకున్న తనయింటికి వచ్చును గదా యని కోపము, తనసవతి తనభర్తను లోబఱచుకొనలేక పోయినదిగదా యని దాని తెలివితక్కువను హేళనము, తన మగనివాడిట్లు చేయలేడుగదా యని భర్తయందనురాగము, కాని యిట్లు అలవాటయినచో నేమగునో యని కోపము ఒక్కసారిగ పొందుచున్నది............"

వ్యాఖ్య వినుచుండగనే దేశపాండే మొగము పెద్దదైనది. ప్రేమీగారు మఱి రెండుమూడుమాటలు దానినిగూర్చి మాటలాడబోవుచుండెను. కాని దేశపాండే యాయన కవకాశమీయనేలేదు.

అతను మొదలిడినాడు:—"క్షమింపుడు! నేను వృథా మాటలాడను. ఈదేశములో ఛందోనియమముల నెఱిగి, భావకవిత్వముగానీ శృంగారముమీదనో ప్రకృతిమీదనో లేక యిట్టి కాల్పనికవిషయము మీదనో పద్యములుగానీ వ్రాయుటనిని నాయికాభేదములు చక్కగా నెఱిగినవానిని సాహిత్య విశారదుడనుట వింత. సర్వవిధముల దురాచారిణులగు వనితాదుల భావములు, చేష్టలు ఎఱిగిన వానికి సంఘమునందింత యాదరమెందులకో నాకు తెలియకున్నది. ఆకాశవిమానములు సృష్టించు నింజనీయరును, మారీ క్షయాది రోగములనుండి ప్రజలను సంరక్షించు వైద్యులను, సంఘసేవకులను గౌరవించుట యేలో నాకు తెలియును. కాని దురాచారవతులగు స్త్రీల మనోభావ

ములతో చేరములాడుచుండు వారికేల గౌరవింపకలయునో నేనూహింపలేకున్నాను. శృంగారమును సాహిత్యమున ప్రధానాంగముగ భావించుట దేశమును తప్పుత్రోవను పట్టించుట.''

“శృంగార రసాస్వాదనము, క్షత్రియ ధర్మపాలనము ఇవి రెండును కలసి మెలసి యుండవు. ఖడ్గము, అలంకారగ్రంథము రెండును నొకచేతనుండబోవు. దేశయువకులు యువతులనైన సేవింపవలయును; యుద్ధభూమినైన సేవింపవలయును. యువకులు దేశసేవ చేయవలయునని ప్రబోధించుచు శృంగారరసకవిత్వమును ప్రచారముచేయుచు దానికేల యున్నతస్థానము నిచ్చుచున్నారో తెలియకున్నది. శృంగారకవితయందున్న మహత్త్వమేమి? కీటాణువులు మొదలు మనుష్యులవఱకు అందఱయందు నిదియున్నది. గార్దభమును గార్దభినిగాంచి శృంగారరస కవిత్వముల్లగలదు. శృంగారరసము, నాయికాభేదము-అత్యంతనింద్యములు; తిరస్కారార్హములు. విషమునోలె వీనిని విడువవలయును. వీనియందెక్కువ పరిచయమున్న వారిని తిరస్కారదృష్టితో జూడవలయును. అధోగతియందున్న భారతమునుద్ధరించువారిని, జీవనసంగ్రామమున పరరాష్ట్రములతో డీకొనగల భావ, శక్తులను ప్రసాదించువారిని మన మాదరింపవలయును. పతితజాతికి తలయెత్తి ఆత్మాభిమానముతో మెలంగు మార్గమును జూపువారిని మన మాదరింపవలయును. తమ పరిశ్రమతో, త్యాగముతో, ఆలోచనతో, జీవనముతో దేశవాసులయందు త్యాగము, సద్భావము, ఉన్నతాదర్శము, కర్తవ్య పరాయణత, ఆత్మార్పణము, దేశసేవాదిభావములను గల్గించు వారిని మన మాదరింపవలయును. తమ సమస్త జీవనమును స్త్రీల నఖశిఖపర్యంతవర్ణనలలో, అభిసారికా మనోభావనాచిత్రణములలో, కామోత్తేజకశబ్దసంగ్రహరచనములలో గడపువారిని ఆదరింపరాదు. వారిని తిరస్కరింపవలయును. దేశ మట్టివారికి ప్రోత్సాహమీయరాదు. హిందీసాహిత్యమునగాని మఱియే సాహిత్యమునగాని అంగప్రత్యంగవర్ణనములతో స్త్రీ చిత్రముల నెదుట నిల్పగల శృంగారకవీశ్వరులు రెండువేలమంది యున్నను దేశమునకేమిలాభము? కాముకుల-అనురక్తులసంఖ్య యిప్పుడు వేయియున్నచో నప్పుడు పదివేలగును. వీరివలన ప్రపంచమున కొలది కార్యమే నిర్వాహమగును. పిచ్చివాండ్ర మెజారిటీగల దేశము పిచ్చిదేయగును భారతవర్షమున కిప్పుడు వీర్యవృద్ధి రోగము లక్కఱలేదు. కామోద్దీపకరసము కూడ నక్కఱలేదు. సాహిత్యమునందు దీకవులు, ఆయుర్వేదమున స్తంభనౌషధములమ్ముచు తిరుగుచుండునట్టివారు. ఆ కవులన్న నాకురోత. వారు నింద్యులు; త్యాజ్యులు.

సాహిత్యప్రచారమునకు, భాష యోన్నత్యము నొందుటకు శృంగారరస మత్యావశ్యకమని కొందరందురు. ఇట్లనువారు చరిత్రమును జదువలేదు. సాహిత్యము ఖడ్గముమీద నాధారపడియున్నదిగాని శృంగారరసముమీదగాదు. అరబ్బీలకటారి పదునెక్కి పారసీకుల కంఠములపై దుముకుచున్నప్పుడు అరబ్బీ భాష యరబ్బీ యనిపించుకొన్నది. పారసీకము మూగదైనది, శత్రువుల ఖడ్గము నాపనేరని బాహువుగలవాని నాలుక యెంత మధురమైనను లోకమాతని భాషను మూగదిగనే భావించును.

ఇంగ్లండు సాక్ష్యము గావలయునన్న హిందూస్థానమున పెక్కులున్నవి. సంస్కృతభాషామాధుర్యము, రసము తత్సాహిత్యజ్ఞులే యెఱుగుదురు. పారసీకము దాని కాలిజలముతోడను బోలదు. కాని పారసీకుల. అఫ్గనుల ఖడ్గములు వాడిగా నున్నకాలమున గొప్ప గొప్ప పండితులు సంస్కృతమును వీడి యాభాషా గ్రంథములను జదువుచుండిరి. సోదరా! సాహిత్య ప్రచారము కామినీమణుల కథలు వ్రాయుటతో గాదు. స్వేచ్ఛాచారిణి మనోభావములను చిత్రించుటచే గాదు. కాక సాహిత్య ప్రచారము.........................

“ఇంతలో గణగణగణ గంట మ్రోగినది. తుపాకీ పేలినది. వాకిలి తటాలున తెఱచుకొన్నది. ఇద్దరు ముగ్గురు సిపాయీలు పరుగెత్తుచువచ్చి అరవసాగిరి “పిచ్చిది, పిచ్చిది.''

[౩౮ డిసెంబరు ‘సరస్వతి’ నుండి.]

—వల్లమూడి వేంకటరత్నము.

# హెడ్మాష్టరికి కనిపించిన పిశాచం

హైస్కూల్ ప్రధానోపాధ్యాయుల సందేశం.

విద్యార్థులకు తలబిరుసు ఎక్కువై మాస్టర్లంటే లక్ష్యంలేని ఈ రోజుల్లో ఉపాధ్యాయత్వం స్వీకరించడమనేది అగౌరవం కొని తెచ్చుకోవడమన్నమాట. అందులో ఏ బోర్డు హైస్కూలులోనో ప్రధానోపాధ్యాయుడైతే యిక చెప్పాలి: జిల్లాబోర్డులో డఫేదారు దగ్గరనుంచీ దబాయించేవాడే. ప్రెసిడెంటుకు కోపంవచ్చిందంటే 'సస్పెండు' చేస్తాడు; లేదా, మరోస్కూలుకు 'అసిస్టెంటు'గా బదిలీచేస్తాడు; తన యిష్టంవచ్చినట్లు ఏడిపించుకు తింటాడు.

నేను మావూరు హైస్కూలులో చాలా కాలం 'అసిస్టెంటు'గా వుండి ఆ సంవత్సరమే 'హెడ్మాస్టరు' నైనాను. పిల్లల ప్రేమకు పాత్రుడనై, తోడి యుపాధ్యాయులచేత గౌరవింపబడుతూ, బోర్డుమెంబర్ల కోపానికి ఎరకాకుండా, తెలివితేటలతో గడుపుకొస్తున్నాను.

ఆరోజు జనవరి 24-వ తేది. ఉదయం ఎనిమిదిగంటల సమయాన ఆఫీసుగదిలో నా కుర్చీలో కూర్చున్నా. మార్చిలో జరుగబోయే 'పబ్లిక్' పరీక్షకు ఎంతమంది విద్యార్థులను పంపడమూ, ఎంతమందిని పంపకపోవడమూ, నిర్ధారింపవలసిన సమయమది. మా స్కూలులో 116 మంది వున్నారు 'స్కూలుఫైనల్ క్లాసు' చదువుతూన్న కుర్రాళ్లు. వాళ్ళందరిపేర్లూ, ఆపేర్ల కెదురుగా ఆయా విద్యార్థులకు, జరిగిన పరీక్షలలో ఎన్నెన్ని మార్కులు వచ్చిందీ తెలియజేసే కాగితాలు తయారుచేసి నాముందున్న బల్లమీద వుంచిపోయాడు క్లర్కు. నాకు సలహా యిచ్చేనిమిత్తం కొందరు ఉపాధ్యాయులు నాకిరుప్రక్కలా ఉచితాసనాలమీద కూర్చునివున్నారు.

రెండుగంట లాలోచించి, 47 మందిని పరీక్షకు పంపకుండా వుండేటట్లు నిశ్చయించాం. వాళ్ళను పంపించినా 'పాసు' గారని మా వుద్దేశం. బహుశః శ్రద్ధగలిగి వాళ్లు చదువుకుంటే కృతార్థులౌతారేమో అని అనుకోవడానికి మాలో అంత వుదారత లేకపోయింది. ఆ 47 పేర్లూ వ్రాసిన కాగితాన్ని బైట గోడకంటించేశాము. అందరకూ తెలిసేనిమిత్తం.

తరువాత నేను ఇంటికిపోయి భోజనంచేసి మళ్లీ స్కూలుకు వచ్చాను. వచ్చి కుర్చీలో కూలబడ్డానో లేదో, మా స్కూల్లో రాత్రిళ్లు కాపలావుండేవాడు వచ్చి దీనాలాపం మొదలెట్టేడు: 'అయ్యా! నా కొడుకుని మీరు పరీక్షకు పంపలేదుటండీ! పేదవాణ్ణి. రక్షించాలి. మళ్లీ వచ్చేయేడాదికూడా చదివించలేనండి; జీతానికీ, పుస్తకాలకూ ఇచ్చుకునే తాహతు లేదండి. దొరలు! కరుణించి మావాణ్ణి పరీక్షకుపంపిస్తె వాడు 'పాసు' కానీయండి, కాకపోనీయండి; ఆ తరువాత ఏదన్నా నౌకరీ ఇప్పించుకుంటా స్వామీ! మీలాంటివాళ్ళను బ్రతిమాలుకుని. నేనూ

ముసలాడినయ్యాను. వాడిమీద ఆధారపడి వుండాను; రక్షించాలి దొరలు' అంటూ కళ్ళమ్మట నీళ్లుకార్చటం ప్రారంభించాడు. నాకూ కొంచెం మనస్సుకరిగి 'సరే, పంపుతానుపో' అని వాగ్దానం చేశాను.

ఆ ముసలాడు నిష్క్రమించిన తర్వాత మా స్కూలు 'రైటరు' వచ్చి ఇద్దరు కుఱ్ఱ వాళ్ళను పంపించమని సిఫారసుచేశాడు. వాళ్లు తనకు బంధువులనీ, జాగ్రత్తగా చదివించుతాననీ, చాలా బ్రతిమాలుకున్నాడు. సరే వాళ్ళనూ పంపుతానన్నాను. కాని 'రైటరు' వాళ్లవద్ద చెరి పాతికరూపాయలు లంచంతీసుకుని నన్ను మోసంచేశాడని నాకు తరువాత తెలిసింది.

కనుక పరీక్షకు పంపబడని వాళ్ళసంఖ్య 44వరకు తగ్గిందన్నమాట.

ఆనాడే రాత్రి పదకొండు గంటలప్పుడు, మా యింట్లో, నా గదిలో, ఒక పడక కుర్చీలో పడుకున్నాను. ఇంకా బాగా నిద్ర పట్టలే దప్పటికి కిటికీలోనుంచి చలితో కూడుకున్న గాలివీస్తున్నది. వత్తి తగ్గించబడిన లాంతరువొకటి వెలుగుతూంది.

అప్పటి నాశరీర మనఃస్థితులు సరిగా చెప్పలేను. ఏదో నాలోనే నేను చూచుకుంటున్నట్లున్నాను.

'ఈరోజు నేను 44 గురిని పరీక్షకు పంపలేదు. వాళ్ళంతా తమ తల్లిదండ్రులచేత చీవాట్లుతిని నన్నెంతగా ఆడిపోసుకుంటున్నారో కదా! వీరిలో కొందరు ముందు సంవత్సరము తిరిగీ చదివేటందుకు ధనము లేని కారణంచేత బడికి స్వస్తిచెప్పి నిరుత్సాహులై ప్రపంచంలో ఎందుకూ అక్కరకురాని వాళ్లౌతారు. వాళ్ల వుసురంతా నాకేనా తగలవలసింది?

'అట్లని అందర్నీ పంపితే కృతార్థులయ్యే కుఱ్ఱవాళ్ళసంఖ్య నూటికి చాల తగ్గుతుంది. అది ఆధారంచేసికొని, మా స్కూల్లో విద్యావిధానం బాగు లేదని విద్యాశాఖాధికారులు దబాయించి వ్రాస్తారు; వారికలానికి అడ్డులేదుగా. చివరకు ప్రధానోపాధ్యాయుడనైన నాకూ అపఖ్యాతి.

'కాని స్కూలుయొక్క, నాయొక్క ప్రతిష్ఠకోసరం అమాయికులైన విద్యార్థుల జీవితం నిస్సారంచేయుటమా? అదీ కాక అయిదవఫారం చదివి "స్కూల్ ఫైనల్" తరగతికి ఎప్పుడు వచ్చాడో అప్పుడే కలిగింది ఆ కుఱ్ఱవాడికి 'పబ్లిక్' పరీక్షకు వెళ్ళేటందుకు అర్హత. మధ్యన వాణ్ణి ఆపుచేయడానికి హెడ్మాస్టరు ఎవరు?

"నేడు మనదేశంలో చదువుకున్న వాళ్ళ సంఖ్య నూటికి చాల స్వల్పం—మనం సిగ్గుపడవలసినంత స్వల్పం. విద్య బాగా వెదజల్లబడాలి. అది గమనించక పాఠశాలలకు వస్తూన్న ఈ కొద్దిమంది కుఱ్ఱవాళ్ళనూ మాటిమాటికీ పరీక్షలనే కళ్ళేలు తగిలించి మాస్టర్లు వెనక్కులాగుతూంటే విద్యావ్యాప్తి కాజాలదు. ఉపాధ్యాయులు, వికసించి విశాలమైనమనస్సు కలవాళ్లయితేనే గాని, ఏ 'కంపల్సరీ ఎడ్యుకేషన్ స్కీమ్" అమలులోకి తెచ్చినా ఫలం స్వల్పం.'

నా ఆలోచన తెగిపోయింది, కిటికీ తలుపు చప్పుడైనట్లుంది. ఏమిటది? అరే! ఇనుపచువ్వలకిటికీలోనుంచి ఎలాగు వచ్చాడు!

'రామారావూ!' అని పిల్చాను. అతడు నాస్కూల్లో పరీక్షకు పంపబడని 'స్కూలు ఫైనలు' విద్యార్థి.

అతడు మాట్లాడలేదు. జుట్టంతా రేగి వుంది. అశ్రువులు కార్చికార్చి కన్నులుబ్బినట్లున్నవి. బుగ్గలమీద కన్నీటిచార లింకా మాయలేదు. ఏదో మాట్లాడబోతాడు కాని గొంతు పెకల్చుకొని మాట బయలు పడటంలేదు.

రెండునిముషాలుమాత్రమే నా కన్నుల్లోకి జాలిగా చూస్తూ నిల్చున్నవాడు నిల్చున్నట్లు గాలిలో కరగిపోయాడు. ఏమిటది? ఆశ్చర్యంగావుందే!

నాకు భయంవేసింది. కాని సరిగ్గా తెప్పరిల్లక పూర్వమే, ఆ కిటికీదగ్గరనే సింగు కనుపించాడు. అతడినీ పరీక్షకు పంపలేదు నేను.

సింగుముఖం చాలా భీకరంగావుంది 'నన్ను పరీక్షకు పంపలేదుకదూ నీవు! చూచుకో, నీబుర్ర రామకీర్తన పాడిస్తా. ఏమనుకున్నావో నాతడాఖా' అని పలుకుతూన్నట్లు వాడి పెదవు లదరుతున్నై. భ్రుకుటినాట్యం చేసింది.

భీతిచేత నాకన్నులు మూసుకుపోయినవి.

మళ్లీ నేను కన్నులు తెరిచేసరికి ఒక బుడబుక్కలవేషం కనుపిస్తూన్నది కిటికీవద్దనే. 'ఇదేమిరా బాబూ! ఈరాత్రి డబ్బు లేకుండా సినీమా బొమ్మలు కనుపిస్తున్నవి' అనుకుంటూ భయమువిడిచికొని అడిగేను. 'ఎవరు బాబూ నువ్వు' అని.

ఆ బుడబుక్కలవాడు వికటాట్టహాసం చేసి 'నేనా? ఎరుగవ్వూ నన్ను? నీ విప్పుడు పనిచేస్తూన్న బడిలోనే నేనొకప్పుడు హెడ్మాస్టరును.'

బాగా పరకాయించి చూచాను. ఒక తలగుడ్డ, కాలరులేని లాంగుకోటూ, మెడల మీదనుంచి ఇరువైపులా మోకాళ్లవరకూ వ్రేలాడుతున్న వుత్తరీయం—ఇన్ని గుడ్డలు ఆయన ఒడలిమీద వుండటముచేత మొదలు బుడబుక్కలాడనుకున్నాను. ఆరున్నర అడుగులకు తక్కువ యెత్తువుండడు. ముఖం నిండా చిన్నచిన్న గుంటలు వున్నవి. ఎవరా అని కొంచెం ఆలోచించా; కాని అంతు పట్టలేదు. చివరకు, 'మిమ్మల్ని నేను గుర్తు పట్టలేనండీ' అన్నాను.

'నేను 19 0-వ సంవత్సరంవరకూ మీ స్కూలులో పనిచేశాను. 1911 లో చచ్చిపోతిని. నాపేరు ఋగ్వేదమూర్తి, బి.ఏ. యల్.టి.'

'చచ్చిపోయింతర్వాతకూడా ఎలా కనుపిస్తున్నావయ్యా నాకు?'

'పిశాచాన్ని'

'నన్ను పీక్కుతింటానికి వచ్చావా?'

'కాదు. నీకు బుద్ధి చెప్పేటందుకు వచ్చాను. నేను హెడ్మాస్టరుగా వుంటూన్న రోజులలో కుఱ్ఱవాళ్లను పరీక్షలలో తప్పించడమంటే నాకు సర్దాగావుండేది. 'స్కూలు ఫైనలు' విద్యార్థులను అనేకమందిని పరీక్షకు పంపేవాణ్ణిగాదు. అలా పంపబడని కుఱ్ఱవాళ్లు చాలామంది ఎందుకూ కొరగాకుండా పోయారు. వాళ్లనంతాపంచేతనైన పాపము నన్నీరీతిగా చచ్చినతరువాతకూడా బాధిస్తున్నది. ఈపిశాచరూపంతో ఇంకా ఎన్నాళ్లుంటానో తెలీదు. ఈసంవత్సరం నీవు కూడా చాలామందిని పరీక్షకు పంపలేదుటే. అలాంటి పని చేయవద్దు. నామాటవిని అందర్నీ పంపించు. ఏం! పంపిస్తావా?—ఇక నేను పొయ్యేదా?'

'పంపిస్తాను. ఇకమీరు దయచేయండి'

దయ్యము కిటికీలో నుంచి నడచి పోయింది. ఇనుపచువ్వలుగాని, ఆగోడలు గాని ఆపైశాచికశరీరాన్ని అడ్డుపెట్టలేదు.

తరువాత తెల్లవారువరకూ నా కింకెవ్వరూ కనుపించలేదు.

మరునాడు పదిగంటలకు స్కూలుకు వెళ్లేసరికి రామారావనే కుర్రాడు తలిదండ్రులకు చెప్పకుండా ఎక్కడకో పారిపోయాడని తెలిసింది.

రసాయనశాస్త్రం బోధించే ఉపాధ్యాయుడు శ్రీనివాసయ్యరుగారు ఆనాడు స్కూలుకు ఆలస్యంగావచ్చాడు తలకొక కట్టుకట్టుకుని. 'ఎందుకుతగిలిందయ్యా గాయం!' అని అడిగినమీదట గతరాత్రి తాను సందులోంచి పోతూవుండగా ఎవరో వెనుకనుంచి కర్రతో తలమీద గాటంగా కొట్టిపోయాడని చెప్పేడు. వెంటనే వెనుకకు తిరిగి చూడగానే ఎవరో పరుగెత్తిపోతున్నాడనీ, వాడు చాలావరకు సింగుగాడిలాగే వున్నాడనీ కూడా చెప్పేడు. సింగును పరీక్షకు పంపవద్దని నాకు సలహాయిచ్చింది అయ్యరుగారే.

ఆ సంవత్సరం నాస్కూలులో అందర్నీ పంపించాను. మొదలు ఎవర్నయితే పరీక్షకు పంపవద్దని నిశ్చయించుకున్నామో వాళ్లలో చాలామంది ప్యాసయ్యారు. అప్పటి నుంచి ఇప్పటివరకూ నా స్కూలులో పరీక్షకు పోని వాళ్లంటూ లేరు.

— పురాణం కుమారరాఘవశాస్త్రి బి.ఏ.

ఈ సంచికలో
బాలబాలికలకొఱకు కొన్ని పుటలు
ప్రత్యేకించినాము.

ఆంధ్రభూమి పాఠకులు

ఈనూత్న శీర్షికనుగూర్చిన తమ అభిప్రాయము, దీనిని అభివృద్ధి పఱచుటకు తగు సలహాలు లేఖామూలమున మాకు తెలుపుదురు గాక యని కోరెదము.

—ఇట్లు, సంపాదకుడు.



# నాకుపట్టిన చాకలిపీడ

ఆర్నెల్లయింది మా మరదలు పెళ్లాడి. మా ఆవిడ ఆవిడికి పురుడోసి ఇరవై ఒక్కో రోజు వెళ్ళేక ఇక్కడికి వచ్చింది. వచ్చినప్పటినుంచీ నన్ను పోరుతూనే ఉంది ఒకసారిపోయి చంటిపిల్లని చూసి రమ్మని. నాకూ పోవాలనే ఉంది. కాని నాలా తాలూకా కచేరీలో గుమాస్తాగిరీచేసేవాడికి సాధారణంగా చచ్చిపోదామన్నా తీరుబడిఉండదు. మాకు సెలవుదొరకడం అంటే గొడ్రాలికి బిడ్డపుట్టినట్లుగా ఉంటుంది. ప్రయత్నం చేయగాచేయగా ఒక మూడోశనివారం, ఆదివారం సెలవుకింద ఉపయోగించుకొని ఊరువదలి బయటికి వెళ్ళడానికి అధికార్లు అనుజ్ఞ ఇచ్చారు. ప్రయత్నం ఎన్నాళ్ళనుంచిచేస్తున్నా ఈ అనుజ్ఞ రావడంలో తలవనితలంపుగానే వచ్చింది. శుక్రవారం పొద్దున్న ఆఫీసుకు వెళ్ళబోయేసరికి ఈ అనుజ్ఞ వస్తుంది అని అనుకోలేదు. ఎల్లాగో కిందామీదాపడి - ఆఫీసుకు వెళ్ళింతర్వాత కలిగిన అవకాశాన్ని జారవిడువకుండా-మధ్యాహ్నం మళ్ళకుండా అనుజ్ఞ తెప్పించా.

ఇల్లా అనుజ్ఞ వస్తుందని ముందే తెలిసిఉంటే ఆవేళ పొద్దున్నే కట్టుకోడానికి మారుబట్టలేకుండా అన్ని బట్టలూ - సాయంకాలానికి తెస్తానని చాకలాడు ఎంత నమ్మపలికితేమాత్రం, బట్టలు గొడ్డులోళ్ళల్లా మాసినంతేమాత్రం - ఎందుకువేస్తా చెప్పండి? అసలు ఏమైందంటే మా చాకలివాడికి బట్టలువేసి నెలా పదిహేను రోజులయింది. మాదగ్గిర బట్టలుపట్టుకెళ్ళిన మర్నాడే వాడికి పొరుగూరిలో ఎవరిదో ముదిమామిడి తోటలో చెట్లునరకడం, కొమ్మకొట్టడం కంట్రాక్టువస్తే గొడ్డలి బుజాన్నవేసుకుని పోయినాడట. పోతూపోతూ చాకలిగూడెంలోని యితర చాకలాళ్ళనికూడా లాక్కుపోయాడట. ఇంకా యింతవరకూ అయిపులేదు. నా సైకిలు రోజూ పొద్దున్నా, సాయంత్రం నన్ను తీసుకుని వాడికోసం వెదుకుతూనే ఉంది. గంటవాయించి వాడిభార్యను పలకరించి 'అడక్కూతుర్ని నన్నేం చెయ్యమంటారండి - బలుపుమనిపిసి కూడాను' అనే దానిమాట చెవిని వేసు

కుని ఇంటికివస్తూఉండేది.

వేసినబట్టలు వాడు ఉతకలేదు ఇంట్లో బట్టలన్నీ మాసిపోయాయి. ఇల్లా ఉండగా ఆ శుక్రవారం ఉదయం ఎవడో మావూరు కొత్తగా కాపరానికి వచ్చిన తూర్పుచాకలివాడు వీథంటబోతూంటే వాణ్ణి పిలిచి పెళ్ళికిచేసినంత ఆడావుడిచేసి మా ఆవిడ నా బట్టలూ, తనబట్టలూ అన్నీ ఝంగచుట్టి బట్టకి మూడు కాన్లరేటుకి ఆవేళ సాయంకాలం సూర్యాస్తమయం కాకుండా తెచ్చే కఠినవ్రతంమీద వేసేసింది 'మాసిన బట్టలు ఇంట్లోఉంటే దరిద్రంకూడాను. శుక్రవారం అయినా వేశాను, ఇల్లు చూడండియిప్పుడు ఎంత కళగాఉందో' అంది మా ఆవిడ ఏదో ఘనకార్యంచేసి నట్లు. సాయంకాలం వాడు తెచ్చేదాకా పట్టుబట్టలు తప్పితే మారు కట్టుకునేటందుకు ఇకమాకు బట్టలులేవు. మాసినబట్టలు ఎల్లానన్నా వదిలితేచాలు అని ఉన్నాం కాబట్టి అప్పుడు మాకు ఒకవేళ వాడు సాయంకాలానికి తేకపోతేనో అనేభావం కలగలేదు.

ఈ పరిస్థితుల్లో నాకు ఊరుప్రయాణానికి అనుజ్ఞ వచ్చింది. మాసిరస్తదారు 'సరే, వెళ్లండి' అంటూఉన్నప్పుడే నాదృష్టి చాకలాడిమీదకు పోయింది. దొరక్క దొరక్క దొరికిన ఈ అవకాశం ఈ తూర్పుచాకలాడు మొండిచెయ్యడుగదా అనేదిగులు పుట్టుకొచ్చింది. 'ఆర్యమహాదేవి అనుకూలింపదలంచునో, దలంపదో, నాభాగ్య మెట్లున్నదో' అని ఆనాడు రుక్మిణి మనస్సు ఉద్విగ్నమైనట్లే నేడు నా మనస్సుకూడా ఈ చాకలాడ్నిగురించి ఉద్విగ్నమైంది. ఎల్లాగో పెందలాడే కచేరీలో కాగితాలుసర్దేసి రాకరాకవచ్చిన ఈ అనుజ్ఞను సమయానికి ఆ చాకలాడు బట్టలులేక నిరర్థకం చేయడుకదా అనే అలజడిలో మనస్సు అతలాకుతలం అవుతూఉండగా ఇంటికి బయలుదేరాను. సమాధిలో ఉన్న భక్తుడిచిత్తం భగవంతుడిమీద లగ్నమయ్యే నిశ్చలభావాన్నిమించే నిశ్చలభావంతో నేను చాకలాడ్నిగురించే చింతిస్తూ మాయింటి వీధిగుమ్మంలో కాలుపెట్టి అంతపెందరాళే ఇంటికి వచ్చినందుకు ఆశ్చర్యపోతూ నాకు ఎదురుగావచ్చిన మా ఆవిణ్ణి 'చాకలాడువచ్చేడా?' అని అడిగాను. 'వస్తాడండీ, తొందరేమిటి అంత.' అంది ఆవిడ. 'తొందరంటావేమిటి—ఊరికివెళ్తాంటే, మీ చెల్లెలిగారి అమ్మాయిని చూసిరావడానికి' అని అన్నా. అందుమీద చాకలాడు ఒకవేళ బట్టలు తేడేమో సమయానికి అనే అదురు ఆవిడికికూడా కలిగిందికాబోలు, మారుమాటాడకుండా పెరట్లోకివెళ్ళి అంట్లుతోముకొన్న దాసీదాన్ని తొందరగా చెయ్యికడుక్కుని ఇక్కడున్నట్లు చాకలాణ్ణి తీసుకురమ్మని పంపింది.

ఎంత మఱదలుగారింటికైతే మాత్రం, ఉండేవి ఎంత రెండురోజులైతే మాత్రం రెండోజతువాల్లేనా లేకుండా ఎల్లావెళ్ళను? సమయానికి చాకలాడు బట్లలు తేకపోతే ఏంకావలసింది? పోనీ ఓపంచి, ఓతువ్వాలు కొత్తవి కొనుక్కుందామంటే మాత్రం రాకపోకలకు రైలుఖర్చులకే కాక ఇవి కొనేటందుకుకూడా ఆ నెలా ఖరురోజుల్లో డబ్బు బదులుచెయ్యకుండా ఎల్లావస్తుంది? ఇల్లా సాధకబాధకాలు ఆలోచించుకుంటూ చాకలాడి మీదనుంచిమాత్రం చిత్తం చెదరనీయకుండా పడక్కుర్చీలోకూర్చుని వీధివెంపు ముఖంపెట్టి ధ్యానిస్తూఉన్నా. శీఘ్రప్రసన్నుడైన భగవంతునివలె అట్టేసేపు ధ్యానం అవసరంలేకుండానే అల్లంతదూరంలో చాకలాడు దర్శనమయ్యాడు. అయితే గజేంద్రమోక్షంలో గజేంద్రుడిదగ్గరకువచ్చిన విష్ణుమూర్తిగారిలాగ వాడు ఒట్టిచేతులతో వస్తూఉన్నాడు. అచట విష్ణుమూర్తిగారి శంఖచక్రాలు వెనకాలేవచ్చేయి. అల్లాగే ఇక్కడకూడా బట్టలు వీడివెనకాలే వస్తాయికాబోలు అనుకున్నా. వాడువచ్చి వాకిట్లో నిలబడ్డాడు. చేతులు కట్టుకుని నిలబడ్డాడు. ఏదో చెబుదామనుకుంటున్నాడు కాని సందేహిస్తున్నాడు. వాడి తటపటాయింపుచూచి ఏదో విశేషంఉంది అనుకుంటూ 'బట్టలుఏవిరా?' అని ప్రశ్నించా. 'ఉతికానండి, బాబయ్యా! ఆరెయ్యడం కూడా ఆరేశానండి, బాబయ్యా! ఎండకూడా బాగానే కాసిందండి,బాబయ్యా! బట్టలు మల్లెపువ్వుల్లా ఎండినాయండి - మడతపెట్టి మూటకట్టి రేవులోంచి తెస్తున్నానండి - చప్పున ఇస్త్రీచేసి ఇద్దామనండి—

మా యింటిదగ్గిర నీళ్ళలోదిదాత్తున్నా, బాబయ్యా! ఆ సమయంలో ఎల్లా జారిపోయిందో జారి మాట బోదిలో పడ్డాదండి—బట్టలన్నీ తడిముద్దలండి—క్షమించాలి' అంటూ ఎలక్షన్లో ఓడిపోయిన వాడికంటే కూడా ముఖం దీనాతిదీనంగా పెట్టాడు. ఏంచేసేది?

సెలవుఇవ్వడానికి మా శిరస్తారు ఎంత ఏడ్చాడో గదా బట్టలన్నీ యిల్లా తడిసిపోయాయి అనుకున్నా. 'షర్టు, ఖండువా ఇవ్వే (అంటే ఒంటిమీదవున్నవి) పనికొస్తాయి—రెండోపంచి, తువ్వాలు ఉండితీరాలి' అనుకుని తడివైనాసరే ఒకపంచి, ఒకతువ్వాలు అర్జంటుగా తెమ్మనిచెప్పి పంపించా. బెంగతీరి తేలికపడ్డట్టున్నాడు వాడు ఎప్పుడువెళ్ళేడో ఎప్పుడువచ్చాడో— వాడు యింటిదగ్గిరలేడంటూ మాపనిచేసేది; తడిపంచె, తువ్వాలుతో వాడూ ఒకసారే వచ్చారు. తడిబట్టలతో ప్రయాణం చేయకూడదంటారు. తప్పనిసరి అవడంచేత ఎంత కూడకపోయినా ఆ తడిబట్టలు పట్టుకునే ప్రయాణంసాగించా.

మర్నాడు ఉదయం. ఏడున్నర సుమారు అవుతుంది. రైలుదిగి మా మరదలుగారింటికి వెళ్ళాము. మా తోడల్లుడు కరణంలెండి! దస్త్రం ముందేసుకు బుర్ర వంచుకు ఊరికే బరబరా బరికేస్తున్నాడు. అరుగుఎక్కేవరకు నన్ను చూళ్ళేదు. చూస్తే లేవకుండాఉండడులెండి! తాలూకాకచేరి గుమాస్తాలను బట్టలుతికే చాకలివాడు, గడ్డంగీసే మంగలాడూ, నీళ్ళుతెచ్చే కాపకమ్మా ఇల్లాంటి క్షుద్రులు ఎంత లక్ష్యపెట్టకపోయినా గ్రామాధికార్లు మాత్రం గౌరవించితీరుతారు. ఏ ప్రదేశంవాడైనాసరే తాలూకాకచేరీ గుమాస్తా అంటే కరణాలు ఒక కంటితో చూస్తారు. ఆ కారణం చేత—మా తోడల్లుడు కరణీకంచేస్తోన్న గ్రామం మా జిల్లాలోది కాకపోయినా—నేనంటే అతనికి గౌరవమే. అయితే మీ తోడల్లుడిగారికి మీరంటే గౌరవం మీరు తాలూకాకచేరి గుమాస్తాలు అవడంచేతనేగాని వారి తోడల్లుడు అవడంచేతకాదన్నమాట అని కొందరు ప్రశ్నించవచ్చు. అయితే ఇది కేవలమున్నూ అప్రస్తుతప్రశంసా, అనవసరప్రసంగమూ కాబట్టి దానికి సమాధానం చెప్పవలసినబాధ్యత నాకులేదు. ఎంతగౌరవం ఉంటేనేమి ప్రస్తుతంలో అతను నా రాకను గుర్తించలేదు.



పాదాన్నిఉన్న అకుజోళ్ళ దుమ్ముదులుపుకూ నేను చేసిన చప్పుడికి కరణంగారు ధ్యానసమాధినుండి లేచి 'ఓహో! ఎప్పుడురాక ;' అంటూ అప్పుడే అక్కడికి ఏదో పనిమీదవచ్చిన నౌకరుచేత కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళు, తుడుచుకోడానికి తువ్వాలు తెప్పించాడు. కాళ్ళు కడుక్కొని పొడితువ్వాలు తడిచెయ్యడమెందుకు నాదగ్గర తడితువ్వాలే ఉందంటూ నా తడిమాట విప్పాను. 'దారిలో స్నానంచేశారేమిటి ?' అంటూ ఆ తడిబట్టలు చూసింతర్వాత పుట్టిన జిజ్ఞాస ప్రేరేచగా అతడు నన్ను ప్రశ్నించాడు. ప్రస్తావన మారిస్తేగాని పూర్వకథఅంతా చెప్పవలసివస్తుందని 'ఆమ్మాయి (మా మరదలన్నమాట). వంటిపిల్లా కులాసాగావున్నారా?' అన్నా. తన కూతురుసంగతి ఎత్తేసరికి మావాడు వాడిపుణ్యమా అని నాతడిబట్టలసంగతి

మళ్లీఎత్తుకోక 'రండి, లోపలికి వెళ్దాం, బుల్లెమ్మని చూద్దురుగాని' అన్నాడు. ఇద్దరం వెళ్లాం. సావిట్లోంచి మలుపుతిరిగి వాళ్ళ రెండోసావిడికి ప్రక్కఉన్న గది తలుపు నెమ్మదిగా నెట్టాడు.

అప్పుడే నీళ్ళుపోసినా ఎందుచేతో చంటిపిల్ల నిద్రపోవడంలేదు కాబోలు మా మరదలు జోకొడుతూ పాటపాడుతూంది. స్వర్గానికివెళ్ళినా విడాకులంతప్పలేదన్నట్లు ఆ పాటలోకూడా చాకలాడు, బట్టలు ఆలస్యంగా ఉతకడం ఇత్యాదిసంగతులే దైవికంగా ప్రస్తావింపబడుతూ ఉన్నాయి. నెలా పదిహేనురోజుల నుంచి నా జాతకంలో చాకలివాడిప్రశంస ఎక్కువగా ఉంది. అందులో నిన్న ఉదయాన్నించి మరీని. ఇంతక్రితం మా తోడల్లుడు ఆజ్ఞమీద నాకు కాళ్ళుకడుక్కోడానికి నీళ్ళుతెచ్చింది చాకలాడై ఉంటాడని నా అనుమానం. గ్రామనౌఖర్లలో చాకలివాళ్ళు ఉంటారుగా. అందులో సాధారణంగా కరణాలఇండ్లలో రివిన్యూ ఇనస్పెక్టరు మొదలైన ఉద్యోగస్థులు వచ్చినప్పుడు చాకలాళ్ళచేత కాళ్లు కడుక్కోడానికి నీళ్లుయిప్పించడం, మంగలాళ్ల చేత ఒళ్ళుపట్టించడం ఆచారం అయి ఉండటం నావంటి తాలూకాకచేరీ గుమాస్తాలకు తెలిసినవిషయమే. పోనీ అంతవరకు దైవికంగానే నాకు ఈ చాకలి సందర్భంకలిగిందనుకుందాం. కాని మా మరదలుపాటలో చాకలి ప్రశంస ఎత్తడంకూడా దైవికమే అంటారా? ఇందులో ఏదేనా కుమ్మక్కు ఉందా? లేక ఈశ్వరాదేశం ఉందా? మా మరదలు పాడ్తోంది గదా!

"చిన్ననా అమ్మాయి చీరకేడ్చింది
నెయ్యరా సాలీడ! నేత్రానపట్టు
మురుస్తు సాలీడు మూణ్ణెల్లు నేను
అరుస్తు చాకలి ఆర్నెల్లు ఉతుకు—

అని మా తోడల్లుడు గదితలుపు తొయ్యడం—'అరుస్తు చాకలి ఆర్నెల్లుఉతుకు' అనేపాదం ఆమెపలకడం దైవకృత్యంగా ఒక్కసారి జరిగాయి. నెలా పదిహేనురోజులుగా నా జాతకంలో గ్రహాలన్నీ చాకలివాడిమీద కేంద్రీకరించి ఉన్నాయి అని ఇదివరకే మనవి చేశా. అల్లాంటి సందర్భంలో ఈముక్కలు చెవినిపడితే ఎల్లాఉంటుందో చెప్పండి. కుశలప్రశ్నే నా చెయ్యకుండా 'ఈ చిన్నపిల్లచీరే ఆర్నెల్లు ఉతికితే మరి పెద్దపిల్లలయిన మీ అక్కయ్యవి, నీవి ఎన్నాళ్లు ఉతుకుతాడు? మీ పల్లెటూళ్లోకూడా ఇంత ఆలస్యం ఉంటుందా?' అని నా హృదయవేదన కనపడకుండా హాస్యానికన్నట్టుగా అన్నాను. 'మా తమ్ముడుగారి కరిణీకం అంత ఘోరంగాఉంది. చాకలాడు పిల్లబట్టలు పట్టుకెళ్ళి ఈవేళకి సరిగా వారమయింది. ఇంకా తేలేదు. పైగా వాడు గ్రామనౌఖరుకూడాను. పల్లెటూళ్లలోకూడా చాకలాళ్ళకి బొత్తిగానే వచ్చింది.' అంటూ ఆవిడ—క్షణం క్రితమే పాట బిగ్గరగా పాడిఉన్న కంఠమేమో ఈ మాటలుకూడా బిగ్గరగానే ఆదేస్థాయిలో అనేసింది. నాకు కాళ్లుకడుక్కోడానికి నీళ్ళిచ్చిననౌఖరు అక్కడే సావిట్లో ఉన్నాడు. వాడు ఈ మాటలువిని 'తెచ్చానండి, అమ్మగారు! బల్లమీద పెట్టేను. చూడండి' అన్నాడు. ఇక నేం? నాకు కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళిచ్చింది చాకలాడే! అనుమానాలు ఒక్కొక్కప్పుడు ఇల్లా నిజాలయి ఊరుకుంటాయి.

ఏదో మాటామంతీ అయింతర్వాత సావిట్లోకివచ్చి పడక్కుర్చీలో నడుంవాల్చా. ఎంతనిరోధించినా మనస్సు చాకలాళ్ళమీదకే పోతోంది. ఇప్పుడు నా జీవితంలో ఇంత హెచ్చుగా చాకలిప్రశంస ఎందుకు వచ్చింది? నెలా పదిహేనురోజులుగా రోజూ రెండు పూటలా సైకిలుమీద చాకలాడియింటికి వెళ్ళడమూ - శుక్రవారం సాయంత్రం చాకలివాడుతెచ్చే బట్టలకోసం అంతులేని ఆవేదనపడటం—పొరుగూరువచ్చినా కర్మ తప్పదనడానికి నిదర్శనంగా ఈ ఊళ్లో తోడల్లుడు చాకలివాడిచేత కాళ్లు కడుక్కోడానికి నీళ్ళిప్పించడం- మరదలు జోలపాటలోకూడా సరిగ్గా నేనువెళ్లిన సమయానికే చాకలిబట్టలు ఆలస్యంగా ఉతుకుతాడు అనడం ఇదేదో మాయగాఉంది అనుకుంటూ ఆలోచిస్తున్నా. మనస్సు ఏదోలా అయిపోయింది.

ఇంతట్లో మా మరదలు సావిటిలోకివచ్చి 'బావా! చాకలాడువస్తాడు. మడికి తడపవలసినబట్ట వాడికియ్యి'

అంది. చాకలిపీడ ఎల్లాఅయినా వదుల్తుందేమోనని 'తడిపించి ఉంచమ్మా' అన్నాను. 'ఈవేళ శనివారం కాదూ, బావా! చాకలాడు తడిపితెస్తే కాని మడికి పనికిరాదు' అంది. నా పంచిమాత్రం చాకలాడు తడిపి తెచ్చిందికాదూ? నేను తడిపితేనా ఏమిటి మడికి పనికి రాకపోవడానికి? కథఅంతాచెప్పి ఇక ఆవేళటికి నా పంచి చాకలాడు ముట్టుకోనక్కరలేకుండా చేసుకుందామనుకున్నాను మొదట. కాని అల్లాచెప్పడంవల్ల మన గంభీరానికి ఒక లోటువస్తుంది. అదీగాక 'మళ్ళీ ఓసారి చాకలాడు తడిపితే ఇంతటిలో ఏంపోతుంది, బావా!' అని మా మఱదలు అనకమానదు. అప్పుడు ప్రశంచెడ్డం, ఫలం దక్కకపోడంకూడా అవుతుంది. కాబట్టి చేసుకున్నపాపమో శంభులింగమా అనుకుని మా ఊళ్ళో శుక్రవారం సాయంత్రం ప్రమాదవశాత్తు చాకలివాడు తడిపితెచ్చినపంచి ఆ ఊళ్ళో శనివారంఉదయం బుద్ధి పూర్వకంగా చాకలివాడు తడిపితెచ్చేందుకు వేశెయ్యడానికి నిశ్చయించుకున్నా.

చాకలిపీడ నన్ను ఇన్నివిధాలపట్టి బాధించేటందుకు కారణం ఏమీకనిపించదు. నేను చదువుకునేరోజులలో 'చాకలివాళ్ళనుగురించి' అని ఒక వ్యాసం మాత్రం వ్రాసాను. అప్పటిలో దాన్ని ఎక్కడా ప్రచురించలేదు. కళాశాలలో నా సహాధ్యాయిఅయిన ఆంధ్రభూమిసంపాదకుడు మొన్నను నా దగ్గరకువచ్చి నా పాతవ్యాసాలు తిరగెయ్యడంలో అది కనిపించింది. అదితీసికెళ్ళి ప్రచురిస్తానన్నాడు. 'ఆడవాళ్ళు బయట ఉన్నప్పటి మగవాళ్ళవంటలు' అనే నావ్యాసం ప్రచురిస్తామని పత్రికలో వెల్లడిచేసికూడా ఇంతదాకా ప్రచురించలేదు. అది అయితేకాని ఇది ఇవ్వనుఅన్నా. అతను ఇమ్మని చాలా బలవంతంపెట్టేడు. నేను ఇవ్వలేదు. అదేమొదలు నాకీ చాకలిబాధ ప్రారంభించడానికి. కొత్తచాకలాడికి బట్టలువేసి మా ఆవిడా, చాకలాడిచే కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళిప్పించి మా తోడల్లుడూ, జోలపాటలోకూడా నేను వినాలని చాకలివాని ఊసెత్తి మా మఱదులూ పిళ్ళందరితోడు నాకు కలిగిన చాకలిబాధకు ఆంధ్రభూమిసంపాదకుడుకూడా కొంత కారణమేనని నా అభిప్రాయం. ఆ వ్యాసం ప్రచురిస్తా అని సంపాదకుడు స్వయంగావచ్చి ఇవ్వమంటే ఇవ్వనందుకు చాకలివాళ్ళ కులదైవం నామీద కోపపడ్డాడేమోనని నాకుతోచింది. తోచనే ఇంటికి వెళ్ళింనాడే దాన్ని ప్రచురణకు పంపిస్తానని నాలో పవిత్రభావంతో అనుకున్నా. మరుక్షణంనుంచి నాకు దాఖలాకనిపించింది.

మడిబట్టలు తడపడానికి మా మరదలు వస్తాదన్న చాకలాడు మరిరాకే ఆ సంగతి మా మరదలు మళ్ళీ ఎత్తనూలేదు. బట్టలు ఆవిడేతడిపి ఆరేసిఉంటుంది. అది వారంపాటుంత్రం నేను రైలుకుపోయేవఱకు మరి ఆ యింటిలో నాకు చాకలిశబ్దంకాని, చాకలి స్వరూపం కాని కనిపించలేదు. సోమవారం ఉదయాన్నే మాయింటికి వెళ్ళదునుకదా అంతక్రితమే మా పాతచాకలివాడూ, కొత్త చాకలివాడూ బట్టలు తెచ్చిఇచ్చి వెళ్ళినట్లు తెలిసింది. చాకలివాళ్ళతో అయిన ఈకొత్త సంఘటనాలన్నీ ఇట్లా వ్యాసంగావ్రాసి దీన్ని 'చాకలివాళ్ళనుగురించి' అన్న నా పాతవ్యాసాన్నీ ఆనాడే ఆంధ్రభూమిసంపాదకులకు ప్రచురణార్థం పంపేను. ఈ క్రొత్త సంఘటనాలుగల ఇప్పటివ్యాసాన్ని ఉపోద్ఘాతంగా ఒకసంచికలోను, పాత వ్యాసాన్ని తరువాతసంచికలోనూ ప్రచురించాలనికోరాను. అల్లా ప్రచురిస్తారో లేక 'ఆడవాళ్ళు బయటఉన్నప్పటి మగవాళ్ళవంటలు' అనే నా వ్యాసాన్ని చేసినట్లుగా బుట్టదాఖలుచేస్తారో! ఎంత స్నేహితులైనా సంపాదకుల్నిమాత్రం నమ్మకూడదు. పూర్వకాలంలో కవులు నిరంకుశులుగా ఉండేవారని ప్రతీతి. ఇప్పుడు సంపాదకులంత నిరంకుశులెవ్వరూలేరని నాకుతోస్తుంది. కాబట్టి ఇట్టి నిరంకుశులగు సంపాదకులకెవ్వరికీ ఆంధ్రులు ఏమాత్రం సాయంచెయ్యకూడదని నా మనవి. నా మనవి వినకుండా సంపాదకులకు ఏమాత్రమైనా సాయంచేసే ఆంధ్రులకు నాకు కలిగినటువంటి చాకలిపీడలు అప్పుడప్పుడు కలిగిస్తో ఉండవలసిందని భగవంతుణ్ని ప్రార్థిస్తూ ఉన్నా.

—ఎ. శేషాచలపతి. బి.ఏ.

# అశ్వద్ధామ కనిపించాడు

మాయింటిలో పురాతనపు పత్రికలు చాలావున్నై. నేనొకరోజున అటుకమీద యేవో సామానులు సర్దుతుంటే, బూజుపట్టి పగందివిరిగిపోయిన 'విశ్వభారతి' పత్రిక ఒకటి కనబడ్డది. ఏమిటో చదువుదామని కిందకు తెచ్చి చదివితే, అతివిచిత్రమయిన విషయం. ఆపత్రికమీది తేదీ క్రీ.శ. 1914 సం, జూను, 6 వాకు చాలా ఆశ్చర్యంవేసింది. నమ్మలేకపోయినాను. ఆవిషయాన్ని ఆంధ్రలోకానికికూడా నివేదిస్తే నావిధిని నెరవేర్చినవాణ్ణవుతానని నావూహ. ఆవిషయాన్ని చదివి, అది సంభవమో, అసంభవమో ఆంధ్రలోకం తేల్చగలదని నానమ్మకం.

"విశ్వభారతి పత్రికా సంపాదకులకు,—

అయ్యా,

నేను మొన్న ఫాల్గుణబహుళ పంచమిరోజు తెల్లవారుఝామున సుమారు రెండుగంటలకు మావూరునుంచి రాజమహేంద్రవరం కొన్ని వ్యవహారముల పరిష్కారం నిమిత్తం వెళ్ళదలచి కొవ్వూరుస్టేషనుకు రెండెడ్లబండిమీద వెళుతున్నాము. బండిమనిషి మేలుకొనివుంటాడుగదా అని నేనూ, నేను మేలుకొనివుంటానుగదా అని బండిమనిషీ, అనుకోవటం మూలాన్ని, ఇద్దరం పడుకొని నిద్రపోవటం సంభవించింది. మాబండి ఎక్కడా బోల్తామాత్రం పడలేదుకాని నిద్రమత్తువల్ల కాబోలు ఎడ్లు ఇష్టంవచ్చినచోటికి దారితీసినై.

తెల్లవారేవరకు నాకుగాని, పుల్లన్నకు (బండితోలే మనిషిపేరండీ) గాని మెలకువరాలేదు. లేచి చూచేటప్పటికి ఏమున్నది? చుట్టుపక్కల అంతా కీకారణ్యం. ధరిదోవ తోచలేదు. పుల్లన్నమీద చెడ్డకోపంవచ్చింది. కాని అతనుమాత్రం ఏంచేస్తాడుపాపం! అయిందేమో అయిపోయింది. ఇక కర్తవ్యమేమిటని ఆలోచిస్తూ కూచున్నా.

ఆ అరణ్యంలోనుంచి బయటపడటం ఎట్లావున్నా, అన్నం ఒకటి ముఖ్యంగదా! అప్పటికప్పుడే మిట్టమధ్యాహ్నమయింది. ఆకలి దహించుక పోతున్నది. పోనీ నీళ్ళుతాగివైనా కొంతవరకు ఆకలి చల్లార్చుకొందామంటే అవీలేవు. నాలుగుపక్కలా వీలయినంత దూరం వెళ్ళి చూచివచ్చానుగాని లాభంలేకపోయింది. నాలుక పిడచగట్టుకపోతున్నది ప్రాణం సొమ్మసిలిపోయింది.

అవసరంఅనేది ఏదోఒకదారి చూపిస్తుందిగదా! దగ్గరనే పెద్దమర్రిచెట్టు అగుపడ్డది. వెంటనే అమిత ఉత్సాహంతో దానెక్కి కనుచూపుమేరలో ఎక్కడన్నా నీళ్ళుకనబడతయ్యేమోనని చూశాను. ఎక్కడా నీటిపొలకువే కనుపించలేదు కాని చాలాదూరంలో, మసకమసకగా ఒకగుడిసెలాంటిది అవుపడ్డది. దాంతో నా ప్రాణాలు లేచివచ్చినై. పుల్లన్నను అక్కడే వుండమనిచెప్పి బయలుదేరిపోయినాను నేనా గుడిసెదగ్గరకు. ఎంతదూరంనడిచానో లెక్కలేదు. నీళ్ళుతాగుదామన్న ఆశే నన్నంతఉత్సాహంతో నడిపించింది.

ఆ గుడిసెను సమీపించేటప్పటికి నాకు కలిగిన భావాలు వర్ణనాతీతం. వాటినన్నిటిని స్థలవిస్తరభీతిచే వదిలిపెడుతున్నాను. క్లుప్తంగా చెప్పదలచుకుంటే,— నా ఆకలి, దాహం మాయమయినై. సువాసనతో కూడిన చల్లటిగాలి నా శ్రమను మరపించింది.

గుడిసెలోపలికి పోయినాను. భూమిలోకి ఏవో మెట్లుకనబడ్డవి. దిగటానికి భయంవేసిందిగాని చల్లకొచ్చి ముంత దాచటమెందుకని మెట్లుదిగి కిందికి బయలుదేరాను. మెట్లన్నీదిగి కింద కాలుపెట్టానోలేదో అద్భుతమయిన దృశ్యంకనుపించింది. కళ్ళు భ్రమలు కమ్మినై. నన్నునేను నమ్మలేకపోయినాను. ఒకవ్యక్తి దాదాపు బాగాయెదిగిన తాటిచెట్టులో సగంవుంటాడు. మోకాళ్ళదాకా తెల్లటిగడ్డం వ్రేలాడుతున్నది. పాదాలదాకా జడలు వ్రేళ్ళాడుతున్నై. ఆ వ్యక్తి ముఖంలోనుంచివచ్చే బ్రహ్మతేజస్సు పరిసరప్రాంతాలను వెలిగింపచేస్తున్నది. ఆ తేజోసముద్రంలో నేనొక

బిందువులయినాను. ఒళ్ళు ముచ్చెమటలు పోసింది. వంచిన తల యెత్తలేదు. అట్లాగే నుంచున్నాను రాయివలె.

'భయంలేదు నాయనా' అన్నాడా వ్యక్తి జలదస్వన గంభీరతతో.

ఆ వాక్కులో ప్రేమ ఉట్టిపడ్డది.

నేను కాస్త కళ్ళు తెరిచి పైకి చూశాను.

'నీ వెప్పుడయినా భారతం చదివావా?' అన్నాడు మునుపటిలాగే.

అవునన్నట్టుగా తలకాయ వూపాను. భయం కొంచెం తీరింది.

'ఎప్పుడయినా అశ్వత్థామ పేరు విన్నావా భారతంలో'

'ఆ' అన్నాను మెల్లగా.

'ఆ అశ్వత్థామను నేనే' అన్నాడా వ్యక్తి.

నేను ఆశ్చర్యంతో, భయంతో, భక్తితో ఆ వ్యక్తి వైపు చూశాను. వెంటనే 'అశ్వత్థామ బలిర్వ్యాసో......' వగైరాలకు చావు లేదన్న సంగతి జ్ఞాపకం వచ్చింది.

భారతంలో శ్రీకృష్ణుడు అశ్వత్థామను కొన్నివేల ఏండ్లు కుష్ఠురోగివై ఉండమని శపించినట్లు జ్ఞాపకం. అందువల్ల, ఆ సూచనలేమీ కనబడక శరీరం శుభ్రంగా ఉందేమిటా అని ఆశ్చర్యంతో ఆయన శరీరంకేసి చూడటం ప్రారంభించాను. నా ఉద్దేశ్యం గ్రహించాడు 'ఆ శాపం తీరిపోయింద'న్నాడు చిరునవ్వుతో.

కురుక్షేత్రసంగ్రామమంతా ఒక్కసారి నాకళ్ళ ముందు జరిగినట్లయింది. ద్రోణాచార్యుడు ప్రచండంగా యుద్ధంచేస్తున్నాడు. పాండవుల సేనలు నుగ్గునుగ్గయిపోతున్నై. అవలంబించింది క్షాత్రధర్మమైనా, ఆయన మోహాన బ్రహ్మతేజస్సు వెల్లివిరిసిపోతున్నది. పాండవులలో అతిరథులు, మహారథులు ఏ ఒక్కనికయినా కొరగావటం లేదు. పాండవులకు గుండెలవిసిపోతున్నై. శ్రీకృష్ణుడు ధర్మరాజును 'అశ్వత్థామహతః' అనమని నిర్బంధిస్తున్నాడు. ధర్మరాజు మనస్కరించలేదు. ఇంతలోకే 'అశ్వత్థామ' అనే ఏనుగు ఒకటి చచ్చిందని పుకారుపుట్టింది. 'ఇంకా ఏం, అనృతదోషానికి భయపడవలసినపని లేదంటున్నాడు శ్రీకృష్ణుడు. వెంటనే భీముడు గజగజ వణుకుతూ ఆచార్యునికి వినబడేంత దగ్గరగా 'అశ్వత్థామహతః' అన్నాడు. అదిరిపోయాడు ద్రోణుడు. మోహాన ఈసడింపుతో కూడిన చిరునవ్వు కనిపించింది. మళ్ళీ మారణప్రయత్నాలలో బడ్డాడు. అప్పుడే ధర్మరాజు చింతాక్రాంతుడై వస్తున్నాడు. కృష్ణుడుకూడా ఆ రథంమీద వున్నాడు. అనలేక అనలేక గద్గదస్వరంతో నే దగ్గరగా '...శ్వత్థామహతః, కుం—' వెంటనే కృష్ణుడు ధర్మరాజునోటిదగ్గర తన చెవిపెట్టి 'ఆ కాస్తమాటా నా చెవులో చెప్పు. నేను వింటే మూడులోకాలు విన్నట్టే' అంటున్నాడు.

పాండవశిబిరం. యుద్ధం అయిపోయిందేమో, అందరూ హాయిగా నిద్రపోతున్నారు. కరవాలంతో ప్రవేశించాడు అశ్వత్థామ. కళ్ళు చింతనిప్పులవలె వెలిగిపోతున్నై. ఆతని ముఖంలో క్రౌర్యం, పగ మూర్తీభవించినై. పోయినాడు దృష్టద్యుమ్నుని వద్దకు. ఒక్కటే దెబ్బ కత్తితో. తలతెగి కిందపడ్డది. మొండెం నుంచి వచ్చే వేడినెత్తురు, పుర్రెలో పోసుకొని గటగట తాగాడు అశ్వత్థామ. కళ్ళు తెలియడంలేదు. పాండవుల వద్దకు వచ్చాడు. అందరిని ఒక్కపెట్టు పెట్టాడు కత్తితో. ప్రళయతాండవం చేస్తున్నాడు ఎందుకో. కైపు తగ్గింది. తప్పు తెలిసింది. చంపింది పాండవులను కాదు. ఉపపాండవులను.

'విధికృత్యం, విధికృత్యం' అన్నాడాయన నిట్టూర్పుతో.

భారతంలో కలిగిన సందేహాలు కొన్ని తీర్చుకుందామనిపించింది నాకు! కాని ఏమనుకుంటాడో! నా సంగతి గ్రహించి ఆయన 'ఫరవాలేదు. సందేహాలేవన్నా వుంటే అడుగు' అన్నాడు. నాకు ధైర్యం కలిగింది.

'స్వామీ! ద్రౌపది ఐదుగురిని వివాహంచేసుకోటం ఏంసమంజసం?' అన్నాను.

మేఘం గర్జించినట్లుగా ఒక్కనవ్వు నవ్వాడాయన. 'ఏం మతిపిచ్చివాడులా ఉన్నాడే' అని ధ్వనిస్తున్న ఆ నవ్వు నాకొక్క బల్లెపుపోటయింది.

'అప్పటిఆచారవ్యవహారాలు వేరునాయనా' అన్నాడు.

ఇంకా అడిగితే, వెనుకటివరెనే వచ్చేవాడేమో నని భయంవేసింది. కాని వెనక్కు తీయడం కాపురుషలక్షణ మనుకొని 'కుంతి ఇంద్రాదిదేవతల అనుగ్రహంవల్ల ధర్మ రాజాదులను కనటం—'

'నేను దానికి ఇందాకనే జవాబుచెప్పాను అప్పటి ఆచారవ్యవహారాలు వేరని. పైగా అనుల్లంఘనీయ మయిన ధర్మ ఆజ్ఞ' అన్నాడు.

'కుంతి ఆదర్శంవల్ల ప్రస్తుతకాలం చెడిపోవడానికి అవకాశా లున్నవ'న్నాను.

'అవును, ఇది కలియుగంకదా!' అన్నాడాయన.

'మరి,—పాండవులకు అర్థరాజ్యానికి హక్కులేదని మాలోకొందరి వాదన.'

'ఊహూ! లేదనివాదించేవారుగూడా మీలో వున్నారన్నమాట. చెట్టు చెడేకాలానికి కుక్కమూతి పిందెలు.'

'ఇంకా నేనడిగేది ఒక్కటేప్రశ్న. అది తమకు చాలాపిచ్చిదిగా కనబడుతుందేమో. కాని మాకు మాత్రం చాలాముఖ్యమయిన చర్చనీయాంశం, అది, కృష్ణునికి మీసాలున్నవా లేవా అన్న విషయాన్ని గురించి.'

ఈప్రశ్న కాయన ఫక్కున నవ్వాడు. నవ్వాపుకొని 'నీవేమనుకుంటా'వన్నాడు.

'లేవనుకుంటా'నన్నాను.

'సరే', అన్నాడు అవునన్నట్టుగా తలవూపుతూ.

'కొంతమందివున్నవని వాదిస్తువార'న్నాను.

'అవును. ఉండవచ్చు' నన్నాడు.

నాకేం అర్థంకాలేదాధోరణి. నేను తెల్లబోవటం చూచి,

'శ్రీకృష్ణునికి మీసాలున్నవనుకుంటే వున్నై. లేవను కుంటే లేవు. ఎందుకొచ్చిన పిచ్చిరచ్చలు. పుణ్యమా, పురుషార్థమా. నీ కేరూపంబాగుంటే అదే ధ్యానం చేసుకో' అన్నాడు.

కాసేపు ఏమీ మాట్లాడలేదు. తర్వాత ఆయన అన్నాడు:

'నీవు పూర్వజన్మలో చాలా సుకృతంచేసుకున్నావు. అందువల్లనే నేను నీకు కనుపించాను. నీతోవచ్చిన మనిషికిలేకుండా, నీవుమాత్రమే నన్నుచూడటం, నీ పూర్వజన్మ సుకృతంగాదామరి. నీకు జన్మ తరింప చేసు కోవాలనేవుంటే, నాకు శుశ్రూషచేస్తూ ఇక్కడనే వుండిపో;' అని.

నేనేమీ జవాబు చెప్పలేకపోయినాను. మాయింటి ఆవిడ, కుర్రకుంకలు నాకళ్ళయెదుట కనబడ్డారు. కళ్ళుమూసుకొని నమస్కారంచేస్తూ నిలబడ్డాను.

మళ్ళీ కళ్ళుతెరచేటప్పటికి మావూళ్లో వడిబజారులో వున్నాను. అప్పుడప్పుడే అస్తమిస్తూన్న లోకబాంధ వుడు, తనకిరణాలను ప్రసరింపకేసి ఎర్రరాతికొండలకు మరింత ఎరుపుదనం కలిగిస్తున్నాడు. ప్రపంచమంతా బంగారుపూత వేసినట్లున్నది. వృక్షాదులు తలలువంచి నమ్రతతో తమ స్వామికద్దనుంచి సెలవుతీసుకుంటున్నై. ఆ వైపునుంచే, బండితోలుకొని నాకు ఎదురుగావస్తు న్నాడు పుల్లన్న.

ఇట్లు,

| | |
|---|---|
| ఫాల్గుణబహుళ సప్తమి<br>పోలవరం. | విన్నవించు విధేయుడు<br>శిష్ట్లా సుబ్రహ్మణ్యం |

(అనిఖున్నది)

(తాళాకలం)

ఈ విషయం ఇంకా దృఢంగా తెల్సుకోదలచు కొన్నవాళ్లు, నా క్కిందిచిరునామాకు వ్రాయవచ్చును. లేక నాతో స్వయముగా మాట్లాడదలచుకున్నవారు, రాజమండ్రి దగ్గరఉన్న కొవ్వూరులో రైలుదిగి బండి కట్టించుకొని పోలవరానికి రావచ్చును.

ఇట్లు
శి॥ సు॥ (అనిఉన్నది)

* (అసలుకు సరివిన్నవకలు) పోలవరం,
తూర్పుగోదావరిజిల్లా.

• • •

—క. సాంబమూర్తి.

---

* మరా:—అచ్చటచ్చట కించిద్గ్రాంథికంబును, అర్థం చెడకుండా, వ్యావహారికంచేశాను.




## ప్రత్యేకము బాలురకొఱకును, బాలికలకొఱకును

['ఆంధ్రభూమి'యందు బాల బాలికలకొఱకైన విషయ ప్రచురణమునకు మాసము మాసమును కొన్ని పుటలను ప్రత్యేకింప ఆంధ్రమహాశయులు పలువురు మాకు లేఖలను వ్రాయుచున్నారు. వారి ఆదేశమునను సరించి ఈ నూత్నశీర్షికను ప్రారంభించుచున్నాము. ఇందు కంచికిపోయినకథలు అను పేరుతో వినోదకథలు, నీతికథలును—మహనీయుల జీవిత సంగ్రహములు, లోకజ్ఞానమును పెంపొందించు విషయములను గూర్చిన వ్యాసములు, మున్నగునవి ప్రచురింపబడుచుండును. విజ్ఞానధనులగు ఉపాధ్యాయులును, తదితరులును యథోచితములగు వ్యాసములను పంపి ఈశీర్షికను పెంపొందింప ప్రార్థించుచున్నాము.

—సంపాదకుడు.]

౧. కంచికిపోయిన కథలు.

### పులికి పులి

అనగా అనగా చెంగల్వపురమనే ఒక ఊరుఉంది. ఆ ఊళ్ళో ఒక రాజు ఉన్నాడు. అతని పెళ్ళాంపేరు కలహప్రియ. 'కలహప్రియ' అనగా పోట్లాటలంటే ఇష్టంకలది అనిఅర్థం. పేరుకుతగ్గట్టుగానే ఆమె ప్రవర్తనకూడా ఉండేది. రోజూ ఇంటిలో దేనికోదానికి పోట్లాటే. పాపం మగడు చాలారోజులు ఓపికపట్టేడు. కాని కొంతకాలం అయింతర్వాత ఇక ఆమెతో కలిసిఉండడం కష్టంఅనిపించింది. ఆమెను చంపడం ఇష్టం లేక విసిగి ఇంటిలోంచి పొమ్మన్నాడు. పొమ్మంటే ఆవిడ తన ఇద్దరుబిడ్డల్ని తీసుకుని పుట్టింటికి ప్రయాణంకట్టింది. ఆమె పుట్టినవూరికి చెంగల్వపురానికి చాలాదూరంపొంది, మధ్య ఒక పెద్దఅడివికూడా ఉంది అయినా ఆమె భయపడ్లేదు. దార్లోకనిపించే జనాన్ని త్రోవఅడుగుతూ కాలినడకను ఆమె ప్రయాణం సాగిస్తూఉంది. కాలిబాటను పోయిపోయి ఆమె బిడ్డలతో అడివిమధ్యను ప్రవేశించింది. అచ్చట కాలిబాట నాలుగైనుదిక్కులకు చీలిపోయింది. తనఊరికి ఏదారిని పోవాలో ఆమెకు తెలియలేదు. తటపటాయిస్తూ పిల్లలతో అక్కడ కూలబడింది. చెంతనే ఒకపొదలో ఒకపెద్ద పులిఉంది. ఆపులి ఈవిడ్ని చూచి 'నాకు ఇప్పుడు చాలా ఆకలివేస్తోంది, నాకోసం ఆహారంగా దేముడు ఈ విడ్ని ఈ పిల్లల్ని పంపేడు కాబోలు'



అని సంతోషించింది. కాని అంతటిలోకే పెద్దపులికి వేళ్ళే భావాలుకూడా తోచేయి. 'ఇది పెద్దపులులు మొదలగు ఘాతుకమృగాలుండే అడివి అని ఇక్కడికి రావడానికి అందరూ భయపడతారు నాపాద సమీపంగానే ఉండికూడాను. అయినా ఈ ఆడదానికి ఎన్ని గుండెలున్నాయో! ఇక్కడే తిష్ఠ వేసింది. చూడగా చూడగా నాకు ఏమిన్నీ పాలుపోవడంలేదు. ఈ వనానికి అంతటికీ రాజైన సింహంకూడా తనసేవకులలో ఎవరేనా తప్పు చేసి నాశరణుపొందితే నా దగ్గరికివచ్చి నాతో మంచి మాటలాడి ఆ సేవకుణ్ని తిరిగి పనిలోకితీసుకుంటుంది కాని నామీద ఏమిన్నీ రాజరికంచూపించదు. అంతటి బలవంతుణ్ని నేను. అట్టి నా పాదసన్నిధికి వచ్చికూడా ఏమాత్రం భయంలేకుండా ఈమె ఉంది. కాబట్టి గబుక్కునవెళ్ళి ఈమెను పట్టుకోకూడదు నిదానించి చేయడం రాజనీతి. సుమతి అనే పేరుగల నానక్క మంత్రితో ఈవిషయం ఆలోచించడంమంచిది. అతడు ఇది అయినపని ఇది కానిపని అని తెల్పగల బుద్ధిమంతుడు. అతను నిండా ధైర్యవంతుడు కూడాను. అతను ఇప్పుడు ఎక్కడికి వెళ్ళేడో? అతన్నిరావించి అతనితో ఆలోచనచేసి మరీ దీన్ని చంపడంమంచిదని తోస్తుంది.' అని ఆ పెద్దపులిఅనుకుంది. కాని ఆకలి అంతకంతకు ఎక్కువైపోతూంది. అప్పుడు అనుకుంది గదా: 'దీనికి ఇంత ఆలోచనఏమిటి? కడుపులో ఆకలి దహించుకుపోతోంటే. కాబట్టి వెంటనే దీన్నిచంపి ఆకలితీర్చుకోవటం మంచిది' అని. ఇల్లా తెంపుచేసుకొని కళ్ళు చింతనిప్పుల్లాచేసుకొని, తోక నేలమీద వేసి కొడుతూ, కోరలుతెరిచి గుఱకపెడుతూ పెద్దపులి ఆమెమీద ఉరకబోయ్యేటట్లుగా వస్తూంది. కలహప్రియ ఇదంతా కనిపెడ్తూనేఉంది పెద్దపులి మొదట తన్ను చూడ్డం, తర్వాత తటపటాయించడం, ఇప్పుడు తనమీదకు రావబోవడం ఆమె చూస్తూనేఉంది. ఆమె మనస్సులో, తబ్బిబ్బు పడుతూనేఉంది భయంతో ఆమె గుండెలు పిటపిటలాడుతూనే ఉన్నాయి. పులి నోటిలో పడకుండా ఎల్లా తప్పించుకోవడం?

ఆమె కలహప్రియ కాబట్టి ఆమెకు చాలాప్రజ్ఞలు తెలిసిఉన్నాయి. ఆలోచనచేసింది. 'ఈ పులి నన్ను మొదటిలో చూచినప్పుడే నామీద పడవలసింది. కాని అల్లాపడలేదు. చాలాసేపు తటపటాయించింది. నేను ఎల్లాంటిదాన్నో అనుకుంది. దానిగుండెల్లో ఇదివరకే కొంత పిరికిమందుపడింది. ఇప్పుడు కనక కొంచెం భయపెట్టేమా అంటే ఈపులి బాగా జంకిపోతుంది.' అనుకుంది ఆమెమనస్సులో. తోడనే ఆమె తనపిల్లల్ని ఇద్దర్నీ పులి కనిపెట్టకుండా చాటుగా గట్టిగా గిల్లింది. పిల్లలు ఇద్దరూ 'కో' అని ఏడ్వడం మొదలుపెట్టేరు. అందుమీద ఆమె విసుక్కుంటూ వాళ్ళను ఊరారుస్తూ ఉన్నట్లుగా ఇట్లాచెప్పింది: 'ఎందుకు ఏడుస్తార్రా! మీ ఆకలికి పులిమాంసంతప్ప మరోటి పనికిరాదాయెను. నేను ఏంచేసేది? మీకోసం వ్యాఘ్రాల్ని ఎన్నిటినో చంపిచంపి 'వ్యాఘ్రహంత్రి' అనే పేరుపొందేను. మీకోసం పులుల్ని చంపడానికని ఇల్లువదిలేసి ఈ అడవులలో సంచరిస్తూఉన్నా. ఇల్లా పులులకు పులినిఅయి తిరుగుతూఉన్నా. వెతుకుతూఉన్నా. మీరు చూస్తూనే ఉన్నారుకదా! ఇప్పటిలో రెండుపులులు దొరికితే చాలు. మీరుఇద్దరూ చెరోటి తీసుకుందురుగాని. ఒకటి దొరికితే చెరిసగం తీసుకుందురుగాని ఏడవకండి. అన్నలారా! ఏడవకండి.'—అసలే పిరికిమందుపడిఉంటేమో పులికి - ఈమాటలు వినేసరికి గుండె దడదడలంకించుకుంది. తోడనే తోకముడిచింది. కాళ్ళకి అడ్డంవస్తూ ఉన్న అడవితీగల్ని పుటుక్కు పుటుక్కున తెంపుకుంటూ తిరిగిచూడకుండా పెద్దపులి పరుగుదొరకపుచ్చుకుంది.

బాల బాలికలారా! మీకు ఇప్పుడు ఓసందేహం తోస్తుంది. ఇల్లా పరుగెత్తుకుపోయిన తర్వాతేనా పులిరాజు తన నక్క మంత్రిని కలుసుకుని ఈ విషయంలో ఆలోచనచేయలేదా అని. చేయకేం, చేసింది. పులిరాజు పరుగెత్తుకుపోతూ ఉండగానే నక్కమంత్రి కనిపించేను. రాజూ, మంత్రీ కలిసి ఆలోచనచేసి మంత్రి ప్రోత్సాహంమీద మళ్ళీ ఆవిడదికి వస్తారు. అప్పుడు ఆవిడికి గండం గడుస్తుందా? పైమాసపు సంచికలో ఆ సంగతి చదువుదురుగాని ఇప్పటికి ఇంతటితో ఈ కథను కంచికి పంపండి.

౨. లోకజ్ఞానము.

# ఇంగువ

ఇది మీకు తెలిసినవస్తువే. గడ్డకట్టిన జిగురువలె కనపడుతుంది. దీనికి ఘాటైన వాసనఉంది. తిరగమోత వస్తువులలో ఇది ముఖ్యమైంది. చారు, పులుసు మొదలగు వానికి ఇది కమ్మనివాసన ఇస్తుంది. ఇది ఆరోగ్యమునకుకూడా మంచివస్తువ. అనేక రోగాలలో దీనిని వైద్యులు మందుగావాడతారు. తేలుకుట్టినప్పుడు, పాము కరిచినపుడుకూడ దీన్ని ఉపయోగిస్తారు.

ఒక ఇంగువముక్కను నోట్లోవేసుకొని తినడానికి బాగాఉండదు. ఘాటుగాను, చేదుగాను ఉంటుంది. దాని వాసనమాత్రమే మనకు బాగుంటుంది. దానివాసన కిట్టనివాళ్లుకూడా ఉన్నారు. జర్మనీవాళ్లకి ఇంగువ వాసన బొత్తిగా సరిపడదు. వారి భాషలో ఇంగువకి 'దెయ్యాలపేడ' అని పేరు.

మన హిందూదేశంలోను, పెరిషియా దేశంలోను, ఫ్రాంసుదేశంలోను మాత్రమే ఇంగువను వంటకు వాడతారు. ఇతర దేశాల్లో అది ఔషధాల్లో మాత్రం ఉపయోగిస్తారు.

ఇంగువ గట్టి జిగురువంటి పదార్థం అని పైనచెప్పిఉన్నాము. అది ఒకానొక మొక్క యొక్క వ్రేళ్లనుండి గ్రహింపబడుతుంది. ఇంగువ మొక్కలు ప్రపంచములోని కల్లా పెరిషియా, అఫ్గనిస్థానములందు మాత్రమే పెరుగుతాయి. ఈ ఇంగువమొక్కలు మన కొత్తిమిరి మొక్కలను పోలిఉంటాయి. కొత్తిమిరి మొక్కల పువ్వుల్లాగే ఇంగువ మొక్క పువ్వులుకూడా గుత్తులుగుత్తులుగా ఉంటాయి. ఆపువ్వులు చూడ్డానికి చాలా అందంగా లేసుమాదిరిగా ఉంటాయి.

ఇంగువమొక్కను నాలుగువేళ్లు పెరగనిస్తారు. అప్పటికి అది అయిదులేక ఆరు అడుగుల ఎత్తుకు పెరుగుతుంది, అప్పుడు ఆకుల్ని తుంపేసి, కాడని కొట్టేస్తారు. ఆకులు, కాడ కూడ పెర్షియాదేశంలో కూరకు ఉపయోగిస్తారు. ఆ ఇంగువ మొక్కల ఆకులు, కాడలు మన దేశానికి రావు. వచ్చేలోపలనే ఎండిపోతాయి. పెర్షియాదేశంలోనే ఈకూర చాలా ప్రియంగా అమ్ముతుంది ధనవంతులికిమాత్రం అందుబాటులో ఉంటుంది. కాడలోని లోపలిభాగం మరీ రుచిగాఉంటుంది అని ఆ దేశస్థులు చెపుతారు. గెలవేసినతరవాత అరటిచెట్టు కొట్టి అందులోని దూటను మనం కూరకి పచ్చడికి ఉపయోగించినట్లే వారు ఈ ఇంగువచెట్టు కాడలోని లోపలిభాగం కూరకి ఉపయోగిస్తారు.

ఈమొక్కయొక్క వ్రేళ్ళనుండి ఇంగువ గ్రహింపబడుతుంది. వేరుబాగా కనిపించేటట్లు మొక్క మొదట్లో తవ్వుతారు. వేరు లావుగా ఊరిఉంటుంది. ఆవేరుకి అక్కడక్కడ లోతైన నాట్లు పెడతారు. పాలవంటి ద్రవపదార్థం బయటికి కారుతుంది. ఎండబెట్టితే ఈద్రవపదార్థం గట్టిపడుతుంది. దాని రంగుకూడా మారిపోతుంది. నలుపు పాలు ఎక్కువగాగల ఎర్రరంగులోకి దిగుతుంది. ఇంగువలో తెల్లటియింగువకూడా ఉంది. అది మంచిరకం కాని నల్లటిరంగు గలదే సర్వసాధారణమైంది.

పెర్షియా, అఫ్గనిస్థానాలనుండి ఇంగువ ప్రపంచమందలి యితరదేశాలకు రవాణా చేయబడుతుంది.

3. మనపండుగలు.

# మహాశివరాత్రి

'చిట్టిచిట్టి చీమల్ల మర్రి
మర్రికిందా వాడు వెర్రిజంగమ్మూ
వెర్రిజంగమ్మూకు వేవేలు జడలు
జడలలో మెరిసేను జాబిల్లి రేక
జాబిల్లిరేకపై జాహ్నవీగంగ'

అని నీవు చిన్నప్పుడు అవ్వదగ్గర నేర్చుకొన్నపదం ఇంకా జ్ఞాపకం ఉందా? అది శివుణ్ని గూర్చి చెప్పబడ్డది. అతనికి ఏడాదిలోని రోజులన్నింటిలోకీ ప్రియమైన రోజు ఒకటి ఉంది. ఆరోజు ప్రతియేడు మాఘమాసంలో బహుళత్రయోదశినాడు అవుతుంది. శివుడికి ప్రియమైంది కాబట్టి దానికి శివరాత్రి అని పేరువచ్చింది. శివుణ్ని కొలిచేవారికి ఇదిచాలా ముఖ్యమైనపండుగ. శివుని భక్తులందరూ ఆనాడు ఉపవాసాలుంటారు. సాయంకాలం కాగానే శివుడిగుడికి వెళ్ళి దీపంపెట్టుకొని దేవుణ్ని పూజించి ఇంటికివచ్చి ఆ రాత్రిఅల్లా మేలుకొనిఉంటారు. ఆ దేవుణ్ని గూర్చిన కథలు చెప్పుకుంటూ, పాటలు పాడుకుంటూ రాత్రిగడుపుతారు. ఇల్లాచేయడాన్నే జాగరణఅంటారు. మర్నాడు ఉదయాన్నే స్నానం, పూజచేసి పిండివంటలతో భోజనం చేస్తారు. ఇట్లా చేసినవారికి పాపాలు తొలిగిపోయి పుణ్యం కలుగుతుందని పెద్దలు చెప్తూఉంటారు. ఏడాదికి మూడువందల అరవైఆరు రోజులు. అందులో ఒక్క రోజు తిండి, ఒక్క రాత్రి నిద్ర మాని మనల్ని కాపాడుతూ ఉన్న శివుణ్ని చెదరనిమనస్సుతో కొలవడానికి మేలుకోవలసిందిగా మనపెద్దలు ఏర్పఱచారు. ఇది చాలా మంచిఆచారం. నీవుకూడా పెద్దలఆచారం నిలబెట్టి నిలకడగలమనస్సుతో దేవుణ్ని ప్రార్థించడం నేర్చుకోవాలి. జాగరణఅంటే ఏమిటో నీకు తెలిసింది. కాని జాగరణ శివుణ్ని కొలవడానికి ఉద్దేశింపబడింది అనే సంగతి గమనించక ఎల్లాగో ఒకలాగ నిద్రపోకుండా ఉండడమే కావలసింది అనుకొని తెల్లవార్లూ కొందరుస్త్రీలు గవ్వలాట, కొందరుపురుషులు పేకాట ఆడుతారు. ఇది కూడనిపని అని నీఅంతట నీకే ఇప్పుడు గ్రహించుకోగలవు. మన తెనుగుదేశంలో ఈ పండక్కి చాలాచోట్ల తీర్థాలుజరుగుతాయి. శివరాత్రికి కర్నూలు జిల్లాలోని శ్రీశైలానికి వెళ్ళేయాత్రికులు చాలామంది ఉంటారు. గంజాంజిల్లాలో ముఖలింగంలోనూ, గోదావరిజిల్లాలో కోటిపల్లిలోనూ, గుంటూరుజిల్లాలో కోటప్పకొండలోనూ, చిత్తూరుజిల్లాలో కాళహస్తిలోనూ, కర్నూలుజిల్లాలో మహానందిలోనూ శివరాత్రికిజరిగే ఉత్సవాలు చాలాగొప్పవి. కర్నూలుజిల్లాలో యాగంటి అనేచోట కొండల్ని, చిత్తూరుజిల్లాలో తలకోన అనేచోట 80 అడుగుల ఎత్తునుండిపడే జలపాతాన్ని, గుంటూరుజిల్లా అమరావతిలోని ఎత్తయిన అమరేశ్వరస్వామి లింగాన్ని, గోదావరిజిల్లాలో నది మధ్యను కొండమీదఉన్న పట్టిసంగుడిని శివరాత్రి సమయంలో చూస్తే కన్నులకరువుతీరుతుంది. మన జమీందారులుకూడా ఈఉత్సవం జరపడంలో చాలా ఉత్సాహాన్ని చూపిస్తారు. పర్లాకిమిడి రాజావారు వంశధార నది ఒడ్డున ఉన్న ముఖలింగంలోను, శనివారపేట జమీందారువారు ఏలూరుకు పదిమైళ్ళ దూరంలో తమ్మిలేరు ఒడ్డున ఉన్న బలివెలోను, నరసారావుపేట జమీందారువారు కోటప్పకొండమీదను శివరాత్రికి గొప్ప ఉత్సవాలు చేయిస్తారు. గునుపూడి జంగాలు పేరు విన్నావా? గునుపూడి పశ్చిమగోదావరిజిల్లాలో ఉంది. అచ్చటి సోమేశ్వరునిగుడి, గుడిలోని సోమగుండంఅనే చెరువు, అచ్చటి జంగందేవరలు చాలా ప్రసిద్ధికెక్కి ఉన్నారు. శివరాత్రికి కోటప్పకొండలో యల్లమంద కోటీశ్వరునికడకు వచ్చే ప్రభలు - కోటిపల్లిలో సోమేశ్వరస్వామి సన్నిధికివచ్చే గుఱ్ఱాలు చూసితీరవలసిందే. అవకాశం ఉంటేమాత్రం నీవు పెద్దలతో కలిసి తీర్థాలకు వెళ్ళుతూఉండు. చదివి తెలుసుకోవలసినవే కాకుండా తిరిగి చూసి నేర్చుకోవలసినవికూడా ఉన్నాయి అనే సంగతి మరిచిపోవద్దు.

# 3. గ్రంథాలయ నిర్మాణము-నిర్వహణము

### ఉపాశ్రయములు

బౌద్ధులవలెనే జైనులుగూడ తమ భిక్షువుల నివాసమునకై ప్రత్యేకముగ ఉపాశ్రయములను గట్టించిరి. భిక్షువులు వీనిలో నివసించుచు, తమ మతమును వ్యాపింపజేయుచుండిరి. వీరికిని మతగ్రంథములకు ప్రతులను వ్రాయుట ముఖ్య కర్తవ్యముగ నుండెడిది. శ్రీమంతు లనేక లేఖనాకార్యమునకై దానములను చేయుచుండిరి. జైనులు ప్రజలను సులభముగ నాకర్షించుటకై దేశభాషలలోగూడ గ్రంథములను వ్రాయుచుండిరి. వీరిలో మహాప్రతిభాశాలురగు పండితు లెందరోయుండిరి. ఇందుమూలమున నీ జైనోపాశ్రయములలో సంస్కృత, ప్రాకృత, దేశభాషలలో రచింపబడిన గ్రంథము లనేకములు సేకరింపబడుచుండినవి. ఇట్టి గ్రంథాలయములు నేటికిని భారతదేశమునందలి పశ్చిమభాగమున గానవచ్చుచున్నవి. ప్రాచీనకాలమునుండియు వర్ధిల్లుచున్న అహమ్మదాబాదు జైనోపాశ్రయమున గొప్ప గ్రంథాలయమొకటి నేటికిని గలదు. అందు అవశ్యకసూత్ర (10) మను నొక్క జైనగ్రంథమునకే 400 ప్రతులున్నవి. దీనినుండి యీ యుపాశ్రయములలోని గ్రంథాలయములయొక్క సామాన్యతయు, సుశ్లిష్టతయు వేద్యము లగుచున్నవి.

### హిందూ దేవాలయములు

హిందూమతమునకు దేవాలయములు మూలస్తంభములుగ నుండినవి. పరిసరప్రాంతములలోని యుద్యమము లన్నిటికి నివియే కేంద్రస్థానముగనుండినవి. గురువులు శిష్యులకు పాఠములు చెప్పుటయు, పౌరాణికులు మతమును బోధించుటయు, శిల్పులు జాతీయవ్యక్తుల విగ్రహములను నెలకొల్పుటయు, నిటనే జరగుచుండెడిది. ముఖ్య విద్యాపీఠములగు దేవళములలో చక్కని గ్రంథాలయము లుండెడివనుట కెన్నియో ప్రమాణములు గన్పించుచున్నవి. అసంఖ్యాకములగు శాసనము లిట జరుగు విద్యావ్యాసంగమునుగూర్చి దెల్పుచున్నవి. త్రిభువనిలోని శాసనమొకటి యచటి దేవళములో ఋగ్వేదాధ్యాపకులు ముగ్గురును, యజుర్వేదమునకు ముగ్గురును, సామమునకిర్వురును, వాజసనీయ బోధాయనీయ, వేదాంత, రూపావతారవ్యాకరణ భారత రామాయణ వైఖానసమను సూత్రములను బోధించువారొక్కరుండిరని తెల్పుచున్నది. ఇచట మొత్తము మీద 260మంది విద్యార్థులుండిరి. (11) ఎణ్ణాయిరం, తిరుముక్కుడల్ అను చోటులగూడ నిదేవిధముగ యేర్పాట్లుండెడివి. (12) వీనిలో జరగు విద్యావ్యాసంగమే యిట చక్కని గ్రంథాలయము లుండవలెనని స్పష్టపరచుచున్నది. ఈ యూహ వాస్తవమనుటకు నాగైర్, నాగర్కోట దేవాలయములు ప్రమాణములు, నాగైలో నొక ఘటికాశాలయు, దానినిజేరి యొక గ్రంథాలయము నుండెడివనియు, దీనిని ఆర్గురు భాండారికులు నిర్వహించుచుండిరి.(13) ఇంతియగాక దేవాలయములకు పుస్తకములను దానముచేయుట ధనికుల కర్తవ్యమని పురాణములు శాసించుచున్నవి. (14) దేవాలయ భాండారములకు మరియొక నిదర్శనము నాగర్కోట దేవళము. ఇచటి గ్రంథాలయము ఫిరోజ్ షాతుగ్లకు దొరికెను. (15) ఈ చర్చనుండి ప్రాచీన హిందూ

10. Rep. on Sans. Mss. for 1872-73.
11. భారతీయ విద్యాచరిత్రము. పే. 74.
12. ,,
13. Hyd. Arch. series No 8. p. 7.
14. హేమాద్రి, దానకాండ 544.
15. Tarikh-i-Ferishta in Elliot VI p. 227.

దేవాలయము లన్నిటియందును సుప్రసిద్ధ గ్రంథాలయము లుండెడివని స్పష్టమగుచున్నది.

## మఠములు

దేవాలయములలో సామాన్యముగ నన్ని శాస్త్రములను బోధింపబడుచుండె ప్రత్యేకశాఖల ప్రచారమునకై శంకరరామానుజ మధ్వాది మతాచార్యులు మఠములను ప్రత్యేకసంస్థల నేర్పరచిరి: శృంగేరి, ద్వారక, పూరీ కాశీ, హరిద్వారము, బదరీ మున్నగు స్థలముల శంకర మఠములును (16) మేల్కోట, మన్నారు, కోయిల్, అహోబిలము మొదలగు స్థలముల రామానుజీయ మఠములును, (17) ఉడిపి, కుంభకోణము, ముల్‌బాగల్, సుబ్రహ్మణ్యము మున్నగుతావుల మాధ్వ మఠములును నెలకొల్పబడినవి. క్రీ. శ. 12-వ శతాబ్దిలో వీరశైవమతము బయల్వెడలినపిమ్మట కర్ణాటకమున నెన్నియో నూతనమఠములు స్థాపింపబడినవి. 12, 13 శతాబ్దులలో డహాలమండలములోని కాలాముఖ శైవాచార్యులు చోళ కేరళ కాకతీయ రాజుల యాదరము నంది (18) యాంధ్రదేశమున మందరము, పుష్పగిరి, త్రిపురాంతకము మున్నగుచోట్లను, ద్రవిడదేశములో మధుర, తెయ్యూరు, దేవికాపురము మొదలగు స్థలములను పెక్కుమఠములను నిర్మించిరి. (19) ఈ మఠములలో నెల్లప్పుడును విద్యావ్యాసంగము జరుగుచుండెను. బెలగాంవిలోని కోడియమఠమున వేదములు, కుమార పాణినీయ శాకటాయన వ్యాకరణములు, దర్శనములు, యోగము, పురాణేతిహాస ధర్మశాస్త్రములు, కావ్య నాటకాలంకారాదులు మున్నగునవి బోధింపబడుచుండెనని శాసనములు తెల్పుచున్నది. (20) ఇట్టి వ్యాసంగము మఠములన్నిటికిని సామాన్యముగ నుండెడిది. ఆయా విషయములకు సంబంధించిన గ్రంథము లన్నియు నీ సంస్థలలో పదిలపరుపబడి యుండెడివను టకు నేటికిని వీనిలో గాంచనగు నరుదైన తాళపత్ర గ్రంథములే ప్రమాణము.

## రాజాస్థానములు

ప్రాచీన కాలమునుండియు మనరాజులు విద్యాపోషణయు నొక ముఖ్యకర్తవ్యముగ బరిగణించుచుండిరి. బౌద్ధమతానుయాయులగు కనిష్క-శ్రీహర్షాదులు నీ ధర్మమును నిర్వహించిరి. గుప్తరాజుల కాలపు హిందూమత విజృంభణముతో విద్యాపోషణకును ప్రోత్సాహముగల్గెను. ఇంతవరకును మనదేశమున గన్గొనబడిన శాసనములలో చాలభాగము రాజులు విద్వాంసులకొసంగిన దానములను తెల్పుచున్నవి. కేవలమును రాజ్యవిస్తీర్ణముపైననే గాక తమ యాస్థానమునందు పండితుల ప్రతిభ మూలముననే రాజుల కీర్తి గౌరవము లభివృద్ధి నందుచుండెడివి. మహమ్మదీయు లుత్తర హిందూదేశముపై దండెత్తినప్పటితో, హిందూసామ్రాజ్యము మారుమూలలనున్న కాశ్మీర నేపాల దక్షిణాపథములకు వలసపోయెను. అచ్చటి రాజులు దానిని తమ సర్వమును, ప్రాణములనుగూడ ధారపోసి రక్షించిరి. ఇంకటి నుండియు దక్షిణాపథమే హిందూవైదుష్యమున కాటపట్టయ్యెను. ఇచటి రాజులు విద్వాంసుల నెందరినో పోషించి కొందరు స్వయముగ విద్వాంసులై యుండుటచే సంస్కృతమును దేశభాషలు నభివృద్ధినందినవి. ఇట్టి రాజులలో ధారాపాలకుడగు భోజరాజు, అన్హిల్వాడ్ పట్టణ రాజగు చాళుక్య విశాలదేవుడు, వేంగి చాళుక్యరాజరాజు, నెల్లూరి మనుమసిద్ధి, ఓరుగంటి కాకతీయ ప్రతాపరుద్ర దేవమహారాజు, కొండవీటి రాజులగు అనవేమ కుమారగిరి పెదకోమటి వేమారెడ్లు, రాజమహేంద్రవర పాలకుడగు వీరభద్రారెడ్డి, రాచకొండ సర్వజ్ఞసింగభూపతి, విజయనగర సామ్రాజ్యాధీశ్వరుడగు శ్రీకృష్ణదేవరాయలు మున్నగువా రగ్రగణ్యులు. ఈరాజుల యాస్థానములలో చక్కని గ్రంథాలయము లుండెడివనుటకు, నేడు మనకు లభించిన భోజరాజుయొక్క ధారాభాండారమును, అన్హిల్వాడ్ పట్టన్‌లోని చాళుక్యుల గ్రంథాలయము ను తెల్పు నిదర్శనములే (21) వీనిలో నాయా

16. భారతి X-6. పే. 142.
17. ,,
18. JAHRs. IV—3 & 4.
19. E.R. 1926. "Golagi Matha"
20. భారతి-సెప్టెంబరు 1933. భా.వి. చరిత్రము.
21. Buhler-Ind Pale. p. 99,

రాజులును, వారిచే పోషింపబడిన పండితులును రచించిన గ్రంథములు కదిలపరుపబడి యుండెడివని యూహింపవచ్చును.

ఇటులనై ప్రాచీన భారతీయ గ్రంథాలయము లెట్లు నిర్వహింపబడుచుండెడివో తెలుపవలసి యున్నది. భాస్కరసంహితయను నొక ప్రాచీన గ్రంథమును, నాగైయను స్థలమునగల శిథిలములు నీ సందర్భమున నెక్కుడుగ నుపయోగించుచున్నవి. వైజ్ఞానికమగు ప్రతివిషయమును పరిశోధించి సూత్రీకరించిన మన పూర్వులు విజ్ఞానరక్షణమున కతిముఖ్యమగు గ్రంథాలయములయొక్క నిర్వహణమునుగూర్చి తూష్ణీంభావమును వహించియుండరు. పూర్వ మీ కార్యమునకు సంబంధించిన గ్రంథములెన్నియో వ్యక్తిలో నుండి యుండును. లేనిచో నాలందా విక్రమశిలాది మహాసంస్థలలోని గ్రంథములను జాగ్రతపరచుట దుర్లభమై యుండును. కావున గ్రంథాలయనిర్మాణ నిర్వహణములనుగూర్చి పూర్వము గ్రంథము లుండెడివనియు నవి క్రమముగా నశించిపోయి నేడు కన్పించుటలేదనియు నూహింపవచ్చును. భాస్కరసంహిత దీనికి ప్రత్యక్షోదాహరణము. అందు గ్రంథాలయమును జక్కగ నిర్మింపబడినయింటిలో స్థాపింపవలెననియు, పుస్తకముల నొక్కొకదానిని గుడ్డలోచుట్టపెట్టి త్రాళ్ళతో కట్టవలెననియు, పిమ్మట వానిని వరుసగా ఇనుపమంచెలపై (racks) నుంచవలెననియు చెప్పబడియున్నది. ఇట్టిభాండార మొక భాండారికుడను నుద్యోగి యధీనము నందుండవలెనట. గ్రంథములను రక్షించుటయే గాక వాని నుపయోగించునెడ విద్యార్థులకు తోడ్పడుటగూడ నీ యుద్యోగికి ముఖ్యకర్తవ్యమట. దీనినిబట్టి యీ భాండారికులు సర్వతోముఖమగు పాండిత్యమును గలిగియుండెడివారని విస్పష్టమగుచున్నది. ప్రకృత నైజాం రాష్ట్రములోని వాడికి సమీపమునన్న నాగై అను చోట కనిపెట్టబడిన శిథిలములును, శాసనములును పై భాస్కరసంహితలోని నియమముల కుత్కృష్టములగు నుదాహరణములు. ఇచటి శిథిలములలో నిరుపార్శ్వము లను గదులుగల వసారాయున్నది. దీనికొక చివరన నొక విశాలమగు భవనముగలదు. ఇందు గోడలలో చేసు వరుసల గూళ్ళును, నేలపై రాతి యరుగులు నున్నవి. (22) ఈ గూళ్ళలో గ్రంథములుండెడివనియు, యరుగులు పాఠకులు కూర్చొనుటకై ఉపయోగపడుచుండెడివనియు నీ కట్టడమంతయు నేరి యొక గ్రంథాలయమనియు స్పష్టమగుచున్నది. ఇచటి శాసనములనుండి యీ భాండారమున నార్గురు సరస్వతీభాండారికు (Librarians) లుండిరనియు, నియ్యది యొక విద్యాలయమునకు చేరియుండెడిదనియు తెలియుచున్నది. ఈ విద్యాలయములో వేదములను చదువువారు 200 మందియు, శాస్త్రములను నేర్చువారు 52 మందియు విద్యార్థులును, ముగ్గురు వేదాధ్యాపకులును, ముగ్గురు శాస్త్రములనుబోధించువారు, నార్గురు భాండారికులునుండిరి. దీనినిబట్టి యీ భాండారికులు గూడ నుపాధ్యాయవృత్తిని నిర్వహించుచుండిరని తోచుచున్నది. భాస్కరసంహితలో భాండారికుల కధ్యాపక కార్యము విధింపబడియున్నదని యిదివరలో చెప్పియుంటిని.

ఈ విధమున ప్రాచీనకాలమున గ్రంథాలయములు మన దేశమునం దుత్కృష్టసంస్థలుగనుండి యెల్లెడలను గాంచనగుచుండినవి. విద్యావ్యాసంగమును, పోషణము నెచ్చటెచ్చట గాంచనగుచుండిన నచ్చటచ్చట నీ సంస్థ లుండెడివని చెప్పవచ్చును.

—మారేమండ రామారావు. ఎం ఏ.బిఇడి.

---

22. Hyd. Arch. series No 8. p. 1.


# ఆంధ్రభూమి

సచిత్రాంధ్రమాసపత్రిక.

ప్రతిమాసమున ౧౫-వ తేదిని ప్రచురింపబడును.

చందా వివరము.

| | | |
|---|---|---|
| సంవత్సరమునకు | రు. | ౩-౦-౦ |
| అర్ధసంవత్సరమునకు | రు. | ౧-౮-౦ |
| నాలుగు మాసములకు | రు. | ౧-౦-౦ |
| విడిసంచిక | రు. | ౦-౪-౦ |

# స్వప్నకథ

## (విమర్శక వ్యాసము)

'స్వప్నకథ' ఒక పద్యకావ్యము మధురకవితావిలసితుడగు జి. జాషువా రచియించినది. ఈ కావ్యము 'స్వప్నకథ', 'అనాథ' అను రెండు పద్యకథలసంపుటి. చిన్నకథలను రచించుట—గద్యమునకాని, పద్యమునకాని—మనవారు ఆంగ్లసాహిత్యసంపర్కముననే నేర్చుకొనిరి. నేడు గద్యమున విరివిగా చిన్నకథలు రచియింపబడుచున్నవి. పద్యమునమాత్రము చిన్నకథల సారస్వతము పొందవలసినంత పరిపుష్టి నొందలేదని చెప్పకతప్పదు. చిర్రావూరి కామేశ్వరరావు 'ఏకాంత ప్రేమ'; వేటూరి ప్రభాకరశాస్త్రి 'మూన్నాళ్ళ ముచ్చట'; వేంకట పార్వతీశ్వరకవుల 'జలజమాలిక' మున్నగునవి ఆంధ్రమున పద్యములలో వ్రాయబడిన చిన్నకథల వాఙ్మయమునకు ప్రతిష్ఠనార్జించినవి. ఇట్టివి వ్రేళ్ళమీద లెక్కింపజాలినంత కొలదిమాత్రములై యున్నవనుట నిక్కువము. గద్యము పొంతబోవక కేవల పద్యరచనమీదనే దృష్టినిలిపియున్న నేటి యువకవులలో పలువురు పద్యములలో చిన్నకథలను చిత్రించుటకుమాత్రము చికీర్షువులుకాకుండుట ఒక చిత్రవిషయము. జాషువా అట్లుగాక పద్యకథానకరచనమునకు కూడ గడంగుట ముదావహముగనున్నది.

విశేషమేమన ఈతని కవితాశైలి కథానకరచనమునకు సరిగ అమరియుండుట. అస్పష్టదోషము లేశమైన లేకుండుటచేతను—విషయములు బోధగమ్యములై యుండుటచేతను 'స్వప్నకథ'యు, 'అనాథ'యు వచనమున వ్రాయబడినంత సులభముగ పఠింపదగి టెన్నిసనుకవి వ్రాసిన డోరా, లార్డ్ ఆఫ్ బర్లే మొదలగు కథానకములను జ్ఞప్తికి తెచ్చుచున్నవి. ఈ రెండుకథలను ఒక్కింత విపులముగ పరామర్శింతము.

'స్వప్నకథ'ను రచయిత 'మూటగట్టబడినగాలి' అనుచున్నాడు. ఒక రెడ్డిపడుచు పరోపకారమునకు తన పెళ్ళి వ్యయించి అవ్వయై చంద్రలోకమును ప్రాపించి రాట్నమున జ్యోత్స్నామాత్రములు తీయుచుండుట ఇందలి ముఖ్యకథ. మనకవులు సాధారణముగ చంద్రునిలోని నలుపును శశమందురు. శాస్త్రజ్ఞులు దానిని చంద్రగోళమునందలి పర్వతములందురు. వివిధదేశములందలి పిట్టకథలలోమాత్రము ఈ నలుపువిషయము అభూతకల్పనలతో కూడియుండును. నార్వేదేశమున ఒక పుక్కిటికథలో చంద్రునిలోని నలుపు ఒక కట్టెలమ్మువాని శరీరముగ పేర్కొనబడినది. అక్కడ కట్టెలమ్మువాడైన చంద్రునిలోనినలుపు ఇక్కడ రాట్నము వడుకు అవ్వయైనది.

'రచనాకందమాత్ర గుణితయుగకలము' గల కవి యొకనాడు స్వప్నమున నింగికి రివ్వునలేచి కాఱుమబ్బు డోలికలలోపరుండి కేళిసల్పుచున్న బాలునిచూచి అతని ఆహ్వానమునై అతనియింటికి పోవును. పోయి అచట ఏకులరాట్నముగల ఒకవృద్ధవిలాసినినిచూచి ఆమెకథ అడిగి తెలిసికొనును. కావ్యమంతయు తొంబదిమూడు పద్యములు. అందు ఇరువదియొక్క పద్యములు ఈ ఉపోద్ఘాతవృత్తాంతనివేదనమునకు పోయినవి. మిగిలిన డెబ్బదిపద్యములును ఆ అవ్వచెప్పు ఆమెకథయే. కథాకథన ప్రారంభమే ఎంతమనోహరముగ చేయుచున్నదో చూడుడు:

సీ. ఆకాశరాజు నీళ్ళాడు చక్కదనాల
  బుడుతచుక్కలకెల్లఁ బుసుడువోసి
అలవోక నిండుజాబిలి రాట్నములమీద
  మేలైన వెన్నెల నూలువడికి
విభునిదుర్దశఁ జూచి విలపించు రోహిణీ
  నారీవతంసంబు నూఱడించి ప్రోవు
గ్రహణకాలమునందుఁ గలుషితంబై
  నడుపలిపుట్టంబు లుదికిపెట్టి
గీ. ప్రసవవేదనఁ బడు వేల్పుబడతుకలకు
  మీఱుమిగిలిన మంతరసానినగుచు [మార!
  నమవనకుఁగూడఁ గన్నుమూయను కవులు
  వర్ణించు జింకను గాను నేను.

రెడ్డిసానికి జనించి పాలుతాగు పసితనముననే తల్లి దండ్రుల బోగొట్టుకొని పాలెపడతి కనికరమున పెరిగి యౌవనమంది యున్నరతి పీథులందిరిగెడు ముసలి పేద వాని దైన్యజీవితమునకు నీరై వాని పోషణముకొఱకు స్వసుఖమును వదలి ఆమె జీవితమంతయు వ్యయించును. మూడు కాళుల ముసలివాడు ఆమెను పరీక్షించుటకు వచ్చిన జేల్సు. అతని దయవలన ఆమెకు చంద్రలోక ప్రాప్తి ఆమెను చావులేదు. ఆ జేల్సు బాలుడై ఆమె పరిచర్యల నందుచున్నాడు. విషాదరసము నిండించు ఈ చరిత్ర తుదకిట్లు అద్భుతములో లీనమైనది. కలుష గర్భితమైనలోకము ఆమెకును ఆ పండ్లూడినముసలికిని కంటకట్టినది. ఆపు డాపేదరాలితలంపులను గనుడు :

స్వాంతము నెఱుంగు దుర్భేద్యయంత్రములను
నలువ సృష్టించియున్న మానవుని జిహ్వ
యనృతమును సృష్టి చేయునా? యవకతవక
గనుననుండున? భువనచక్రమున కిట్లు.

ఆమెకు తారసపడిన బ్రతికిచెడ్డ బ్రాహ్మణి కామె పాయపకుంట సత్యప్రస్థానికథను జ్ఞప్తికి తెచ్చుచున్నది. మంచనకవి దారిద్ర్యమును శార్దూలముతో పోల్చియున్నాడు. ఈకవి చదువులబడితో పోల్చుచున్నాడు.

ఆ.వె పేదతికము పెద్దవింతచదువులబడి
దానిలోన లజ్జ గానఁబడదు.
ఉదర మొజ్జయగుచు నోరంత ప్రౌఢులు
నోర్మివిద్దె నేర్పుచుండు నచట.

ఇంకలి భావములు అతి నూత్నములై ఒప్పారు చున్నవి.

ఇక రెండవకథ 'అనాథ'. ఇది సలసలక్రాగి చిందిన కన్నీటిబిందువని కవి యనుచున్నాడు. నిజమునకది యట్టిదే. కథావతరణముననే అన్నములేక నకనకలాడు చున్న అర్థుని బిడ్డలతల్లి ప్రత్యక్షమగుచున్నది. పొట్ట నింపుకొను ప్రయత్నమున ఆమెకు లోకులతో కలుగు అనుభవవర్ణనమే ఈ కావ్యమునందలి వస్తువు. ఆమె తొమ్మండుగురిని కలిసికొనుచున్నది. కొందఱు కసిరిరి. కొందఱు ఆదరించిరి. కొందఱు ఔదాసీన్యము వహించిరి. మొదట పడువా జోడ్లపడుచు ఆమెమీదను, ఆమె బిడ్డలమీదను నీళ్ళుకొట్టి వసరాఅరుగుమీదనుండి వెడల నడిచినది. తరువాత ఒకఆమె ఆదరించి అన్నముపెట్టి మధ్యాహ్నము అన్నముకొఱకుగల పెళ్ళివారి యిల్లు చూపినది. పెళ్ళివారింటికి భోజనమునకుపోవు పట్టు పంచెలవారు ఆమెనుచూచి చీదరించుకొనిరి. పెళ్ళి యింటికడ ఆమె వేచియుండ ఆమెపై తొక్కు, దుబ్బండి క్రొత్తఁజేర్చిన పోలీలా యొకఁడుపడెను. వచ్చినంతపని జరిగినది. పిల్లలు గోల. చెంత మేడపై ప్రణయరాజ్యవిహారము చేయు దంపతులీవిషయము నంతగ పాటించలేదు. అప్పటి ఆ పనిచేయునకు అనుకొనినవానికి భార్యవలన చివాట్లు. అయిన నాతఁడామెపిల్లలను అనాథశరణాలయపాలకాలను చేర్చును. ఇక ఆమెమాట? జడివానలో తడిసి ఆమె ఒకచావడిలోనికిపోయి నిలబడును. వానలో తడిసివచ్చిన తన పెంపుడుకుక్కకు ఉపచరించుచున్న ఆయింటి యజమాని ఆమె లోనికివచ్చినందుకు కసరినాడు. ఇంతలో అతనిభార్యవచ్చి ఆమె నాదరించినది. మువ్వురు దంపతులతో ఆమెకుగలిగిన అనుభవములను ప్రదర్శించుటలో కవి తన లోకపరిశీలనాశక్తిని హెచ్చుగ చూపినాడు. మొదటిదంపతులు ఆమెను పాటించలేదు. ప్రణయప్రపంచమునందున్న వారికి ఇతర ప్రపంచము తెలియదు గదా. రెండవదంపతులలో మగడు సహాయము చేసినాడు-భార్య కంటగించుకొన్నది. మూడవజంటలో మగడు ఆదుకొనలేదు - భార్య ఆదుకొన్నది. వివాహబంధమున బంధింపబడియున్న నేమి-మానవస్వభావము లిట్లు వేఱైయుండును.

బిడ్డలను అనాథ శరణాలయమునకు పంపునప్పటి ఆ పేదరాలిమాటలు రాతిగుండెనుకూడ కరిగింపజాలి యున్నవి. ఆస్తిక్యభావమును కలిగించు ఈ కావ్యము నందలి క్రిందిపద్యములు వార్తనుగలిగి బోధరమణీయ ములై యున్నవి.

గీ. ఓయి! నాస్తికుడా! వినుమొక్కమాట
అరసియుందువు ఘోరదృశ్యంబు నిచట
మృత్యుదేవత కోఱలు మెఱయునపుడు
శిశువు నేమహాశక్తి రక్షించెనోయి!

సీ. పసుగ త్తివచ్చు పర్వతమాలికలవంటి
జలధిభంగముల నవ్వలికి గదిమి
బ్రహ్మాండగోళంబుపైఁ బ్రయాణముసేయు
నిసబింబమును తూలనీక నిలిపి
పెళపెళార్భటుల మర్త్యులమీఁది కురికెడు
పిడుగుల నోరగ్గాకి సరివయిచి
సృష్టిలో నొకచిన్నిచీమ కాలముసేయ
పాడమిన కన్నీట మునిఁగి తేలి
గీ. గడియ తీరిక లేక లోకమునుగావ
పరువులిడుచుండు దీనుల పాలివాడు
నిజకరాబ్జంబు నీచిట్టి నినుగుమీఁద
నలిపె నొకని మేషం బది నీ వెఱుఁగవు

పిల్ల చంకలోనున్నది. సైకిలు తల్లి మీద పడినది. పెత్తురుగారు గాయము తల్లికి తగిలినను పిల్ల చెక్కు చెదరలేదు. భగవన్మాయగాక మఱియేమి? ఈ వడుపు వార్తాపత్రికలలో తల్లియొకతె పిల్లనుఎత్తుకొని ఎటకో పోవుచుండ తల్లిపై పిడుగుపడి ఆమె మరణించినదనియు పిల్లమాత్రము ఎట్టి అపాయములేక బ్రతికియుండిన దనియు ప్రచురింపబడినది. ఈ విషయములు నాస్తికు లనుకూడ ఆస్తికులనుగా చేయజాలినవి. ఊర్జస్వియై ఈ ఘట్టమును విస్తరించి జాషువా కావ్యమున పరమప్రయోజనము నొకదానిని సాధించినాడు.

అనాథ కవిచే పురవీథులలో విడిచిపెట్టబడుటచేత నే ఆమె పాఠకుల మనోవీథులను విడిచిపెట్టకున్నది. మన మున బాయకుండునదియే శిల్పముకదా! ఇక నిందు కావ్యశిల్పము అసమగ్రమనుటకు ఎడమేది! 'వసుధపై మాకలున్న సంపన్నుఁడెంతో, బడుగుపేదయు మృత్యుదేవతకు నంత.'—'కరుణావననిధులకుఁ బరహితంబు పథ్యంబుగదా?'—'పెనవాదవసేయరు నీతికోవిదుల్'-'దరిద్రదేవికృపలో నొకలోపము లేకపోవునే?'—'ఖ్యాతి గొప్పదిగదన్న!'—'సుఖమెక్కడో టఁ గడగం డ్లొకచోట'—ఇత్యాది ఈ కావ్యమునందలి సీరులు అర్థమహితములై ఆయా సందర్భములందు చక్కగ హత్తినవి.

ఈరెండు కథలయందును ప్రధానపాత్రలు స్త్రీలు. వారిరువురు కూడ పేదరాండ్రు. వారి పేదతనమే ఈ రెండిటిని పజాతీయకథలుగా నొనర్చుచున్నది. అయితే స్వప్నకథలోని అవ్వవంటివారు చాల అరుదు. అరుదన నేల? వారు స్వప్నలోకమున గాని కానరారు. ఇక 'అనాథ' లోని అనాథవంటి వారిని మనము ఊరూర చూడవచ్చును. కావుననే అనాథకథ మానవ హృదయమును మఱింత యాకర్షించునదిగా నున్నది.

ఈ కావ్యమున విషాదరసమును నివదింపలేనుటకు కవి విశేషప్రయత్నము గావించి ఇతర విషయములను మెలుకువతో అదుపులో ఉంచినాడు. చూడుడు: 'స్వప్నకథ'లో రెడ్డిసాని కూతురు 'నెఱజవ్వనమునఁ దులదూఁగు మందభాగ్యను' అనుకొన్న దన్నమాటలో విషాదము స్ఫురించినంత గాఢముగ 'అనాథ'లో సైకిలు త్రొక్కగ త్రొక్కి చేర్చిన పోలీసు తనసైకిలుతో 'అంకెకురాని భార్యతో జిక్కులనందు భర్తవలె' చిక్కులుపడినాడను వర్ణనమున చమత్కారము స్ఫురించుట లేదు.

లలితపదవిన్యాసధన్యాత్మకులైన ఈ కావ్యమునందలి కవితలో 'ఖిస్యటము' వంటి ఒకటిరెండు సంస్కృతపదములును—ప్రబంధవాసనగొట్టు 'మదనుని పిడిమేనుఁగు'; 'ఖిముండయ్యెఁ గాముండునన్' వంటి ప్రయోగములును వేఱుగా నిల్చుచున్నవి.

'ఆకారములేని అంతరాత్మ'చే మాటలాడించిన సమర్థుడగు ఈ కవి

గీ. పరులదుర్గతిఁ గని గుండె గఱఁగివగచు [దు
సదయహృదయుల వీక్షణాంచలమునం
బుట్టుచుండును కన్నీటి బొట్టువోలె!
ఏఁడి భగవంతుఁడని సంశయింతు వేల?

అని ధిక్కరించి పలికి

గీ కుడువునుసిచెప్పి బంగారు గుడులుఁ గట్టి
పెట్టుచుండురు నరులు నైవేద్యములను
సృష్టికర్తకు, దాని భుజింపఁడతఁడు
భిక్షుకుని చేతి యెంగిలి పిడచగాక!

అను వార్త నిచ్చుచున్నాడు.

—ఆంధ్ర శేషగిరిరావు, బి.ఏ.

"ఆంధ్రభూమి"

౧.




శ్రీ సురవరము ప్రతాపరెడ్డిగారు, బి.ఏ.,బి.ఎల్.

నిజాంరాష్ట్ర ఆంధ్రనాయకులలో నొకరు. కవులు, గ్రంథకర్తలు, దేశాభిమానులు.

" ఆంధ్రభూమి "



లార్డు నార్తుక్లిఫ్.



తెలుగువారి నార్తుక్లిఫ్.

# లార్డు నార్తుక్లిఫ్

[అతని యాజమాన్యమున నూటికిమించి పత్రికలు ప్రచురింపబడి నవి. 'డెయిలీమెయిలు' అతని ప్రధానదినపత్రిక. దాని మొదటిసంచిక ప్రతులు మూడులక్షలకు పైగా అమ్ముడుపోయినవి. నేడాపత్రిక సంచికలు దినమునకు పదిలక్షల ప్రతులు అమ్ముడుపోవును. అతనిచరిత్ర చదువ దగినది కాదా?]

లార్డునార్తుక్లిఫ్ ప్రపంచమెఱిగిన వార్తాపత్రికా నిర్వాహకులలో మేటి. అతనిసోదరుడు లార్డు రోథర్ మియర్. ఈతడు జన్మముచేతనే గాక వార్తాపత్రికా నిర్వాహకవృత్తియందు కూడ అతని సోదరుడే. బ్రిటిష వార్తాపత్రికల ప్రపంచమున ఈ సోదరులిద్దఱును శుక్రతారలు.

వారిది హార్మ్సువర్తుకుటుంబము. పెద్ద అతనిపేరు ఆల్‌ఫ్రెడ్, చిన్నఅతని నామము హెరాల్డు. ఈ బాలురిద్దఱును కలిసి వార్తాపత్రికానిర్వాహకులుగా అతి లోకప్రఖ్యాతి గాంచిరి.

అవి వారి బాల్యదినములు. సైకిలు కనుగొనబడి అప్పటికి ఎన్నియోదినములు కాలేదు. ఆల్ఫ్రెడ్‌నకు క్రొత్తవస్తువులపై మోజు అధికము, కాగా అతను సైకిలుసుఖమునకు మనసు దార్చినాడు. పట్టణవాస్తవ్యులు సెలవుదినములలో పల్లెటిపట్టులకు పోవుటకు ఆనాటి త్వరప్రయాణసాధనములలో సైకిలు ముఖ్యమైనది. లండనులోని సెయింట్ జాన్‌వుడ్ అను ప్రదేశమున నివసించు కుటుంబములందలి బాలురందరును ఆ దినములలో ఆల్ఫ్రెడ్ నాయకత్వమున సైకిలు నేర్చుకొని సెలవుదినములలో పల్లెటిగాలి పీల్చుటకును, విశాలములగు రోడ్లపై విహారము చేయుటకును రిప్లీఅను గ్రామమునకు పోవుచుండిరి. ప్రతిశనివారము ఉదయము తొమ్మిదిగంటలు మొదలు రాత్రి పదిగంటలవఱకు వారు సైకిళ్ళమీదనే కాపురముందువారు.

ఈ యాత్రలయందెల్ల ఉత్సాహము, ఆనందము కలిగించువాడు ఆల్‌ఫ్రెడ్ హార్మ్సువర్తే. బాలుడుగా అతనికి పలువురు మిత్రులుండిరి; శత్రువులు ఒక్కరుకూడ లేకుండిరి. అతడు ఉత్సాహవంతుడే కాని ఉద్రిక్తుడు కాడు. చేయవలసిన పనినికూడ చెడగొట్టు వెఱ్ఱి ఉన్మాదపుటూహలు అతనికడ లేకుండెను. ప్రాణపద మగుమైత్రి నెఱపువాడు. కాని తన చెప్పుచేతలలో నుండనివారినుండి తాను దూరముగనుండుటకు జాగ్రత్త వహించువాడు. అతని ఈసుస్థితి ఇతరబాలురకు రోట్టలు వేయఁదగినదిగా నుండునది.

ఆల్‌ఫ్రెడ్ హెరాల్డులతండ్రి ఆనాటి పేరుకెక్కిన బారిస్టరులలో నొకడు. అతడును అతనిభార్యయు ఆల్‌ఫ్రెడ్ పెరిగి పెద్దయై తండ్రివలె న్యాయవాది కావలయునని వాంఛించిరి. కాని ఆల్‌ఫ్రెడ్ న్యాయవాదియగుట విధి నిర్ణయింపలేదు. వార్తాపత్రికానిర్వాహకవృత్తిపై ఆ బాలుని కన్నుపడినది. రాగల విషయములు ఒక్కొక్కప్పుడు ఇట్లు సూచితము లగుచుండును కాబోలును! భావికాలమున ప్రపంచమెఱిగిన వార్తాపత్రికానిర్వాహకులలో సాటిమేటిలేనివాడు అయి లార్డునార్తుక్లిఫ్ అను ప్రభు బిరుదమందిన ఆల్‌ఫ్రెడ్ విద్యార్థిదశలో తాను చదువుచున్న పాఠశాలపక్షమున ప్రచురింపబడు పత్రికకు సంపాదకుడైనాడు. పాఠశాలలోనే పత్రికా సంపాదకుడైన ఆ విద్యార్థి పాఠశాలవీడినపిమ్మటకూడ పత్రికానిర్వాహకుడను కావలయుననియే అహర్నిశలు ఆలోచించువాడు.

ఆ రోజులలో ఆంగ్లదేశమున పత్రికానిర్వాహణము బహుకష్టతరమైయుండెను. హేమాహేమీలు వ్రాసిన వ్యాసములతో నిండారి ఆనాటిపత్రికలు నెలలలో

కూడ సామాన్యులకందుబాటున నుండకుండెను. సామాన్యజనులకొఱకైన పత్రికలును- ప్రత్యేకము స్త్రీలకొఱకును, బాలబాలికల కొఱకును ఉద్దేశింపబడిన పత్రికలును నేడు వేలకొలదిగ కలవు. అవి నేడు లక్షల కొలదిగ ప్రతులు అమ్ముడుపోవుచున్నవి. కాని ఆనాడట్టి పత్రికలు పుట్టువనొందలేదు.

అంతవఱకు అట్టిపత్రికలు పుట్టువనొందకుండుటయే నార్త్‌క్లిఫ్‌నకు మంచి అవకాశము లభించినట్లయ్యెను. అన్ని తరగతులవారికిని అక్కఱకువచ్చు సామాన్యవిషయములుగల పత్రికల ఆవశ్యకమును అతడు గుర్తించెను. దేశమున ఉచితవిద్యావిధానము ప్రవేశపెట్టబడినది. కాగా అందఱును చదువుట నేర్చుచున్నారు. వీరందఱును చదువదగు-విజ్ఞానమును, వినోదమునుపుట్టించు విషయములుగల పత్రిక ప్రచురించుట అవసరమెంతేనిగలదు. అట్టిపత్రిక నొకదానిని జార్జి న్యూనెస్ అనువాడు 'టిట్‌బిట్స్' నామముతో స్థాపించియున్నాడు. అది జయప్రదమంటినది. ఈ విషయము ఆల్‌ఫ్రెడ్‌నకు తన భావములు పరిస్థితులను లెస్సగ గ్రహించుటచేత కలిగినదేయను నమ్మకమును పుట్టించినది.

'డెయిలీటెలిగ్రాఫ్' పత్రికాసంపాదకమహాశయుడగు జార్జి అగస్టస్‌సాలా అనువాడు ఆల్‌ఫ్రెడ్‌ను వార్తాపత్రికానిర్వహణవృత్తిలో అడుగుపెట్టవలదని హితోపదేశముచేసెను. 'సామాన్యపరిస్థితులలోనే వార్తాపత్రికానిర్వహణవృత్తి క్లిష్టమైనది. అందులో ఈ రోజులలో ప్రజల మానసికప్రవృత్తులు విద్యుద్వేగమున మార్పుచెందుచున్నవి. కాగా వార్తాపత్రికానిర్వహణవృత్తి క్లిష్టతరమగుచున్నది.' అని సాలా నొక్కి చెప్పినాడు.

సాలా ఉపదేశమును ఆల్‌ఫ్రెడ్ వినియుండినచో ప్రపంచము లార్డునార్త్‌క్లిఫ్‌ను చూసియుండకపోవును. ఒక లార్డునార్త్‌క్లిఫ్‌నే అననేల? లార్డు రోథర్‌మియర్‌నుకూడ చూచియుండకపోవును. ఏమన ఆల్‌ఫ్రెడ్‌ను, హెరాల్డునుకలిసి వార్తాపత్రికానిర్వహణమున పనిచేసి కీర్తిసాంద్రులై వరుసగా లార్డు నార్త్‌క్లిఫ్, లార్డు రోథర్‌మియర్ అను ప్రభుబిరుదముల నందిరి. సాలా ఉపదేశమును ఆల్‌ఫ్రెడ్ పెడచెవిని పెట్టియుండుట జర్నలిజమునకొక గొప్పఅదృష్టమని నేడు భావింపబడుచున్నది. ఆల్‌ఫ్రెడ్ తనమనస్సు తానెఱుగును. సరిగా అవసరమగు సమయమున సుప్రసిద్ధివహించిన డెయిలీమెయిల్ పత్రికను స్థాపించుటలోను, అదునెఱిగి విమానవిహారములకు బహుమతులొసంగుటలోను అతడుచూపిన సమయజ్ఞతయే అతని నెప్పుడును కాపాడెను. ఎవరేమి చెప్పుదురుగాక! తాను వార్తాపత్రికానిర్వాహకుడు అయి తీరవలసినదే. అతడు కృతనిశ్చయుడైనాడు.

ఆ కృతనిశ్చయము జరుగుసరికి అతనికెన్నియేండ్లు? పదునారు. వ్యాసములు వ్రాయుటకు ప్రారంభించినాడు. ఒకసంవత్సరము గడచినతరువాత 'యూత్' అను బాలురపత్రికకు అసిస్టెంటు సంపాదకుడుగా పనికి కుదిరినాడు. వారమునకు ముప్పదియొక్క షిల్లింగుల ఆరుపెన్నీలు జీతము.

అనంతరకాలమున ఎన్నియోపత్రికలు స్థాపించి వానినన్నిటిని జయశిఖరమునకు గొనిపోయిన ఆపదునేడేండ్ల బాలుని పూర్తి ప్రజ్ఞయు, దీక్షయు కలిసికూడ 'యూత్' పత్రికను కాపాడలేకపోయెను. పత్రిక నిలిచిపోయినది. ఈ ప్రథమాపజయము అతనికి నిరుత్సాహము కల్గింపలేదు. సంపాదకుడుగా పేరు సంపాదించుటకు అతడు దీక్షవహించియే యుండెను. తిరిగి వ్యాసరచనకు ప్రారంభించినాడు.

ప్రథమమున కలిగిన అపజయములను తమదీక్షచే అనంతరకాలమున జయములుగా మార్చిన ప్రముఖులు ప్రపంచేతిహాసమున పలువురుగలరు. అట్టివారిలో ఆల్‌ఫ్రెడ్ హార్మ్స్‌వర్త్ ఒకడు. అతడు తనకు ప్రథమమున గలిగిన అపజయమును మాత్రమే గాక అనారోగ్యమును కూడ ఎదుర్కొనవలసి యుండెను. బాలుడుగా ఉండినప్పుడే అతడు బలారోగ్యములకు నోచి యుండలేదు. కావున ఫ్లీటుస్ట్రీటులో (లండనులో పలు పత్రికల కార్యస్థానములుగల వీథి) వ్యాసములమ్ము ప్రయత్నముకంటె సుఖమైన వృత్తి నవలంబింపవలసినదిగా

అతని మిత్రులు పలువురు అతనిని హెచ్చరించిరి.

ఇరువదియేండ్లయిన నిండలేదు. అప్పుడే అతనిని ఘోరసమస్య ఎదుర్కొన్నది. పత్రికానిర్వహణమునకే తనకు మంచిదినములు తప్పక రాగలవు. అంత వఱకు ఎంతటి అవస్థలు కలుగుచుండినను వేచియుండుటకే అతడు కృతనిశ్చయుడై యుండెను. ధనమార్జించుటయే అతడు ప్రధానముగ పెట్టుకొనియుండెనేని జర్నలిజములో వచ్చు రాబడికంటె హెచ్చురాబడినిచ్చు వృత్తులలో దేనియందైన నాతడు సుకరముగ ప్రవేశించియుండును. అతని తల్లికి వర్తకశ్రేష్ఠులలో పలువురితో పరిచయముగలదు. అతడు సుఖమే కోరియుండెనేని ఆ వర్తకశ్రేష్ఠుల ఫరములలో అతనికి సులభముగా పనిదొరికి యుండెడిది. కాని అతనికి స్వయంకృషివలన లభింపగల జయముపై మనసు నిలిచినది. అజయమైనను తాను మనసార వాంఛించుచున్న పత్రికానిర్వహణవృత్తియందే కావలయును. దీనిని పొందుటకుగాను అతడు తనకున్న సమస్తమును ఒడ్డినాడు. తాను ఏవిధమగు జీవితమును తొక్కతలంచినదియో ప్రతిబాలుడును ముందుగనే నిశ్చయించుకొనవలయుననియు దానిని పొందుటకుగాను ఒడలు దాచుకొనక శ్రమించుట అతిముఖ్యమనియు అల్‌ఫ్రెడ్ జీవితము ప్రదర్శించుచున్నది.

కవెంట్రీయందలి ఒకపుస్తకప్రచురణశాలలో నాతడొక ఉద్యోగము సంపాదించెను. అచ్చువిషయములను గూర్చి నేర్చుకొనవలసిన సమస్త విషయములను, పత్రిక నడుపుటకు వలయు సమస్తజ్ఞానమును అతడచట నేర్చుకొనినాడు. తన ఇరువదిమూడవ వత్సరమున అతడు కవెంట్రీనుండి తిరిగి లండనువచ్చినాడు. అప్పటి నుండియే అతని జీవితమున సక్రమమగు ప్రారంభము జరిగినదని చెప్పవచ్చును. 'రైళ్ళనుగూర్చిన సర్వవిషయములు' (ఆల్ ఎబవుట్ అవర్ రైల్వేస్) వంటి చవుకపుస్తకములను ముద్రించి విక్రయించు నొక ఫరములో నాతడు భాగస్వామిగా కుదురుకొన్నాడు. అతని భాగస్వామి నామము కార్. కార్‌తో నాతడు తఱుచుగా జనబాహుళ్యమునకు అందుబాటులోనుండు వారపత్రికాప్రచురణమును గూర్చి ముచ్చటించుచుండువాడు. అల్‌ఫ్రెడ్ ఉత్సాహము కార్ గను నించినాడు. అట్టి వారపత్రిక జయమందగల అవకాశములను తెలిసికొన్నాడు. అగుటచే నాతడు ఆవారపత్రికకు వలయు పెట్టుబడిలో కొంతసొమ్ము సద్దుబాటు చేయుదునని చెప్పినాడు. మఱియొక ప్రచురణశాలాధ్యక్షుడును, ఆల్ఫ్రెడ్ రచనములను పెక్కింటిని లోగడ ప్రచురించుచున్నవాడును అగు జేమ్సు హెండర్సన్ కూడ అట్టి వారపత్రికజయమందునని తెలిపినాడు. ఇకనేమి? ఆల్ఫ్రెడ్ తన మొదటి పత్రికను ప్రారంభించుటకు కృతనిశ్చయుడైనాడు. 'ఆన్సర్సు టు కరస్పాండెంట్సు' (విలేఖకులకు సమాధానములు) అని క్రొత్త పత్రికనామము. 1888 వ సంవత్సరము జూన్ 2-వ తేదీ నాడు లండనులో పెటర్‌నాస్టర్ స్క్వేర్ లో 26-వ కవాటసంఖ్యగల గృహమున ఒక చిన్నగదిలో కూర్చుండి ఆపత్రికయొక్క మొదటిసంచిక పుటలను అతడు తిరుగవైచినాడు. నేటి ఆంగ్లవారపత్రికలలో అది బహుజనామోదమునందినది. దాని నామము ఇపుడు 'ఆన్సర్సు' అని కుంచింపబడినది.

భావికాలపు లార్డునార్త్‌క్లిఫ్ ఆ తొలిసంచికలో 'ఆన్సర్సు' స్వవిషయము నిట్లు తెలిపినాడు. 'మాకు పంపబడు ప్రశ్నలకన్నిటికిని సమాధానమిత్తుము. ప్రయివేటు విషయములకన్నిటికిని లేఖలమూలమున సమాధానములిత్తుము. ప్రజాబాహుళ్యమునకు ఉపయోగకరమగు విషయమునుగూర్చి ప్రశ్నవైచుచో దాని సమాధానమును మాపత్రికలో ప్రచురింతుము. క్రమమున మా పత్రికలో ఇట్లు విలేఖకులకు సమాధానములు మాత్రమే ప్రచురించుచుందుము.'

మొదటి సంచికయందే 'సిల్కు స్టాకింగులు', 'ఏమియులేకుండ ఏడాది బ్రతుకుటయెట్లు?' ఇత్యాది మనోజ్ఞవిషయములనుగూర్చిన వ్యాసములుండెను. హారమ్సువర్తు సోదరులు తమజీవితమున జయవంతములైన పలుపత్రికలు స్థాపించియుండుట నేడు జగమెఱిగిన విషయమైయున్నది కావున వారి తొలిపత్రికయగు ఆన్సర్సు శీఘ్రజయమునందినదని నమ్మబడుచున్నది.

కాని నిజము చెప్పవలసివచ్చినచో అదిఅట్టి శీఘ్ర జయమునందలేదని ఒప్పుకొనక తప్పదు. మొదటి సంచికయొక్క కాపీలు పండ్రెండువేలు మాత్రమే అమ్ముడయ్యెను. అగుట ఆసంచిక కిట్టుబాటుకాలేదు. అమ్మకము ప్రాయికముగా లండననగరమున మాత్రమే. ఇతర పట్టణములందలి అమ్మకము మిక్కిలి మందముగా నుండెను.

ఈ సంచిక వెలువరించుటకు నార్తుక్లిఫ్ ఎన్నియో మాసములనుండి విశేషప్రయత్నములు గావించినాడు. ఆ విశేషప్రయత్నమున కీవిక్రయము నిరుత్సాహమును కల్గించునదియైనది, 'ఆన్సర్సు' పత్రిక అచిరకాలముననే మూసివేయబడునని కొందరుభావించిరి. కాని దానిని ప్రారంభించినయువకుడు, దానికి ప్రథమసంపాదకుడైన ఉత్సాహవంతుడు అట్టిభావమును చెంత చేరనీయలేదు. దానిని ఎటులైన నెగ్గించుట కాతడు పూనినాడు. ప్రజలను ఆకర్షించి వారిచే దానిని కొనిపించుటకు అనువగు పద్ధతులనాలోచించి ఆరీతిని సంచికతరువాత సంచిక బయలుపడుచుండుటకే అతడు వృష్టిఘడియల కాలమును వ్యయించువాడు.

ఆఫీసుగది అసలే చిన్నది. దానిని రెండుభాగములుగ జేసినాడు. ఒకటి సంపాదకీయ కార్యాలయము, రెండవ భాగము ప్రచురణశాఖ. అతని తీక్ష్ణబుద్ధికి విద్యుద్వేగమున అనేక నూతనభావములు తోచుచున్నవి. ఈ నూత్నభావములలో ప్రజలను ఆకర్షింపగలవానిని ఏర్చికూర్చి ప్రజలకందించి తన చేతిలోఉన్న కొట్టుబడి ధనము పూర్తియగులోపల పత్రికయొక్క ప్రచారమును విశేషమొనర్చి దానికి స్థిరత్వమొనకూర్చుటలో అతడు విశ్రాంతి ఎఱుగక పనిచేసెను.

మొదటిసంచికలో పోస్టుకార్డుమీద వ్రాసినంపు నవ్వుపుట్టువలలో ప్రశస్తమైనదానికి ఒకగిన్ని బహుమానము ఇచ్చునట్లు ప్రకటింపబడెను. నాటినుండి నేటి వఱకును ఆన్సర్సులో ఈ బహుమానముఉన్నది. పోటీ బహుమానములకు అనువగు ఉత్తమసూచనలు చేయు వారికి యావత్పుఖండమున పదునైదుదినములు తిరిగి వచ్చుటకగుఖర్చు భరింపబడునని రెండవసంచికలో మఱియొక బహుమానము ప్రచురింపబడెను.

పత్రికయొక్క జయమునుగూర్చి ఆ సంపాదకు డెప్పుడును సంశయగ్రస్తుడు కాలేదు. మూడుమాసము లగుసరికి అది పూర్తిజయపథమువట్టెను. సెప్టెంబరు మాసమున దానివలన నష్టమేమియు తగులలేదు. క్రమముగా పత్రికాగ్రాహకులసంఖ్య పెరుగజొచ్చెను.

ఇదేసమయమున భావిలార్డు రోథర్ మియర్ హెరాల్డు హార్మ్సువర్తు చేసినకార్యము ఆ సోదరులు పత్రికజయమునుగూర్చి ఎంతటి దృఢాభిప్రాయమును కలిగియుండిరో వెల్లడిచేయుచున్నది. అప్పటికి హెరాల్డు సివిల్‌సర్వీసులో ఒక మంచిపదవిలో నున్నాడు. దానినివిడనాడి పత్రికలో బిజినెస్ మేనేజరుగా చేరినాడు. గణితశాస్త్రమున అతడు మిక్కిలి తెలివైనవాడు. పాఠశాల వీడుసరికే అతని గణితశాస్త్ర ప్రావీణ్యము పలువురి మన్ననలకు పాత్రమయ్యెను. తరువాత నాతడు బోర్డుఆఫ్ ట్రేడునందు చేరినాడు. అక్కడి అతని అనుభవము జమాఖర్చులను వ్రాయుటలోను, తదితర వ్యాపారవిషయములందును అతనిని అద్వితీయునిగానర్చినది. అట్టి అతడు బిజినెస్‌మేనేజరుగాచేరుట, ఏ వ్యాపారమునకైనను భావిశుభమునే సూచించును. హెరాల్డు ప్రవేశించిన కొలదికాలమునకే పత్రిక లాభము నార్జింపదొడగెను. ఏడాదికి రెండు వేలపౌనుల నికరమగులాభమును పత్రిక చూపదొడంగెను. ఆల్ఫ్రెడ్ కలుకైనగమనిక, ఆల్ఫ్రెడ్ ఉత్సాహము తప్పుదారులబడకుండ హెరాల్డు నిదానము కాపాడునది. ఆ సోదరులకలయిక అపూర్వమైనది. ఒకరిదగ్గఱ లోపించినగుణములు మఱియొకరిదగ్గర ప్రస్ఫుటముగానుండెను. కావుననేవారు ఫ్లీటుస్ట్రీటులో అంతవఱకు కనబడని, వినబడని అద్భుతకృత్యములను గావించిరి. పత్రికకు ఏడాదియగియుసరికి వారమునకు సగటున ఆ పత్రిక ఏబదివేలకాపీలు అమ్ముడుపోవుచుండెను. ఆ సోదరులిద్దఱును యువకులు. అంతటి చిన్న తనమున అట్టివ్యాపారము నిర్వహించుటకు వారు సమర్థులు కారని పలువురు తలంచిరి. కాని ఆ యువకులిద్దరును ఆ పలువురి తలంపులను నిరర్థకముగావించి విజయలక్ష్మీలాలన నందిరి.

మన మనమునబుట్టు నూత్నభావములను తెలుచు ఉపయోగించుచుండుటయే మనజీవితము జయప్రదమందుటకు తోడుపడుననుట నార్త్‌క్లిఫ్ జీవితము వెల్లడి చేయుచున్నది. ఆ కాలమున వారమువారము ఏదోనొక క్రొత్త బహుమానము, భావము ఆన్సర్సులో ఉండవలసినదే. ఏమగు గాక, ఎట్లు అగుగాక తన పత్రికనుగూర్చి ప్రజలు ముచ్చటించుకొనుచుండుటకు అతడు శ్రద్ధ పెట్టి నూత్నవిషయములను కొనివచ్చువాడు.

రైల్వే ప్రమాదములవలని అంగవైకల్యము, మరణము మున్నగువానినుండి కాపాడుటకు అతడు తనపాఠకులకు ఉచితభీమాసౌకర్యమును పత్రిక ప్రారంభింపబడిన తొలిదినములయందే ఏర్పాటుగావించినాడు. 1889-వ సంవత్సరము అక్టోబరులో నాతడు గావించిన ప్రకటనము మఱియు అద్భుతమైనది. 1889-వ సంవత్సరము డిసెంబరు 4-వ తేదీని బ్యాంకి అఫ్ ఇంగ్లండునందు బంగారము యొక్కయు, వెండియొక్కయు మొత్తము ఎంతయుండునో ఇంచుమించుగా సరిగా చెప్పు పాఠకునకు జీవితపర్యంతము వారమునకు ఒకపౌను బహుమానమిచ్చునట్లు 'ఆన్సర్సు'నందు ప్రచురింపబడెను. ఈప్రకటనచేసిన రెండు మాసముల అనంతరమువఱకు దేశమున ప్రజ మఱియొక ఏవిషయమును గూర్చియు నింతగ ముచ్చటింపలేదనవచ్చును. ఈ బహుమానమును కల్పించిన అతని ఈఒక్క భావమే అతనికి గొప్పపేరు దెచ్చిన తొలుతటి విషయము. అట్టి పెద్ద బహుమానము పత్రికకు తప్పక నష్టముకల్గించునని పలువురు తలంచిరి. హారమ్స్‌వర్తు సోదరులభావన మాత్రము పలువురి తలంపులకు వ్యతిరేకముగా నుండెను. జనుల మానసిక ప్రవృత్తి నాకళించుటలో వారు నిరుపమానులు. పోటీబహుమానము ముగియునరికి పత్రికాకార్యాలయమునకు 718,000 ఏడులక్షల పదునెనిమిదివేల పోస్టు కార్డులు వచ్చెను. అనగా ఏమన్నమాట? ఆ పోటీ బహుమానముయొక్క నియమావళిని పఠించుటకుగాను అందఱు జనులు ఆన్సర్సుయొక్క ప్రతులు కొనిరని. ఆ పోటీబహుమానమునందలి నియమమును ఒకదానిని చూడుడు వారి తెలివి ఆకళింపుఅగును. ప్రతి పోస్టు కార్డుమీదను అది కార్యాలయమునకు పంపబడుటకు పూర్వము దానిపై అయిదుగురు సాక్షిసంతకములు చేయవలసియుండెను. అందువలన నాలుగు మిలియనుల (నలుబదిలక్షల) ప్రజలదృష్టికి 'ఆన్సర్సు'పత్రిక గుఱి చేయబడినదైనది.

పత్రిక జయశిఖర మంటుచుండిన ఆ ప్రారంభదినములు ఉద్రిక్తభావపూరితములు. వెనుకటి కార్యాలయము చాలలేదు. విశాలభవనమునకు ఫ్లీటుస్ట్రీటులోని 108 కవాటసంఖ్యగల గృహమునకు కార్యాలయము మార్చబడెను. సంపాదకీయకార్యాలయమున కూర్చుండి నిత్యనూత్నభావపూరితములగు క్రొత్తసంచికలను వెల్వరించుచు, పోటీపరీక్షలో పాల్గొనుచుండు వారిసంఖ్య వారక్రమమున హెచ్చిపోవుచుండుటను ఆల్ఫ్రెడ్ పరిశీలించువాడు. అతని సోదరుడు హెరోల్డు ప్రచురణశాఖాకార్యాలయమునకూర్చుండి హెచ్చు ప్రతులకు ఆర్డరులను టెలిఫోనుద్వారా అందుకొనువాడు. ముద్రింపవలసిన ప్రతులఆర్డరు వారమువారమునకు హెచ్చింపవలసివచ్చుచుండెడిది. ఆ పోటీబహుమానము ఆర్డ్నెన్సుసర్వేడిపార్టుమెంటులోని ఒక యుద్ధభటుడు పొందెను. సరియైన మొత్తమునకు అతని ఊహ రెండుపౌనులు ఇంచుమించుగా ఉండెను. ఈ పోటీబహుమానము పుట్టించినఉద్రేకము సద్దు అణుగునరికి పత్రిక వారమునకు మూడులక్షల ఏబదివేలప్రతులు అమ్ముడుపోవుచుండెను.

ఇక ఇతరపత్రికలు ప్రారంభించుటకు వలయు వ్యాపారస్థిరత్వము తమకు లభించినదనుధైర్యము ఆ సోదరులకు కలిగినది. పరిస్థితులు పూర్తిగఆలోచించి మార్కెట్టులో అరపెన్నీకి అమ్మగల ఒక హాస్యరస పత్రికను 'కామిక్‌కట్సు' అనుపేరుతో ప్రారంభించుటకు వారు నిశ్చయించిరి. అంతవఱకు ఆంగ్లదేశమున హాస్యరసపత్రిక యేదియు పెన్నీకి తక్కువవెలకు విక్రయింపబడుచుండుటలేదు. కాగా అరపెన్నీకి హాస్యరస పత్రిక విక్రయించుట సాధ్యముకాదను ఇతర పత్రికా వ్యాపారుల భావముకంటె హారమ్స్‌వర్తు సోదరుల భావమే మంచిదగుటను రూపించినది. వారి విమర్శకులు

తప్పు అభిప్రాయమునుండిరి. ప్రారంభమునుండి ఆ పత్రిక ఏడాదికి ఇరువదివేలపౌనుల లాభము గొని వచ్చునది.

ఆల్ఫ్రెడ్ ఇప్పుడు క్రమముగా ధనవంతుడగుచున్నాడు. వచ్చినధనము దుర్వ్యయము కాకుండ అతని సోదరుడు జాగ్రత్తచేసి, దానిని వ్యాపారాభివృద్ధికి వినియోగించుచున్నాడు. చిన్నతనమున సైకిలుమీద రిప్లీగ్రామమునకుపోవుచు తాను సంకల్పించిన వానికి క్రమముగా సిద్ధికలిగించు అవకాశము ఆల్ఫ్రెడ్ నకు కలిగినది. 'కామిక్ కట్సు' ప్రచురణమునకు తోడు 'ఫర్గెట్-మి-నాట్' అను పత్రికను ప్రత్యేకము స్త్రీల కొఱకు ప్రచురించుటకు ప్రారంభించిరి. ఇంతవఱకు వారి చేతులలో మూడుపత్రికలు. నాలుగవది, ఐదవదికూడ ప్రారంభించిరి. అవి రెండును హాస్యరసవిషయకములే. వీనితరువాత మరి రెండుపత్రికలు, 'సండే కంపానియన్,' 'సండేసర్కిల్' అనునవి. ఇట్లొక పెద్దసంస్థ ఏర్పాటయ్యెను. పీటర్ నాస్టర్ స్క్వేర్ లో ఒక చిన్న గదిలో ప్రారంభమైన ఆ వ్యాపారము 1893-లో ఆన్సర్సులిమిటెడ్ ఆయెను. ఆ కంపెనీయే ఇప్పుడు ది ఎమాల్గమేటెడ్ ప్రెస్ లిమిటెడ్ అనునామమున వ్యవహరింపబడుచున్నది.

'ఆన్సర్సు' పత్రికయొక్క మొదటిసంచిక వెలువడి ఆయిదేండ్లు తిరుగకుండగనే ఆ సోదరులు సొంతముద్రణాలయమును సంపాదింపగలిగిరి అవి క్రమముగా సౌత్ వార్కునందును గ్రేవ్స్ఎండ్ నందును విలసిల్లుచు ఆంగ్లదేశమునందలి పెద్ద ముద్రణాలయములకన్నిటికి పెద్ద ముద్రణాలయములయ్యెను.

పెద్దతనమున ఆతడు పలువిషయములందు అభిరుచిని చూపువాడు. ఎన్ని విషయములందు ఆతనికి నూత్నాభిరుచి కలుగుగాక తాను యౌవనమున స్థాపించిన పత్రికాప్రచురణవ్యాపారమునమాత్రము అతని గాఢమగు అభిరుచిమాత్రము డిందుపాటొందలేదు. క్రమముగా అది బృహత్పరిణామమునందెను. పత్రికా ప్రచురణ వ్యాపారమున అది సాటిలేనిదయ్యెను. దాని యాజమాన్యమున ప్రచురింపబడు పత్రికలసంఖ్య శతాధికము. ఆంగ్లదేశపు జనాభాలో ప్రతి నలుగురుమనుష్యులలోను ఒక్కొక్కడు ప్రతివారమును ఈ పత్రికలలో కనీసము ఒకదైన కొనకుండినదిలేదు.

లార్డు నార్త్ క్లిఫ్ మరణము నాటికి ఈ ఫరమునందు సంపాదకీయశాఖయందును, వ్యాపారశాఖయందును ఎనిమిదివందలమంది ఉద్యోగులుండిరి. రచయితలకును, చిత్రకారులకును ఈ ఫరమువారు వారమునకు ఐదువేల ఐదువందలపౌనులు ఇచ్చుచుండిరి. ఫరమువారి అన్ని పత్రికలను ముద్రించుటకు ఏడాదికి ముప్పదిరెండు వేలటన్నుల కాగితము కావలసియుండెను. దేశమునందలి ప్రతి మారుమూలయందును వారిపత్రికలను ప్రచురము చేయుటకు ఏడాదికి ఒకకోటి ఇరువదిలక్షల పోస్టర్లు. ఈ బ్రహ్మాండనిర్మాణమునకు ఆద్య బ్రహ్మలెవరు? ఇద్దరు యువకులు. వారి కీర్తిజయమునుకూర్చిన భావన ఏది? నాడు చదువుట నేర్చుకొనుచున్న బాలబాలికలు తాము చదువుటకు అనువగు విషయములను ఆకర్షణీయమగురీతిని అందించు పత్రికలను కొనుటకు ఉత్సాహవంతులై యుందురనుట.

1896-లో వారి కంపెనీనామము హారమ్స్వర్త బ్రదర్సు లిమిటెడ్ గా మార్చబడెను. ఇంతవఱకు వారు వారపత్రికాప్రచురణమునందే మగ్నులైయుండిరి. ఇపుడు వారు ధనవంతులైయున్నారు. కావున దినపత్రికా ప్రచురణమునకుకూడ కడంగిరి. వారపత్రికా ప్రచురణమున వారికి అపారమగు జయము లభించియుండుగాక, వారు దినపత్రికాప్రచురణమునకు కడంగుటలో ప్రమాదపడుచున్నారని పలువురు తలంచిరి. 'సన్' అను పత్రికకు అప్పటి సంపాదకుడగు కెన్నడీ జోన్సు అనువానితో కలిసి సోదరులిరువురును 'ఈవెనింగున్యూస్' అను దినపత్రికను కొనిరి. అంతకుపూర్వము పెక్కేండ్లుగ ఈవెనింగున్యూస్ నష్టముతో నడుపబడుచున్నది. ఆల్ఫ్రెడ్ ఏమిచేయుగాక దీనిని లాభసాటిగా చేయలేడని చాలమంది భయపడిరి. అరపెన్నీకి అమ్ము ఉదయకాలపు దినపత్రికలను గూర్చి నార్త్ క్లిఫ్ తాను కమెంట్రీయందు ఉద్యోగముచేయుచున్నప్పుడే చింతించువాడు. ఆచింతనము ఇప్పటికి

చెర చేరినది. ఇరువదిరైదువేల పౌనులకు 'ఈవెనింగు న్యూస్'ను కొన్నాడు. దానికి నూతనజీవితము పోసినాడు. క్రమముగా ఈవెనింగున్యూస్ ప్రచారము హెచ్చినది.

ఇట్లుండ 'డెయిలీ మెయిలు' అను పేరుతో మఱియొక దినపత్రికను స్థాపించుటకు వారు సన్నాహములు కావించిరి. సన్నాహములన్నియు అతిరహస్యముగ నుంచబడెను. మే నెల 4-వ తేది దానిప్రచురణదినముగ నిర్ణయింపబడినది. చాలరోజులు ముందుగనే డెయిలీ మెయిలు మాదిరి సంచికలు ముద్రింపబడెను. ఎట్లో రహస్యభేదనము జరిగినది. విచిత్రములగు శీర్షికలతో నొప్పారు ఆపత్రిక మాదిరిసంచికలు కొన్ని ప్రచురణదినమునకు పూర్వమే కొందఱి చేతులబడెను. డెయిలీ మెయిలు ప్రపంచమును చూచుటయే సంభవించునేని అది పురిటిలోనే చనిపోవునని వారు అభిప్రాయమిచ్చిరి.

డెయిలీ మెయిలు మొదటిసంచిక నార్త్‌క్లిఫ్ జయమునకు శిఖరప్రతిష్ఠ. దానికథ అతని మాటలలోనే చెప్పుటకు మనోహరముగ నుండును. దాని ఇరువదియవ వార్షికోత్సవసందర్భమున తొలిసంచిక కథ నాతడిట్లు చెప్పినాడు: 'అప్పుడు ఉదయకాలపు దినపత్రికలన్నియు పెన్నీచొప్పున అమ్మబడుచుండెను. టైమ్సు పత్రికమాత్రము 1861 నుండియు మూడుపెన్నీల చొప్పుననే అమ్మబడుచుండెను. ఈ పత్రికల యజమానులు మేము అరపెన్నీ ఉదయపుపత్రికను ప్రారంభింప నున్నామనుటనుగూర్చి ఎట్టి చింతనము గాని లేకయుండిరి. కాని ప్రజలుమాత్రము మా ఈ ప్రారంభమునకు అమితమైన ఉత్సాహమును చూపిరి. వారంతటి ఉత్సాహము చూపుదురని మేము తలంపనేలేదు. ఒక లక్షప్రతులు ముద్రించుటకు మేము ఆయత్తముచేసికొంటిమి. పెన్నీచొప్పున అమ్మబడుపత్రికలు ఉపయోగించుచున్న కాగితమువంటి కాగితమునే మేమును గైకొంటిమి. క్రొత్తమాదిరి యంత్రములను తెప్పించి నిలిపితిమి. ఈవెనింగున్యూస్ క్రమాభివృద్ధిని గమనించి యువకులు పలువురు మా ఈ క్రొత్తపత్రికతో సేవాసంబంధముపెట్టుకొన ముచ్చటపడుచు లేఖలు వ్రాసిరి. రాగల అన్ని ఒడుదుడుకులకు వలయురక్షణలు కావించుకొంటిమని మేము తలంచితిమి. కాని ఒక్కవిషయమున మేము చాల పొరపడితిమని ఒప్పుకొనక తీరదు. ప్రజలు కోరగల కాపీలసంఖ్యయొక్క మదింపులోనే మేము ఘోరముగ ప్రమాదపడితిమి. లక్షప్రతులకు ఏర్పాటు. కాని ఆనాడు మేము మూడులక్షల తొంబదిఏడువేల రెండువందల పదునైదు కాపీలు ముద్రింపవలసిన వారమైతిమి. క్రొత్త ముద్రాయంత్రములు మేము తెప్పించులోపల చుట్టుపట్టులనున్న పెద్ద ముద్రాశాలలలో పెక్కు ఒక్కమాపనికే వినియోగింపవలసివచ్చెను.'

సర్ మాక్సుపెంబర్టన్ వ్రాసిన లార్డు నార్త్‌క్లిఫ్ జీవితచరిత్రలో డెయిలీ మెయిలు తొలిసంచిక ప్రచురింపబడినపుడు ఆల్ఫ్రెడ్ రెండు రోజులు-పగలు రాత్రియుకూడ- ఇంటిమొగముచూడక ఆఫీసులోనే ఉండిపోయెననియు, రెండురోజుల తరువాత బెర్క్లీ స్క్వేర్ నందలి తన యింటికిపోయి అతడు ఇరువది రెండుగంటలు ఒక్కమొగిని నిద్రించినాడనియు, కలత ఎఱుగని ఈ నిద్రకు ఇంటిలోని వారెంతయో అలజడి నొందిరనియు చెప్పబడినది. అప్పటి కాతనికి ముప్పది రైదు వత్సరములు. వారపత్రికలు పెక్కింటికి యజమాని, డెయిలీమెయిలునకు జనకుడు. నాలుగేండ్లు తిరిగివచ్చుసరికి డెయిలీమెయిలు పత్రిక దినమునకు ఏడులక్షల ఏబదివేలనుండి పదిలక్షల ప్రతులవఱకు అమ్ముడుపోవుచుండెను. వార్తాపత్రికాప్రపంచమున ఇట్టిది అశ్రుతపూర్వము. ఒకనికి బాల్యమునకలుగు తలంపులు ఇట్లు భావికాలమున నెఱవేరిన నిదర్శనము లెన్నియో కలవు. బాల్యమునకలుగు తలంపులనందికొని పనిచేయువారు పెద్దకాలమున పేరుప్రతిష్ఠలనందగలరని నార్త్‌క్లిఫ్ చరిత్ర వెల్లడిచేయుచున్నది. పదునాఱవ ఏటనే అతడు చేయదలచినది నిర్ణయించుకొనెను. ఇరువది వర్షముల యనంతర మాతడావిషయములను జయప్రదముగ చేసిచూపెను.

ఘరమువారు ధనమును పుష్కలముగ ఆర్జించుచుండిరి. వ్యయమునుకూడ వారు పుష్కలముగనే చేసిరి. పత్రికను ఆకర్షణీయముగ చేయుటకును, త్వరగ వార్తలు సంగ్రహించుటకును వారు ధనమును నీళ్ళ

ప్రాయముగ నిచ్చిపెట్టువారు. మంచివార్తలు కొనివచ్చుటకుగాను ప్రత్యేకవిలేఖకులు ప్రపంచమునందలి మారుమూలలకు పంపబడువారు. మార్టినిక్యూలో ఒకసారి భూకంపమువచ్చెను. దానినిగూర్చి ఒకకాలము విషయములను తంతిద్వారా తెప్పించుటకు వారు వేయిపౌనులను వెచ్చించిరి. ఆంగ్లదేశమునగల దినపత్రికల కన్నిటిలోనికిని తమపత్రికను అగ్రస్థానమున నుంచుటకుగాను వారిట్టి వ్యయములను అలవోకగా చేయుచుండిరి.

బాల్యముననె నార్త్‌క్లిఫ్ అనారోగ్యముతో గొండాడవలసియుండెనని తొలుత చెప్పియుంటిమి. అధికపరిశ్రమయే తన అనారోగ్యమునకు కారణమని అత డనుభవమును జ్ఞప్తియం దుంచుకొనవలసియుండునది. మంచి పనిరోజులలో సయితమతడు ప్రతిరాత్రియు తొమ్మిదిగంటలకే పడుకొనపోవువాడు. ఉదయమున ఆరుగంటలుదాటి అతడెపుడును నిద్రించియుండడు. అతని ప్రథమప్రాతఃకాల కృత్యమేమి? ఉదయకాలపు పత్రికలన్నియు చదువుట. చనిపోవుటకు రెండుమూడు నెలల పూర్వ మతడు గ్రామమునందలి తనయింట నుండువాడు. అప్పుడు సయితమతడు ఉదయ మారుగంటలకులేచి ఆరుబయట కూర్చుండి ప్రొద్దుటిపత్రికలన్నియు పరికించువాడు. తనపత్రిక ప్రచురించినవార్తలు కొన్ని ఇతరపత్రికలలో లేకుండుటయు, ఇతరపత్రికలు ప్రచురించిన వార్తలన్నియు తన పత్రికలోకూడ నుండుటయుచూచుకొని అత డమితానంద మందువాడు. ప్రతిదానియందును సమగ్రత వాంఛించుట-చేయదలచిన దానియందు పట్టుదలకలిగి యుండుట అను రెండుగుణములుచేరి అతని అపూర్వభావములకు అపూర్వజయమును కలిగించినవి.

ఎమాల్గమేటెడ్ ప్రెస్ అను నామమును ధరించిన ఈ కంపెనీ ప్రపంచమునందలి ప్రచురణాలయముల కన్నిటికిని తలమానికమువంటిది. డెయిలీమెయిలు పత్రికా సంస్థాపనముతో నార్త్‌క్లిఫ్ సృష్టిప్రబంధమునకు ఆశ్వాసాంతమైన దనవచ్చును. కాని అతని కీర్తివృక్షము మఱియొకశాఖను పెంచకుండ నుండలేదు. బ్రిటీషు పత్రికలలో టైమ్సుపత్రిక వయసు చేతను, ప్రతిష్ఠచేతను తొలుత పేర్కొనదగినది. అట్టి పత్రికను కూడ నార్త్‌క్లిఫ్ కొనివైచినాడు. అనగా టైమ్సు పత్రిక విధానమంతయు అతని చెప్పుచేతలపై నాధారపడినదన్నమాట. బ్రిటీషుపత్రికారాజమగు టైమ్సు ఇట్లు కొంతకాలము బ్రిటీషువార్తాపత్రికానిర్వాహకశిఖామణియగు నార్త్‌క్లిఫ్ చేతులలోనుండెను. చిన్నతనమున కిల్లీరోడ్డుమీద సైకిలెక్కి షికార్లుకొట్టిన బాలుడు నేడు లండనునందలి ఫ్లీటువీథిలోని మేధావంతులలో అగ్రసరుడై అలరెను.

1904-లో అతనికి బారొనెట్ హోదా ఈయబడెను. 1906-లో లార్డ్ నార్త్‌క్లిఫ్ బిరుదముతో ప్రభువర్గమున చేర్చబడెను. అతని సోదరుడు లార్డ్ రాథర్మీరు అను బిరుదముతో ప్రభువర్గమున చేర్చబడెను.

ఆ సోదరుల జీవితమునందలి ఇతర ప్రయత్నముల గూర్చి చెప్పుట కిచట తావుచాలదు. డెయిలీమిర్రర్ అనుపేరుతో వారు ప్రత్యేకము స్త్రీల కొకదినపత్రిక ప్రారంభించిరి కాని అది జయమునొందలేదు. అందుమీద వారు దానిని సచిత్రవార్తాపత్రికగ మార్చివైచిరి. నే డది ప్రపంచమునందలి సచిత్రవార్తాపత్రికలలో శ్రేష్ఠతరమైనదై యున్నది. యుద్ధకాలమున సోదరు లిరువురును తమ పత్రికలద్వారా ప్రజలమనములందు దేశభక్తిని రగుల్కొల్పి బ్రిటీషుజయమున కెంతయో తోడుపడిరి. కాగా 'మంత్రిమాణిక్యుడు లాయడ్ జార్జియు, పత్రికానిర్వాహకుడు నార్త్‌క్లిఫ్‌నుకలసి యుద్ధమున బ్రిటీషువారికి జయమునుకూర్చిరి' అని ప్రజలు పలికిరి.

నార్త్‌క్లిఫ్‌నకు యంత్రములనిన సరదా. సైకిళ్ళు క్రొత్తగ వచ్చినరోజులలో అతనికి సైకిలుపిచ్చి. మోటారుసైకిళ్ళు కనుగొనబడినపుడు వానిని కొనిన మొదటిజట్టులో మొదటివాడతడే. 1895 లో నాతడు ఫ్రాంసులో క్రొత్త మోటారుసైకిలెక్కి విహరించినాడు. రోడ్డుతప్పి డొంకదాటి దానితో నాత డొక పొలమున బడినాడు. అగుగాక! మోటారులు వచ్చినప్పుడును వానిని కొనుటకు అతడు మొదటివాడే. క్రొత్త మోడల్ కారు వచ్చినప్పుడెల్ల అతడు కొనువాడు. కారును తానే నడుపుకొనుట అతనికి ముచ్చట. తన తుదిదినములప్పటి తన అనుభవములనుగూర్చి సర్ మాక్స

పెంబర్టన్‌తో అత డిట్లు చెప్పినాడు. 'ఒక కారు, ఒక టెలిఫోను, నిద్రించుటకు మృదువైన పఱుపు. ఇంతకు మించి నాకేమియు అక్కఱలేదు.' గాలివిమానములు క్రొత్తగ వచ్చినరోజులలో వాని చోదనమును అతని పత్రిక బహువిధములమూలమున ప్రోత్సహించెను.

యుద్ధసమయమున, అమెరికావారు మిత్రమండలికి బాసటయైయుండ ప్రచారముచేయ అతడు రెండు సారులు అమెరికాసంయుక్త రాష్ట్రములందు సంచారము చేసెను. ఆ సంచారములో అత డొకతూరి ఇరువది యొక్క దినములు రైలుమీదనే ఉండిపోయెను. అందుతో అతని ఆరోగ్యము పూర్తిగ చెడిపోయినది. విశ్రాంతి గొనినకాని అతడు కోల్కొనుటకష్టమని డాక్టరులు సలహాయిచ్చిరి. అయినను పరాజితమైన జర్మనీ దేశపు పరిస్థితులు స్వయముగ చూచుట కాతడు ప్రయాణముకట్టినాడు. చెడిన ఆరోగ్యము ఈ ప్రయాణముతో పూర్తిగ చెడిపోయినది. ఆంగ్లదేశమునకు తిరిగి వచ్చి అత డెంతయోకాలము జీవింపలేదు.

నార్త్‌క్లిఫ్ మరణానంతరము అతని సోదరుడు రోథర్‌మియర్ పత్రికలకెల్ల యజమాని యయ్యెను. టైమ్సుపత్రిక మాత్రము జాతికొఱకు ట్రస్టుగా అమ్మివేయబడెను. టైమ్సుపత్రిక ఇపుడు ఆంగ్లజాతికి సాముదాయకముగా చెందిన ఆస్తి. ఇక అది తిరిగి ఎప్పుడును అమ్మబడదు.

ఫ్లీటుస్ట్రీటును చెంతగల ట్యూడర్‌వీధి మూలలో నే డొక బ్రహ్మాండభవనము కలదు. ప్రపంచమున ఏ ఒక్క ప్రదేశమునగాని సాముదాయకముగ దొరకని ముద్రణాయంత్ర సామగ్రి ఆ భవనమునందున్నది. దాని కవాటముపై 'నార్త్‌క్లిఫ్ గృహము' అను నామము చెక్కబడియున్నది. బాల్యమున తన పాఠశాలాపత్రికకు సంపాదకుడై—యౌవనమున పెక్కు వారపత్రికలకు స్థాపనాచార్యుడై—ముప్పది యైదేండ్లప్రాయమున ప్రఖ్యాతములగు దినపత్రికల జనకుడై ప్రపంచమెఱిగిన వార్తాపత్రికా నిర్వాహకులలో అద్వితీయుడైనవానికి అదియెంతయు తగిన స్మారకచిహ్నము.





# గోలకొండ కవుల సంచిక

నిజామురాష్ట్రాంధ్రసేవయందు గోలకొండ పత్రిక నిరుపమానయశము నార్జించినది. మల్లినాథ సూరివంటి వ్యాఖ్యాతృశిరోమణిని, బమ్మెర పోతనవంటి భక్తశిఖామణిని, విద్యానాథునివంటి అలంకారశాస్త్రవేత్తను, సోమనాథునివంటి మతప్రచారకుని సారస్వత క్షేత్రమున వెలయింపజేసిన గోలకొండ రాష్ట్రమున ప్రస్తుతయుగమున వెలయుచున్న కవిపండితుల పాండితీప్రభావములను ప్రదర్శనము కల్పింప గోలకొండ సంపాదకులు సంకల్పించి ఆధునికులగు గోలకొండ కవుల రచనములను ఆహ్వానించిరి. వచ్చిన కావ్యములను స్తోత్రములు, మహాపురుష ప్రశంస, శృంగారము ఇత్యాదిగా ౧౧ శాఖలుగా విభజించి సంచికయందు చేర్చిరి. మూడు వందల ఏబదినలుగురు ఆధునిక గోలకొండకవుల రచనములు. రాయలు సైజున నాలుగువందల ఏబదిపుటలు. పెక్కు ఛాయాచిత్రములు. ఆంధ్రుడగువాని ప్రతివాని హస్తమునందున ఉండదగిన సంపుటము. కవిచరిత్రకారునకు ఇందలి కవుల రచనములకంటె కవికాలము, స్థలము, వయస్సు మొదలగు వివరములుగల కవిపరిచయము అను విభాగము విశేషముగ ఉపయోగింపగలదు. శేషాద్రి రమణకవులు ఈసంచికకు అనుబంధముగా చేర్చిన 188 గోలకొండ ప్రాచీనకవుల పట్టిక అమూల్యమైనదిగా నుండి కవిచరిత్రకారుల భ్రమప్రమాదజనితదోషములను ప్రస్ఫుటముచేయుచున్నది. ఈసంచికను ఆధునిక గోలకొండ కవులసర్వస్వమనవచ్చును. ఈ మహోద్యమమునకు సంపాదకభారము వహించిన కవులు, ఆంధ్రమహోదయులు అయిన శ్రీసురవరము ప్రతాపరెడ్డి గారిని అఖిలాంధ్రజనుల పక్షమున మనఃపూర్వకముగ అభినందించుచున్నాము. ఈసంచిక ఇట్టి ఉత్కృష్టరీతిని వెలయుటకు హార్దప్రోత్సాహము లొసంగిన శ్రీమంతు సర్వైరాణీ భాగ్యలక్ష్మమ్మబహద్దరు ఆత్మకూరు పరిపాలకులు విశేషప్రశంసనీయులై యున్నారు. గోలకొండ పత్రిక చందాదారులకు ఒక రూపాయి. ఇతరులకు రెండురూపాయిలు. చిరునామా: గోలకొండ పత్రికా కార్యాలయము, హైదరాబాదు, దక్కన్.

# జిజ్ఞాస — మీమాంస

విజ్ఞానసంపాదనావసరమున వివిధవిషయములందు కలుగు సందేహములను నివారించుకొనవలెనని పత్రికాముఖమున జిజ్ఞాసులు సలుపుటకును — ఇందలి ఏ యొక్క జిజ్ఞాసకైనను సరియైన సమాధానము తెలిసియున్నచో దానిని కూడినంత సంగ్రహముగ వ్రాసి, ప్రచురణార్థము పంపుటకును ఆంధ్రభూమి పాఠకులను ప్రార్థించుచున్నాము.

—సంపాదకుడు.

### ౪౨. ప్రథమగణ్యుడగు ఆధునికాంధ్రకవి.

అరవము, కన్నడము, మహారాష్ట్రము మున్నగు దేశీయభాషలలో ఆయా ప్రజలు ఒక్కొక్కకవిని ప్రథమగణ్యునిగా సంగీకరించి అట్లు చెప్పుకొనుట కద్దు. ఆధునికముగ ఆంధ్రకవిలోకమున అట్లు ప్రథమగణ్యుడుగా చెప్పుకొనదగ్గ కవిగ్రామణి ఎవడు ?

—కె. గోపాలరావు.

### ౪౪. గర్భిణీస్త్రీలు : పుల్లటి ఫలములు.

గర్భిణీస్త్రీలు పుల్లదానిమ్మ, పుల్లనారింజ మొదలగు ఫలములను విస్తరించి తిన వచ్చునా ? విస్తరించి తినుటవలన వారికిని, వారిపిల్లలకును ఏమైన చెడువు ఉండునా ?

—అచంట రామాయమ్మ.

### ౪౫. మతములవారీగా జనసంఖ్య.

జనసంఖ్యనుపట్టి చూచినచో మన హిందూమతము ప్రపంచమతములలో ఎన్నవ స్థాన మాక్రమించుచున్నది ? ఒక్కొక్క మతమును అనుసరించు జనుల సంఖ్య ఎంతెంత ?

—యస్. సుబ్బరామయ్య.

### ౪౬. టాజ్ మహల్ కట్టినదెవరు ?

ప్రపంచప్రఖ్యాతిగాంచిన టాజ్ మహల్ ప్లాను తయారుచేయుటలోను, కట్టుటలోను యూరపియన్ ఇంజనీరు ఒకడు సాయము చేసినట్లు చెప్పబడుచున్నది. దీనిని కాదనుటకు చారిత్రకాధారము లేవైన గలవా ?

—జి. సుబ్రహ్మణ్యశాస్త్రి.

### ౪౩. విషము

పాము, తేలు మున్నగు విషజంతువుల విషములు ఆయాజంతువులకు హానికల్గింప వనుటకు ఈక్రింది విషయు అడ్డుపడుచున్నది. ప్రొఫెసర్ యల్. డి. వూస్టర్ గారు 'సైన్సు' అను పత్రికలో ఇట్లు ప్రకటించుచున్నారు. 'ఇటీవల అమెరికాయందలి ఫోర్టు హేస్ కాన్సాస్ స్టేట్ కాలేజియొక్క జూ ఆలాజికల్ లేబరేటరీలోని చిన్నసర్పమొకటి తన బోనులోని ఇతరసర్పములతో పోరాడుచు ప్రమాదవశమున తన్నుతానే కరచుకొనెను. అది తనకోరలను బయటికి లాగుకొనగలుగు లోపుననే తగినంతవిషము లోనికి దిగుట వలన కొన్నిగంటలలోనే మరణించెను.'

—అల్లంరాజు నరసింహమూర్తి.

### ౪౭. పిప్పళ్ళ పంట

తెనుగుదేశమున పిప్పళ్ళు పండించుటకు మంచి అవకాశమున్నది. పిప్పలి మొక్క చాల మోటైనది. ఈమొక్కలను నాటుటకు తొలకరియు, కార్తికమాసమును మంచి అనుకూల సమయములు. ఇతర సమయములందున్ను మొక్కలనునాటి బ్రతికించుట అంత దుస్తరము కాదు. మందుదినుసులలో పిప్పళ్ళకు సాధారణముగ మంచి ధరఉండును. కావున పిప్పళ్ల సాగు మంచి ఫలప్రదమైనదని చెప్పవచ్చును. వావరమని ఖాళీగా ఒదిలివేయు మామిడి మొదలగు చెట్ల నీడలను దీనిని పెంచుటవలన ఒకక్రొత్త ఫలసాయము లభించుచుండుటయే గాక పెద్ద చెట్టు మొదట మరామత్తు చేసినట్లు కూడ అగును.

—ఆర్. శ్రీరామమూర్తి, బి. ఏ.

# "ఆంధ్రభూమి" పుస్తకపీఠము

## ౧౦౪. కవిరాయలు

గ్రంథకర్త కొత్త వీరభద్రయ్య చౌదరిగారు. పృథ్వీరాజులు స్థానేశ్వరయుద్ధమున గోరిచే చెరపెట్టబడి, కండ్లూడ పెఱుకబడి యుండగా రాయల ఆస్థాన కవి చాందుభట్టు ఎట్లో గోరిని మంచిమాటచేసికొని రాయలశబ్దలక్ష్యశరసంధానమహిమచే గోరిని రాయలచే ప్రదర్శనపాటకమున చంపించి తానును రాయలును ఆత్మహత్య గావించుకొనుట ఇందలి ఇతివృత్తము. కథ చమత్కారమైనది. శైలి ప్రయత్నప్రౌఢము. విద్వాంసులగు శ్రీవాగలింగము వెంకటేశ్వరశాస్త్రి గారిచే పరిష్కరింపబడినదగుట నిర్దుష్టము. క్రౌను సైజున 80 పుటలు. వెల నాలుగుఅణాలు. చౌదరిగారు మరికొన్ని గ్రంథములను రచించి భాషాసేవ చేయుదురు గాక! వలయువారు గ్రంథకర్తపేర తెనాలి తాలూకా సంగంజాగర్లమూడి వ్రాయునది.

## ౧౦౫. స్వప్నకథ

పద్యకావ్యము. గ్రంథకర్త శ్రీ జీ. జాషువకవి. క్రౌను సైజు. ఆంటిక్ కాగితములు. 50 పుటలు. వెల పండ్రెండు అణాలు. ఈగ్రంథమును గూర్చిన విమర్శనము స్థలాంతరమున ప్రత్యేకవ్యాసముగ ప్రచురింపబడినది. ప్రతులు వలయువారు గుంటూరుజిల్లా వినుకొండ యందున్న గ్రంథకర్తను వ్రాయవలెను

## ౧౦౬. రామనామం

రచయిత శ్రీముద్దా విశ్వనాథముగారు. హనుమంతుని రామభక్తి పరసముగ వర్ణింపబడినది. భక్తి భావమును పురికొల్పు లలితరచనము. చిన్నసైజున అందముగ ముద్రింపబడిన ఈ గ్రంథము తపాలాకర్చుల కొఱకు అణాబిళ్ళ పంపువారికి ఉచితముగ ఈయబడుచున్నది.

విలాసము : వ్యాసకుటీరము : మేలుపాక ; వయా ఎలమంచిలి, విశాఖపట్టణము జిల్లా.

## ౧౦౭. గీతాత్రయము

కరుణగీత, గాయత్రీగీత, జ్ఞానగీత అను మూడు గీతల సంపుటి. రాయలసీమ (అధునికాంధ్ర)వాఙ్మయమునకు రామణీయకత కూర్చుచున్న వారిలో నొకరగు శ్రీయుత సీరిపి ఆంజనేయులుగారు రచించినది. విజ్ఞానవల్లికా గ్రంథమాలానుబంధములలో ఇది నాల్గవది. అమ్మవారి జాతరసమయమున నడచిన జంతువుల చిత్రవధను తిలకించి కవిరచియించిన కరుణగీతము ఇందలి ప్రథమగీతము. వేటాడబడిన లేడి మృగయునకు తనపరివేదనము తెలుపుట ఇందు చక్కగ వర్ణింపబడినది. ఇక రెండవగీతము గాయత్రీగీతము. గాయత్రి మంత్రమునకు మహర్షి దయానందుని వ్యాఖ్యానము ననుసరించి తెనుగుసేత. మూడవగీతము జ్ఞానగీత పేరువడగి యున్నది. క్రౌను సైజున 40 పుటలు. దొరకుచోటు: శ్రీ సీరిపి ఆంజనేయులుగారు, అనంతపురము.

## ౧౦౮. గ్రిసెల్డా

వచనము. ఇది శ్రీరామతీర్థస్వామివారి ఉపన్యాసమునకు ఆంధ్రానువాదము. అనువాదకర్తలు సుప్రసిద్ధాంధ్రగ్రంథకర్తలగు శ్రీయుత కూచి నరసింహము పంతులుగారు. ఆదర్శప్రాయమగు గ్రిసెల్డా చరిత్ర చదువదగియున్నది. గొప్పనీతిని బోధించు ఉత్తమ గ్రంథము. రచనముకూడ ఉత్తమముగానున్నది. భగవంతుడు కృతజ్ఞుడై వడ్డితో తన అప్పులను దీర్చుకొనును అను నానుడి ఈకథ చక్కని తార్కాణము. ముద్రణము సుందరముగ నున్నది. క్రౌను సైజున 16 పుటలు. వెల ఒక అణా. చిరునామా : వ్యాసకుటీరము, మేలుపాక — ఎలమంచిలిద్వారా - విశాఖపట్టణము జిల్లా.

## ౧౦౯. గోగీతము

మధురకవి నాళము కృష్ణారావుగారు రచియించిన చిన్న పద్యకావ్యము. 'భోజరాజీయము'లోని గోవ్యాఘ్రసంవాదమునుండి యనువదింపఁబడినది. పాదాంతములందు విఱుపులుగలిగి విలక్షణ తేజముతో నొప్పు గీతములలో ఈ కావ్యము రచింపబడినది. పద్యమున బాలవాఙ్మయసృష్టికి దొరకొన్న ఆధునికాంధ్రకవులలో శ్రీకృష్ణారావుగారు ఒకరు. వారి ఈ కావ్యము ప్రత్యేకము బాలబాలికలు చదువదగి యున్నది. మంచి నీతిని బోధించుచున్నది. శైలి సులభసుందరము. ఈ గ్రంథమును విద్యాశాఖాధికారులు ఎలిమెంటరీ పాఠశాలలయందు పఠనీయముగ నుంచదగును. శైలికొక్క గీతము.

తూఁకుకంటెను, పుష్పాది ధూళికంటె
తృణకణముకంటె, పులుఁగులయీఁక కంటె
దెందుకంటెను, మఱిదూది పింజ కంటె
చుల్కనగుఁగాదె తలిలేని నరుఁడు జగతి.

క్రౌనుసైజున 24 పుటలు. వెల రెండు అణాలు. వలయువారు గ్రంథకర్తకేర రాజమండ్రి వ్రాయునది.

## ౧౧౦. రామతీర్థస్వామి జీవితము


గ్రంథకర్త బులుసు వెంకటేశ్వర్లుగారు, ఎం. ఏ. వివేకానందస్వామివారి జీవితగ్రంథకర్తలుగా శ్రీవారు ఆంధ్రులకు పరిచితులైయున్నారు. జీవితగ్రంథరచనమున అనుభవము సంపాదించిన వారిప్పుడు రామతీర్థస్వామి జీవితము తెనుగువారికందించుట ఎంతేయు సముచితముగ నున్నది. ఈగ్రంథపఠనము మనస్సున కెంతయో ఉత్తేజము కల్గించునదిగా నున్నది. శైలి ధారాళమై ఒప్పుచున్నది. డెమ్మిసైజున 180 పుటలుగల ఈగ్రంథమూల్యము అరరూపాయిమాత్రమే నిర్ణయించుటచే విషయప్రాశస్త్యమునకు మూల్యసౌకర్యముతోడుపడి గ్రంథమునకు బహుళప్రచారము కొనిరాగలదని నమ్ముచున్నాము. ఈ ఉత్తమగ్రంథమును విశ్వవిద్యాలయములవారు తమ విద్యార్థులకు పఠనీయగ్రంథముగ నొనర్చి వారి నైతికజీవితమునకు తోడుపడగలరని ఆశించుచున్నాము. విద్యాధికులగు శ్రీ బులుసు వెంకటేశ్వరులుగారు మఱికొన్ని ఇట్టి ఉత్తమజీవితగ్రంథములను వెలయించి ఆంధ్రభాషాభగవతి నలంకరింతురు గాక! ప్రతులు వలయువారు గ్రంథకర్తకేర కాకినాడ వ్రాయునది.

## ౧౧౧. అనంతపుర మహిళాపాఠశాలా వార్షిక సంచిక

రాయలసీమ అగ్రస్థానము అగు అనంతపురమునగల మహిళాపాఠశాల 1934 వార్షికసంచిక కృతజ్ఞతతో నందుకొంటిమి. కొంతభాగము ఆంగ్లమున, కొంతభాగము తెనుగున వెలువరింపబడినది. ఉభయభాషల యందును వ్యాసములను విద్యార్థినులే రచియించియున్నారు. వీరికిట్టి ఉత్సాహముగ కలిగించిన అధ్యాపకవర్గమువారిని ప్రశంసింపకతీరదు. ఇందు ముఖ్యముగా తెనుగుభాగము శ్రీ సీరిపి ఆంజనేయులుగారి ప్రజ్ఞాపరిశీలనమున వెలువడినది. ఇట్టి ఉత్తమ అధ్యాపక పరిశీలనమున విద్యను గ్రోలుచున్న విద్యార్థినులు అనంతరకాలమున యథామతిని భాషాసేవ చేయకలుగుదురు. చిత్రపటములతో సంచిక ముచ్చటగానున్నది. దొరుకుచోటు: శ్రీమతి ఎ. కోటమ్మగారు, హెడ్‌మిస్ట్రెస్, గవర్నమెంటు స్త్రీ సెకండరీ ట్రెయినింగుస్కూలు, అనంతపురము.

## ౧౧౨. నెలపొడుపు

కవిభూషణ బిరుదాంకితులును శతావధానులును అగు శ్రీ కృత్తివెంటి వెంకటసుబ్బారావు ఎం. ఏ. గారు రచియించిన పండ్రెండు ఖండకావ్యముల సంపుటి. కొన్ని కొన్ని భావములు అపూర్వములుగా నున్నవి. ముఖ్యముగా అల్లుఱద్ది, దసరాచందుగ అను ఖండకావ్యములు కవిరొక్క తెనుగుతనమును వెల్లడిచేయుచున్నవి. ఇట్టి రచనములు తప్పక ప్రోత్సహింపఁగినవని మానమ్మకము. ఆంధ్రులీయువకవికి వలయు ప్రోత్సాహమొసంగుదురు గాక! క్రౌనుసైజున 70 పుటలు. వెల విద్యార్థులకు పండ్రెండు అణాలు, ఇతరులకు రూపాయి. పశ్చిమగోదావరిజిల్లా భీమవరము చెంతగల శ్రీరామపురమునగల గ్రంథకర్తకు వ్రాసి ప్రతులు బడయవచ్చును.




# చింకి చొక్కా

ఎక్కడా వారందొరక్క ఆకలిచిచ్చు కన్నీటితో యేడవడమూ - అర్థమయిన వాళ్ళనీ యాచించి తిరస్కరింపబడి అవమాన క్లేశంతో కృంగిపోవడమూ అతని ప్రతి దిన చర్యలోని ముఖ్యఘట్టాలని-భోగలాలసతో దివ్యభవంతుల్లో కులికే సోమరిపోతుల కేం తెలుస్తుందీ ఒకోరాత్రి పుస్తకం ముందు పెట్టి చదువుకుంటూన్నప్పుడు - చమురై పోయి దీపం ఆరిపోతే - చేతిలో కానీ లేక పోతే - ఆకటికచీకటిలో ....ఆపుస్తకంపేజీల మీాద యెన్ని వేడికన్నీటి బిందువులు యింకి పోయాయో ....రాణీతేనెటీగల్లా మస్తుగా తిని ప్రపంచం అంటే తమతోనే వుందను కుంటూ వచ్చి క్లాసులో కూచునే జమీాందారుకొడ్డుకొళ్ళ కేం యెరుకా? యింకోరో జున నోట్సు రాసుకుంటూన్నప్పుడు - శిలా బ్లంక్రిందటి ఆపాత ఫౌంటెన్ పెన్నులోని సిరా అయిపోతే - మరునాడు నోట్సుపూర్తిగా రాయలేదని కోప్పడే వుపాధ్యాయుని కేం తెలుస్తుందీ వొక అభాగ్యజీవి కన్నుల వుప్పునీరు ఆసగం రాసిన నోట్సులో యిమిడి వుందనీ... అంత లేతప్రాయంలో.... ఆపద్దెనిమిదేండ్ల వయస్సులో—అతని కట్టి వనేక కదుములు కట్టిపోయాయంటే చాలు.... ఒకనిముషం అయినా వృథాచేయకుండా నిరంతరం జీవనాధారంకోసం పోరాడే అతని శరీరం అస్వల్పకాలములోనే మెరవు దెబ్బలతో నిండి కరడుగట్టి వుందంటేచాలు.... ఆచీకటిబ్రతుకులో టార్చివేసి వెతికినా ఆనందమనునది శూన్యమంటే చాలు—

*  *  *

ఒకప్రక్క కొత్తబట్టలు కట్టుకుని కులికే ధనవంతుల విలాసాలు, మరోపక్క కట్టగుడ్డ లేకా, తినతిండి లేకా, కడుపుమంటతో అల్లాడుతూ యింటింటికీ తిరిగే బీదభిక్షుకుల రోదనధ్వనులు. ఒకతట్టున ధనమదాంధుల దుశ్చర్యలూ - రెండోతట్టు అమాయకులగు పేదజనుల ఆర్తనాదములూ - ఒక దెస ఆనందదేవతా ... రెండోదెస దౌర్భాగ్యదేవతా....అది పండుగ ...వూరంతా పండుగే....అతనికీ అతని అన్నలగు దౌర్భాగ్యదామోదరులకీ తప్ప. అందరూ కొత్తబట్టలు వేసికుని తిరుగుతూవుంటే....అతని కాఖరికి చాకింటిబట్ట అయినా లేదు. చినిగిపోయిన, మాసిపోయిన వొక చొక్కావుంది వంటిని. పండుగనాడుకూడా అది తప్పదు. తనతోపాటు అర్థాంగిలా కష్టసుఖాల్ని అనుభవిస్తూ మూాడు పండుగులని గడిపిందది కోటి మానవుని పాషాణహృదయంకన్న దానిదే జాలిగుండె. ఆచింకి చొక్కాకూ-అతని శరీరానికీ-చాలరోజులనుంచి వొక అవినాభావ సంబంధం కలసిపోయివుంది. అతన్ని ఆశ్రయించుకుని అదీ - దాన్ని ఆశ్రయించుకుని అతడూ ... వారానికి రెండురోజు లతనికి

శెలవుదినాలు. దానికి మాత్రం వొకటే విశ్రాంతిదినం. ఆరోజున యేఅణాసబ్బుతోనో కుక్కసబ్బుతోనో వుతికి ఆరేసుకుంటాడు. ఒకక్రైస్తవునికి ఆదివారంనాడు చర్చికివెళ్ళడం యెంతముఖ్యమో యీపని అతనికంత ముఖ్య మారోజున ...మళ్లా వారంవరకూ అంతే - కాని పాపం ఆవేళ - ఆ పండుగరోజున-అదికూడా కరవైపోయింది. సబ్బు అయిపోయింది అయితేమాత్రం.... సబ్బుబిళ్ల లేకపోయినా-బట్టలు వుతుక్కోకపోయినా-అన్నం దొరక్కపోయినా పండుగ ఆగుతుందా ఆ అనాథునికోసం. డబ్బున్న బాబుల్ని పలుకరిస్తుంది, లేనివాళ్లని కసరి కొడుతుంది....

* * *

అదనంగా తినే... సగంతిని వీధిలో పారేసే ప్రతివస్తువా ఎంద రెందరిదో కష్టజీవుల కొత్త నెత్తుటిచుక్క అనేసంగతిని తలుచుకోకుండా ...పిండివంటలు తాపీగా తింటున్నారు. అందరూ బంధువుల్ని ఆహ్వానిస్తున్నారు. అతన్ని ఆపండుగపూట ప్రేమతో పిలచే పుణ్యాత్ములెవరూ ? ముద్దుకూతురికి తలదువ్వతోన్న యెదురింటి అమ్మనుచూస్తే తనతల్లీ చిన్నచెల్లీ జ్ఞప్తికివచ్చారు. ఇద్దరూ కలసి భోగిమంటదగ్గరికి వెళ్ళడమూ, కొత్త పరికిణీ కట్టుకుని చెల్లెలు ఆనందంతో గంతులు వేయడమూ తలచుకుంటే హృదయం కొట్టుకోవడం మొదలెట్టింది చిన్ననాటి రోజుల్లోని ముఖ్యప్రకరణాలు సినీమాలోలా కళ్లముందు తిరగడం ప్రారంభించాయి.... అప్పుడు... ఆపండుగరోజుల్లో అమ్మవద్దంటూన్నా, చెల్లి యిదివరకే పెట్టినప్పటికీ- చేరడేసి బియ్యమూ రెండేసి పోకుండలూ పెడుతూండేవాడు వచ్చిన ముష్టివాళ్లకందరికీ-యీరోజునో-పాపం తల్లిరూపం కళ్ళకు కట్టినట్టయింది. కనులనుంచి రెండు వేడి బిందువులు రాలాయి. యింకో రెండు క్రిందకి రాలకుండా కన్నుల్లోనే గుండ్రంగా తిరుగుతోన్నాయి. వచ్చిన వ్యక్తికూడా కనపడలేదతనికి-దయాకరం యీదృశ్యమంతా చూచి అవగాహన చేసికున్నాడు-అతని నోదార్చి-బతిమాలి - యింటి కాహ్వానించాడు ....పవిత్రమైన పండుగరోజున కిరస్తానీవాళ్లింటిలో ఆతిథ్యమా-ఆ అవును. వెట్టి మొట్టి ధర్మాలని శాసించే శాస్త్రుల్లకీదృశ్యం ఎలా తెలుస్తుందీ - వాళ్ళకేం చెబుతారు కబుర్లయెన్నైనా... అతడు అన్నంతింటూంటే.... దయాకరుని చెల్లెలు - రోజా ...అచింకి చొక్కానూ అతన్నీ చూచి రెండు వేడికన్నీటి చుక్కలను రాల్చింది

* * *

'అది తీసికుంటే-మళ్లా కొనుక్కుంటాడు. డబ్బున్నది. న్యాయంగా అడిగితే ఇవ్వడు. ఎందుకిస్తాడూ-దొంగతనం-అయితే పరీక్షకి డబ్బు రేపు కట్టకపోతే వీల్లేదు. యీ సంవత్సరమంతా ....యీసంవత్సరమేకాదు నా చదువంతా వృథాఅయిపోతుంది ఇంకా రేపుగదా... అయితేమాత్రం రేపటింతలోనే యెక్కడ దొరకుతుందీ పాపం - పాపమూవుదయం మొదలు సాయంత్రంవరకూ చెమటలూడ్చి కష్టపడే నాకు తిండీ లేకుండా చేసీ యింకా పాపమూ-ఎవడంటాడు. మరచిపోయి వెళ్లాడు - వస్తున్నాడేమో-తీసికుంటే - దొంగతనం-అలా అయితే అతను మాత్రం దొంగతనం చేయడంలేదూ, ఏపనీ చేయకుండా అచ్చుపోసిన ఆబోతులా తిరుగుతూ అతడు భాగ్యభోగాలనుభవిస్తాడూ ? ప్రొద్దుటనుంచి సాయంత్రంవరకూ కష్టపడే నేను

కటిక బీదవాణ్ణి?' పాపం మనస్సు వెనక్కీ ముందుకీ వూగులాడుతోంది. అది దొంగ తనంకాదని పూర్తిగా నమ్మకం కలిగితేనే గాని నిశ్చయంగా తీయలేదు. అప్పుడు ప్రాణంపోయే అవసరమైతే అంతరాత్మ అంత బాధించకపోను కాని యింకా రోజు వ్యవధి వుంది యీలోపుగా సంపాదించలేనా? ఎవరిస్తారు? అని ఆలోచించాడు. నెమ్మదిగాతీసి. ఎవరో వస్తున్నారనుకుని తిరిగి పెట్టివేసి... మళ్ళా తీసి జేబులో వేసికున్నాడు. ఇంతలో ఆ గడియారంమాట జ్ఞాపకంవచ్చి తీసికోడానికి జమీందారుగారి అబ్బాయి వస్తున్నాడు. అతన్నిచూచి తానుతీయడం చూశాడనుకున్నాడు. తిరిగి యిచ్చేయాలని గొలుసుపైకి తీయబోయాడు. దాన్నిచూచి అతడు దొంగ అని చేయిపట్టుకున్నాడు ...నిజం అంతా చెప్పాడు....అదవినీ—అతని చింకి చొక్కానూ అతన్నీ చూచి ప్రిన్సిపాలు శామ్యూల్యులుగారు రెండు వేడి నిట్టూర్పులు విడిచారు - జాలితో.

* * *

అతని కష్టాలలో మీరెవరైనా ఆదుకున్నారూ - ఇప్పుడువచ్చి బోధిస్తున్నారు నీతులు. ఇవన్నీ ఆడబ్బున్న బాబులకి చెప్పండి. మాకు జాతిఅక్కర్లేదు మీరనే నీతి అక్కర్లేదు ...తిండి - తిండి కావలసింది...తిండి - అదియివ్వండి తర్వాతకావలిస్తే మీ వేదాంత సారమంతా బుక్కపెడతాం...అతన్ని కాపాడా రాయన - అరస్టుచేయకుండా తన పూచీతో విడుదలచేయించి చదువు చెప్పిస్తున్నాడు...అందుకు విశ్వాసం చూపాడు ...ఆచింకిచొక్కానూ అతన్నీ చూచి కనుల నీరు నించింది...ప్రేమించాడు...రోజాను... పెండ్లిచేసికున్నాడు...మీకేం?

—కంటిపూడి జానకిరామచౌదరి.

# ఉదయిని

రెండు నెలల కొకసారి ప్రచురింపబడు సాహిత్య పత్రిక. సంపాదకులు కొంపెల్ల జనార్దనరావుగారు. శ్రీ విశ్వనాథము సత్యనారాయణమూర్తి ఎం.ఏ గారి 'జయంతి' ఆగిపోయినతరువాత ఇట్టి సుందరపత్రిక తెనుగునాట బయలుదేరలేదని చేయెత్తి చెప్పవచ్చును. ఆకారమునసేగాక ప్రచురితవిషయములందును ఈ పత్రిక ముగ్ధమోహనముగనున్నది. విశిష్టమైన కవితాత్మ గల నేటి తెనుగుకవులలో వేదుల సత్యనారాయణ శాస్త్రి యొకడు. ఆతని రచనములకు ఇందు పూజ్యస్థాన మొసంగబడుట ఎంతయు సముచితముగనున్నది. గద్యవ్యాసములలో గౌరవస్థానమందిన శ్రీ కవికొండల వేంకటరావుగారి 'ప్రేమతత్వం' అను కథావ్యాసము అపూర్వముగనున్నది. శశిభూషణుడు సుజాత జుత్తు కత్తిరించినాడు. ఆమె కోరినసే. మదనమోహనుని భార్య సుజాతను తన జుత్తుకూడ కత్తిరించమని కోరినది. కాని సుజాత ఆ పాపపుపని తాను చేయలేనన్నది. స్త్రీహృదయము స్త్రీహృదయమేకదా! 'ప్రేమకు ఇల్లుకూడా అవసరంలేదనుకుంటాను. మెత్తని యిసుక తిన్నెలమీద, పచ్చని అడవుల్లోను, ఎత్తయిన పర్వతాల మీద పక్షుల్లాగు, తేళ్ళలాగు, గంధర్వుల్లాగు ప్రేమించుకోవచ్చు ననుకుంటాను' అనిన సుజాతవాక్యములు ఎంతటి గంభీరార్థమును ప్రతిపాదించుచున్నవి తలుపు వేసికొని లోపలనున్న మదనమోహనదంపతులకు దీపము - వెలుపలవీధిలో నడుచుచున్న శశిభూషణ దంపతులకు వెన్నెల. ప్రేమతత్వమెఱిగిన తరువాత ఇంటను, బయటను వెలుగేకదా! నీటికొలది తామర అని నటుల తెలివికొలది ఇందు అనేక సూక్ష్మభావములు స్ఫురించును. అడవి బాపిరాజుగారి 'వీణ' ప్రశంసనీయముగనున్నది. ఆంధ్రులీ ఉత్తమపత్రికకు విరాళము లిచ్చియు చందాదారులుగ చేరియు పోషింతురుగాక అని కోరెదము. ఉత్కృష్ట వాఙ్మయసృష్టి నాశించు కళాప్రియులు ఆదరింపదగిన పత్రిక.

చాలు చందా నాలుగురూపాయిలు.

చిరునామా: 15 ఆదెప్ప మొదలివీధి, వేపేరి, మద్రాసు

# మణిమాల

## ముత్యములు: వానిరంగులు.

పరిశుద్ధమైన ముత్యము తెల్లగానుండును. అసలు ముత్యము అనుపేరు చెవులలో పడినతోడనే తెల్లదనము జ్ఞప్తికివచ్చును. అయినను ముత్యములలో కూడ రంగువిభేదము కలదు. పలురంగులుకల ముత్యములను మనము తఱచు చూడకపోయినను అవి అరుదుకాదని మాత్రము చెప్పవచ్చును. వర్ణములందును, ఛాయలయందును వానియందుగల వివిధత్వము వర్ణించి చెప్పతరము కానిది. లండనులో గోల్డుస్మిత్సు అండ్ సిల్వర్ స్మిత్సు కంపెనీ అని ఒకఘరముగలదు. ఆఘరమువారికడ నున్నన్ని ముత్యములు ప్రపంచమున మఱియేఒక్క ఘరమునందును లేవని నిరాఘాటముగ చెప్పవచ్చును. ఆముత్యములైనను ఒక్కచోటనుండి తెప్పింపబడినవి కావు. ప్రపంచమున ముత్యములను పట్టుతావులు ఎన్నికలవో అన్నితావులనుండియు అవి తెప్పింపబడినవి. ఆ ఘరము వారి ప్రదర్శనశాల చూచుటకు కన్నుల వైకుంఠముగా నుండును. ముత్యములలో ఎన్నిరంగులు కలవో మనకు ఒక్కసారిగ అవగతమగును. స్వచ్ఛమైన తెలుపు, వెండివంటి తెలుపు, బంగారురంగు, అసలు పసుపు రంగు, గులాబిరంగు, ఊదారంగు, నీలము మొదలగు రంగులుకల ముత్యములు జనులు ఎఱుంగుదురు. వీని అన్నిటిలోను తెల్లవే సుప్రసిద్ధమైనవి. ఈ తెల్లవానిలో కొంచము పసుపురంగుకలిసినవి మక్కువతో చూడబడును. ఏమన ఎంతకాలమైనను దానిరంగు మాయక ఒకేవిధముగ నుండును. మఱియు నల్లటిచర్మముపై ఈ పసుపుకలిసిన ముత్యములు విశేషకాంతివంతములై యుండుట ప్రజలు వీనిపై విశేషమైన మక్కువ చూపుటకు కారణమై యుండునని కొందఱు చెప్పుదురు. స్వచ్ఛమైన తెల్లని ముత్యములు ధరింపబడిన నలుబది యేబది వత్సరముల పిమ్మట మసకపసుపు రంగు నొందును. హిందూదేశపు తెల్లముత్యమున సాధారణముగ లేలేత అరుణచ్ఛకాంతి ఉండును. ఆస్ట్రేలియా దేశపు తెల్లముత్యములలో ఇట్టి కాంతి ఉండదు. ముత్యపు చిప్పలలోని మాంసము ఎండువఱకును ముత్యములను అందే ఉండనిచ్చుటచేతనే హిందూదేశపు, సింహళద్వీపపు ముత్యములకు మసకపసుపురంగు కలుగుచున్నదని తలంపబడుచున్నది. ముత్యముచిప్పలలోని మాంసము ఎండువఱకును ముత్యములను అందే ఉండనిచ్చుట పూర్తిగా ప్రాచీనపద్ధతి. అమెరికావారు ఈపద్ధతిని విడనాడిరి. ముత్యపు చిప్పలను వారు పట్టినతోడనే చాకుతో ఆచిప్పలను చీల్చి మాంసము మిగులకుండగనే అందుండి ముత్యములను గ్రహింతురు. ఈ పద్ధతివలన ముత్యములు కాదగినపదార్థమంతయు గ్రహింపబడుట కష్టము. కాని దొరికిన ముత్యములుమాత్రము కాంతివంతములై చిరకాలమువఱకుగాని తమకాంతిని గోల్పోవకుండును.

—యస్. టి. మోజెస్. ఎం. ఏ.

* • *

## స్త్రీ సౌందర్యమునకు గుర్తులివి

స్త్రీ సౌందర్యమునకు ఈక్రింది ఇరువదియేడు విషయములను అతి ముఖ్యములని స్పెయినుదేశపు ఒకానొకకవి అనుచున్నాడు: చర్మము, దంతములు, చేతులు—ఇవి తెల్లగానుండవలెను. నేత్రములు, కనుబొమలు, రెప్పవెంట్రుకలు - ఇవి నల్లగానుండవలెను. పెదవులు, బుగ్గలు, గోళ్ళు - ఇవి ఎఱ్ఱగానుండవలెను. శరీరము, శిరోజములు, కరములు - ఇవి దీర్ఘముగానుండవలెను. చెవులు, పళ్ళు, కాళ్ళు - ఇవి పొట్టిగానుండవలెను. వక్షస్థలము, నుదురు, కనుబొమల మధ్యప్రదేశము - ఇవి విశాలముగానుండవలెను. పెదవులు, చేతులు, స్తనములు - ఇవి బలిష్టములుగానుండవలెను. నడుము, అరచేతులు, పాదములు - ఇవి చిన్నవిగానుండవలెను. వ్రేళ్ళు, వెంట్రుకలు, తుంట్లు - ఇవి సన్నగానుండవలెను.

—కె. రామారావు.

## కలలరాక నిద్రాభంగము కాకుండుటకే

సాధారణముగ కలలువచ్చుటచే తమకు కలతనిద్ర అయినదని జను లనుచుండుట పలువురకు అనుభవపునరుక్త విషయము. అక్స్‌ఫర్డు విశ్వవిద్యాలయమున మానసికతత్వశాస్త్రవేత్తగనున్న డాక్టరు విలియమ్‌బ్రౌన్ అనునతడు చెప్పునది దీనికి విరుద్ధముగానున్నది. ఈ విషయమై అత డేమి చెప్పుచున్నాడో చూడుడు: 'నేను చేసిన పరిశోధనలవలన నిద్రామధ్యమున మనము లేచి పోకుండుటకే మనకు కలలువచ్చునని నిర్ధారణ చేయగలుగుచున్నాను. కలలురానిచో సాధారణముగ మనకు రాత్రిఅంతయు గాఢనిద్ర ఉండదని చెప్పవలసియున్నది. మనకు వచ్చు ప్రతిస్వప్నమును ఒకవాంఛను తప్పక నెఱవేర్చుటకే మనకు కలుగుచున్నదని చెప్పవచ్చును. అయితే స్వప్నముతీర్చు వాంఛ ఏట్టిది? గాఢముగ నిద్రపోవలయునను వాంఛ. కలలు గాంచుచుండుటచేతనే నిద్రపోవుచున్నవాడు కలతలేని నిద్రపోగలుగుచున్నాడు. నేనీ దినుసును చెప్పబోవువిషయము పలువురకు అనుభవములోనిదే అయియుండునని నా నమ్మకము. మనము నిద్రపోవుచుండగా మనకు ఒక్కొక్కప్పుడు దాహము వేయును. అయితే మన మప్పుడు మేల్కాంచము. స్వప్నములో మనము చెంబులకొలది నీరుత్రాగినట్లు అగును. దానితో మన దాహముతీరి నట్లైఅయి ఎట్టి భంగములేక మనము నిద్రాముద్రితుల మగుదుము. కలలవిషయమున నేను కావించిన పరిశోధనావసరమున నడచిన ఒక చమత్కారవృత్తాంతమును మీకు చెప్పుటకు నేను ముచ్చటపడుచున్నాను. ఒకడు నిద్రపోవుచున్నాడు. వేడినీళ్ళతో నింపబడిన సీసాకాయను ఒకదానిని అతని పాదములచెంత తగులునట్లు ఉంచితిమి. ప్రపంచప్రఖ్యాతివహించిన వెసూవియస్ అగ్నిపర్వతముచెంత తాను నడుచుచున్నట్లును వేడి లావా తొక్కుచున్నట్లును అతనికి స్వప్నమువచ్చినదట. తరువాత మాతో చెప్పినాడు. వేడినీళ్ళసీసా పాదములకు తాకించినను అతడు కదలకుండుటను చూచి మేము ఒక నీటిచుక్కను అతనిమొగముపై వైచితిమి. దీనికిని అతడు కదలలేదు. తరువాత అతడు చెప్పినదానివలన అప్పుడాతనికి ఆ వెసూవియస్ పర్వతమును ఎక్కుచుండుటచే ముచ్చెమటలు క్రమ్మినట్లును తాను సారా త్రాగుచుండినట్లును స్వప్నమువచ్చినట్లు తెలిసినది. అతనిని ఎటులైన లేపుటకు ముక్కునకేపితిమి. కాని విచిత్రమేమన దీనికిని అతడు కదలలేదు. ఈసారి అతనికి తన మొగముమీద ఎవరో ముసుగువేసి తీసివేసినట్లు స్వప్నమువచ్చినదట. ఇట్టికథలు అనేకము నా పరిశోధనలచే నే నెఱింగినవి చెప్పగలను. కావున స్వప్నములువచ్చుట మనకు నిద్రాభంగము కాకుండుటకే అని నేను చేయెత్తిచెప్పుచున్నాను. ఈ సిద్ధాంతమును మనసునఉంచుకొని ఈసారి వారువారు వారివారికి రాత్రులయందు కలుగు స్వప్నములు తమనిద్రను ఎట్లు కాపాడినవో తెలిసికొనుచుండగలరని ఆశించుచున్నాను.'

— అల్ ఎబవుట్ డ్రీమ్సు.

## పై మానపు సంచికలో

ప్రచురింపబడు వ్యాసములలో కొన్ని

౧. శబరి (చక్కని గద్యవ్యాసము)
—శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు

౨. మందుపుచ్చుకొన్న తప్పు (కథ)
—పమ్మి రామశాస్త్రిగారు

౩. అద్దాల్లో బిడ్డలు (కథ)
—కడియాల కామేశ్వరరావుగారు

౪. కీటకములు: మానవుడు (విజ్ఞానవ్యాసము)
—జాగు గోపాలరావుగారు

౫. పిశాచం: రొట్టె (కథ)
—తల్లాప్రగడ ప్రకాశరాయుడు.

## కేలండర్ల స్వీకారము

బెజవాడయందలి ఆంధ్రప్రావిడెంటుకంపెనీవారును, నెల్లూరుజిల్లా పెరిదేపియందలి ఆయుర్వేదసమాజము వారును పంపిన 1935-వ సంవత్సరపు కేలండర్లు వందనపూర్వకముగ నందుకొంటిమని మనవి.

# ఇన్స్యూరెన్సు విషయములు

## క్రొత్త భీమా కంపెనీలు: యేజెంట్లు

[గతసంచిక తరువాయి]

భీమావ్యాపారము ఏజెంట్లమూలమున నడుచుచుండును. ఇదియొక పెద్దసమస్య. క్రొత్తకంపెనీలకు పెక్కురు ఏజెంట్లు కావలసియుండురు. కాని క్రొత్తకంపెనీలకు సరియైన ఏజెంట్లు దొరకుదురా? ఇతర కంపెనీలతరపున పని చేసి ఏకారణమువలనో దానిని వదులుకొన్నవారు, ఇతర వృత్తులయందు జయమందనివారు, ఏ వ్యాపారము లేని వారు ఇట్టివారే ప్రాయికముగా క్రొత్త భీమాకంపెనీలకు ఏజెంట్లుగ దొరకుదురు. నూత్నవ్యాపారనిర్మాణమునకు అధికమగు అవకాశములు కల్గింపవలసినదనియు, అనేకవిషయములందు సౌకర్యము కల్గింపవలసినదనియు ఆ యేజెంట్లు కోరుటకు వెనుదీయరు. నిరంతరము 'ఎడ్వాన్సుల' కొఱకు వ్రాయుచు నేయుందురు. వారి వారి ఈ కోరికలన్నియు విశేషవ్యాపారము కూర్తుమను నమ్మకరారులతో నిండాతియుండును. వ్యాపారము కంపెనీకి ప్రాణము. కంపెనీకి జనామోదము కల్గింపవలసియున్నది. ఈ భావములు క్రొత్తకంపెనీ యజమానులను ఈ యేజెంట్లకోరికలను మన్నింప ప్రోత్సహించును.

ఫలమేమి? ఎప్పుడో ఒకప్పుడు నిజపరిస్థితులు అవగతముకాక మానవు. అయితే సాధారణముగ ఇట్లు అవగతమగుట కూడదీసికొనుటకు కాలము మీరినతరువాతనే యగుచుండును. ముగింపుకొందని కేసులు, లాప్సులు, ఏజెంట్లబాకీలు, విశేషించిన ప్రారంభపు ఖర్చులు—ఇట్టి అలలమధ్యను ఆ చిన్నపడవ తగులుకొనును. నాశనదేవత నాట్యమాడుచున్నటుల దోచును. నాశనదేవతను నిశ్చయముగా పారద్రోలవచ్చును. అట్లు పారద్రోలుటయే ఇదివఱ కెప్పుడును జరగకుండెనేని నేడు ఇన్ని భీమాకంపెనీలు చక్కని రక్షణలలో, విశేషముగ వ్యాపారములో ఎట్లు విరాజమానమగుచుండును? క్రొత్తకంపెనీకి పనిచేయుచున్న, పనిచేసిన ఏజెంట్లు అందరును నమ్మరానివారే అనిచెప్పుట ఘోరమగు అసత్యమును వాకొనుటయు, క్షమింపరాని కృతఘ్నతాదోషమునకు ఒడికట్టుటయు అగును. గౌరవనీయులును, సమర్థులును అగు ఏజెంట్లు—వారి అసంఖ్యాకవాసము లిప్పుడు అమోఘితములు కాకుండును గాక—నిరంతరము విశేషముగా శ్రమించి అనాదరణ, తిరస్కారము, అవమానము అనువలలకు తట్టుకొని నిలిచి ప్రతిబంధములను ఒత్తిగించుకొని వారివారి కంపెనీలకు అవి నేడు పొందియున్న ప్రతిష్ఠాకరములగు స్థానములను సంపాదించియుండిరి. పాతకంపెనీలు నేడు గర్వములో పేర్కొను వ్యాపారబాహుళ్యమంతయు నా దట్టిఏజెంటు మహాశయులుకూర్చినదే అనుట విన హాయింపులేని సత్యము. ఒకప్పుడు ఏజెంట్లమూలమున ఇట్లు వ్యాపారమువచ్చుట జరిగియున్నది. నేడుమాత్రము ఎందుకు జరుగదు? కావున క్రొత్తకంపెనీలు ఏజెంట్ల నియామకమున భయపడ నవసరములేదు. సరియైనవారి నెంచి వారిని కార్యరంగమునదింపి వారిచే పనిగొనుట యందు మాత్రమే మెలకువ చూపించవలయును.

పూర్వమునకును ఇప్పటికిని పరిస్థితులు చాల వ్యత్యస్థములై ఉన్నమాట నిజమే. కాలముయొక్క మారుదలచే ఇపుడు మఱికొన్ని క్రొత్త అవకాశములు లభించుచున్నచో వానివెంటనే కొన్ని క్రొత్తకష్టములును

కలుగుచున్నది. క్రొత్త వ్యాపారమును కూర్చుటలో చేయుచున్న వ్యయము ఇంకను మితముదప్పి అపాయ స్థితిలో పడలేదనుట నిశ్చయము. ఒక పది సంవత్సరముల పూర్వముకంటె ఇప్పుడు వ్యాపారమును కూర్చుటకు కొంత అధికవ్యయము అగుచుండుచో నేను దానికి భయపడను. అధికవ్యయములు తట్టుకొనుటకు అధికముగు శక్తిసామర్థ్యములు ఉపయోగింపవలసియుండును. అమ్మకము, నిర్వహణము మొదలగు విషయములందు క్రొత్తప్రపంచపు వ్యాపారమున విశేష శక్తిసామర్థ్యముల ఉపయోగము మానవాభ్యుదయమునకైనదేగదా!

క్రొత్త కంపెనీ మేనేజరు సమర్థులగు ఏజెంట్లను చేర్చుకొని వారికి నాయకత్వము వహించి క్రమముగు కార్యకలాపము నిర్వర్తింపవలయును. ఇది అతడు తాను చేయవలసిన పనులలో తొలుతటిదిగ భావింపవలయును. ఈపని కష్టమైనదే. నేను అంగీకరింతును. కాని దుస్సాధ్యమైనది మాత్రముకాదు. నేను చదువుకున్నవారిలో నిర్వ్యాపారత హెచ్చిపోవుచున్నది. కాగా విద్యావంతులు గౌరవనీయులువగు నిర్వ్యాపార యువకులను పలువురిని ఆకర్షించి వారిని భీమాఏజెంటు వృత్తికి సుముఖులనుగా చేసి వారిచే పనిగొని భీమా వ్యాపారమునకు పుష్టిని గూర్చుట విశేష క్రమకరమైన పనిగాదు. మేనేజరు అట్టివారిని తన కూడ పని చేయువారినిగా తలంచి వ్యవహరింపవలయునే కాని వారు తనక్రింద పనిచేయువారినిగా తలంపరాదు. ఒకానొక మహోద్యమమున మనమెల్లరమును హెచ్చు తగ్గులులేని పనివారలము అను భావము కలుగవలయును. కంపెనీకి ఏజెంట్లు చేయుపనియే ప్రధానాధారము. అట్టి మహాకార్యనిర్వహణమున ఏజెంట్లకు మేనేజరు సహాయభూతుడుగా నుండవలయును. నైతికముగు ఔన్నత్యముతో కూడిన శుభచింతనమును, సాంఘికసేవాభిలాషను ఏజెంట్లయందు మేనేజరు కల్గింపవలసియుండును. వారి క్రొత్తవ్యాపారమునందు తగినంత ప్రతిఫలము వారుపొంది వారు సుఖముగా జీవించుటకు అనువు ఏర్పడునట్లును, పాత వ్యాపారమునందు రిన్యూయల్సుమీద ప్రతిఫలమును ఇచ్చునట్లును, వీలగుచో ప్రావిడెంటుఫండు సౌకర్యముకూడ కల్గించుటకును ఏజెంట్ల విషయమున మేనేజరు శ్రద్ధధానుడై యుండవలయును.

ఏజెంట్లను ఎన్నుకొనుటను గూర్చియు ఏర్పాటు చేయుటను గూర్చియు ఒకటి రెండు మాటలు చెప్పవలసిన అవశ్యకము గలదు. ఈవిషయములో ఏ ఒక్క క్రమముగాని ఏఒక్క నిర్ధారణగాని అనుసరించుట కడములేదని కొందరు అందురు. మొదటిలోనే జీతము పద్ధతిని ప్రతిఫలము కోరువారును, తాము ఆర్జింపగల కమీషనుమీద ఇప్పుడే అడ్వాన్సు అడుగువారును అగు ఏజెంట్లకు క్రొత్తకంపెనీ పూర్తిగా దూరముగ నుండవలయును. ఆత్మగౌరవము, ఆత్మవిశ్వాసములేని ఏజెంట్లను క్రొత్తకంపెనీ చేరనీయరాదు. దీక్ష, సామర్థ్యము, తెలివి, స్వశక్తియందు పూర్ణవిశ్వాసముగల ఏజెంట్లను ఏర్చి క్రొత్తకంపెనీ కూర్చుకొనవలయును. అట్టివారు కంపెనీ యొసంగగల కొద్ది సాయముతోడనే మంచి పనిచేయగలరు. అట్టి సుగుణములకు తావలముగు ఏజెంట్లుదొరుకుట చాల కష్టమగుట నే నెఱుంగుదును. కాని కవులవలె ఏజెంట్లుకూడ పుట్టుకచేతనే అగుదురనుమాట విశ్వసింపరానిది. ఏజెంట్లు తరఫీదుచేతను, అనుభవముచేతను ఆదర్శులగుదురు కాని పుట్టుకచేత కారు. ఏజెంటు శక్తిసామర్థ్యముల నెఱిగి దానిని లాభకరముగ ఉపయోగించుకొనుటలోనే క్రొత్తకంపెనీ మేనేజరు ప్రతిభ వెల్లడియగును.

'క్రొత్త భీమాకంపెనీలు: కొన్నిసమస్యలు' అను ఈ వ్యాసమును క్రొత్త భీమాకంపెనీలతరపున వాదించుటకు నేను వ్రాయలేదు అట్టివాదన వానికేమియు అక్కఱలేదనుట నాకు తెలియును. మఱి ఇకవానిని నిరసించుటకును నే నీవ్యాసమును వ్రాయలేదు. క్రొత్తకంపెనీలు బాగుపడి దేశాభ్యుదయమునకు తోడుపడవలయుననియే నే నీవ్యాసము వ్రాసినాను. క్రొత్త కంపెనీలకు నేనిట్లు చెప్పుదును, 'వీరులారా! ముందుసాగు, పరిసరములను పరిశీలింపుడు. పురోగాములుకండు. మిమ్ము జయలక్ష్మి వరించుట ముమ్మాటికి నిశ్చయము.'

—యస్. సి, బెనర్జీ.

# సంపాదకీయ సమాలోచన

## 'కళానిధి'కి సుస్వాగతము

'కళానిధి' అను నూతన మాసపత్రికకు మా మనఃపూర్వకమగు సుస్వాగతమును చేయుచున్నాము. ఇది ప్రత్యేకము కథల కోసమే ఉద్భవించిన పత్రిక. ఏ వాఙ్మయమునకాని కథాపాఠకులు విస్తరించియుందురు. అసలు మానవుడు కథాప్రియుడనుట ప్రత్యేకించి చెప్పనవసరము లేనిది. కావున ఈ కథల మాసపత్రిక తెనుగునాట ఇతర పత్రికలకంటె విశేషప్రచారము నందగలదు. శ్రీ కొడవటిగంటి కృష్ణమూర్తిగారు కళానిధి సంపాదకులు. వీరు లోగడ గృహలక్ష్మిలో ప్రచురించిన కథావ్యాసములు అద్భుతములుగాను అపూర్వములుగాను ఉన్నవి. సమర్థుడగు కథారచయిత స్వానుదారుడుగ నుండుట ఏ కథల పత్రికకైనను భావిశుభమును సూచించును. వీరిసోదరులగు శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారు ఆంధ్రభూమి పాఠకులకు చిరపరిచితులు. ఈ పంక్తులను వ్రాయుచున్నయతడు 'గృహలక్ష్మి' సంపాదకుడుగనున్నప్పుడు ఆ పత్రికకును, తరువాత నాతడు స్వతంత్రముగ స్థాపించిన ఈ ఆంధ్రభూమి పత్రికకును కుటుంబరావుగారు పలుకథలు రచియించియున్నారు. నేడు ఆంధ్రభూమికి ఏమైన ప్రతిష్ఠయున్నచో దానికి ప్రధానకారకులలో వారొకరనుట మఱువరానిది. తెనుగున వీరి కథలతో దొరయు సాటి కథలు ఇంతవఱకు మఱి లేవని చెప్పవచ్చును. ఆ కథలను పఠించినవారికి మా ఈ వాక్యమునందలి సత్యము తేటతెల్లమగును. అట్టికథకచక్రవర్తులు కళానిధి ప్రచురణమున సోదరునకు బాసటగా నున్నారు. పత్రిక భావిశుభమునకు ఇది మఱియొకసూచన. ప్రచురణమున ప్రత్యేకత— ప్రచురించువారు సమర్థులు. వారి ఉద్దేశములును ఉత్కృష్టములై ఉన్నవి. కళానిధి వ్యాసకారులను సత్కరింపకుండ వారి రచనములను గైకొనదు. తెనుగున ధనవంతులు నడుపు పత్రికలే ఈ పద్ధతి నింతవఱకు పూర్తిగ నవలంబింపలేదు. కొన్నిచోట్ల మొగమోటముగలవారికి, సంపాదకుని స్నేహితులకు మాత్రము డబ్బు ముట్టుచున్నది. మఱియొక సచిత్రమాసపత్రిక సంపాదకుడు పత్రికమీద లాభముతీయుచున్నను రచయితలకు కానీయైన రాల్చడు. ఇట్టిస్థితిలో కళానిధి ఇట్టి ఉన్నతాదర్శమును పెట్టుకొనుట తెనుగుజర్నలిజమున కొక నైతికాదర్శమును చూపుటయే. వీరి ఈ ఆదర్శము విజయవంతమగునటుల భగవానుడనుగ్రహించును గాక! కళానిధి తొలిసంచిక గతమాసమున వెలువడినది. ఇందలి కథలుమూడు. కొడవటిగంటి కుటుంబరావుగారి నిలవనీరు, గుడిపాటి వెంకటచలంగారి చుక్కమ్మ, కొడవటిగంటి కృష్ణమూర్తిగారి అదృష్టవంతుడు అనునవి. ఈ పత్రికాసంపాదకుడు ఉచితజ్ఞుడగుటచే తనకథను తుదిని ముద్రించుకొన్నాడు. ఇది ఆ సంపాదకుని వినమ్రభావమును, ఇతరులను గౌరవించి తాను గౌరవము పొందవలయునను ఆతని పవిత్రమైన ఉద్దేశమును వెల్లడిం

చుచున్నది. నేటి తెనుగుపత్రికాసంపాదకులలో కొంద ఱీవిషయమును ముఖ్యముగ గమనింపవలసియున్నది. విస్తరభీతిని కథలను ప్రత్యేకించి పరామర్శింపలేకపోవుచున్నాము. కథకులు మువ్వురును కథారచనమున సిద్ధహస్తులగుట వాని ప్రత్యేకతను వివరింప నవసరములేదని తలంచుచున్నాము. క్రౌనుసైజున గ్లేజుకాగితములమీద సుందరముగ ముద్రింపబడి చిత్రపటములతో పత్రిక ఆకర్షణీయముగ నున్నది, సాలుచందా మూడురూపాయలు; విడిసంచిక నాలుగు అణాలు. గ్రంథాలయాలకుగాని క్లబ్బులకుగాని సంవత్సరచందా ఆరురూపాయలు. తెనుగు జర్నలిజముచరిత్రలో కళానిధి ఒక నూతనాధ్యాయ ప్రారంభమునకు త్రోవ చూపునను దృఢవిశ్వాసముతో నున్నాము. చిరునామా: కళానిధి కార్యాలయము, తెనాలి, గుంటూరుజిల్లా.

## తెనుగువారి నార్తుక్లిఫ్

ఈ సంచికలో ప్రచురించబడిన లార్డు నార్తుక్లిఫ్ చరిత్ర కొన్నివిషయములలో దేశోద్ధారక నాగేశ్వరరావుపంతులుగారి చరిత్రకు జతపడుచున్నది. నార్తుక్లిఫ్ పెద్దలు ఆతడు న్యాయవాదికావలయునని ఆశించిరి. కాని ఆతడు పత్రికాసంపాదకుడైనాడు. శ్రీ నాగేశ్వరరావుగారి విషయమునకూడ వారి పెద్దలు వారు న్యాయవాదులగుటను ఆశించిరి. కాని వారు పత్రికాసంపాదకులైరి. నార్తుక్లిఫును, నాగేశ్వరరావుగారును తమ తమ పత్రికాప్రచురణప్రారంభము వారపత్రికలతోడనే గావించిరి. ప్రపంచావృతమగు ఆంగ్లభాషనగుట నార్తుక్లిఫ్ పత్రికలు శతాధికమైనవి. రెండుకోట్ల జనులుగల ఆంధ్రభాషనగుట నాగేశ్వరరావుగారి పత్రికలు ఒక దినపత్రిక, ఒక వారపత్రిక, ఒకమాసపత్రికమాత్ర మయినవి. తెనుగునమఱి యేఒక వ్యక్తియు ఇట్లు మూడుపత్రికల ప్రచురణభారమును వహించియుండలేదు. అగుట వారు తెనుగువారి నార్తుక్లిఫ్ అనబడుటకెంతయు తగియున్నారు. వారి ఆంధ్రపత్రిక ఇకముందు సచిత్ర వారపత్రికగ పెంపుపొందింపబడనున్నదనివినుట కెంతయు ఆనందము కలుగుచున్నది. ఆంగ్లేయులు నార్తుక్లిఫును పలురీతుల గౌరవించినట్లే ఆంధ్రులు తమ నార్తుక్లిఫ్అయిన నాగేశ్వరరావుగారిని విశ్వదాత, దేశోద్ధారకాది బిరుదములతోడను, భారత శాసనసభకు ఎన్నుకొనుటచేతను గౌరవించుచున్నారు.

## డాక్టర్ శ్రీ జమ్మి వెంకటరమణయ్యగారికి ఆంధ్రభూమి కృతజ్ఞత

'ఆంధ్రభూమి' ప్రారంభింపబడినప్పటినుండియు దీని అభివృద్ధినిగూర్చి విశేషముగ శ్రద్ధను, అభిమానమును చూపుచున్న ఆంధ్రమహాశయులలో డాక్టర్ శ్రీ జమ్మి వెంకటరమణయ్యగారు తొలుత పేర్కొనదగినవారు. వారిపోషణము ఆంధ్రభూమికి నిరంతగము కార్యోత్సాహమును ప్రసాదించుచున్నది. వారు ఎల్లవేళల ఈ పత్రికను తమపత్రికగ భావించుచు తమ కలకత్తా బ్రాంచిద్వారా ముప్పదిమంది ఏడాది చందాదారులను కూడ చేర్పించియున్నారు. ఇన్నివిధముల వారికి ఆంధ్రభూమి ఋణపడియున్నది. మదరాసున డాక్టరుగారి వ్యాపారవిజయము ఆంధ్రవిజయమున కొకనిదర్శనమగును. శ్రీ డాక్టరు జమ్మి వేంకటరమణయ్యగారికి ఇతోధిక వ్యాపారవిజయమును, నిరంతరశుభమును ప్రసాదింప భగవానుని ప్రార్థించుచున్నాము.




### జనవరి, ౧౯౩౫.

౨౪:—బొంబాయి. 1934-వ సంవత్సరపు జూలై నెల 14-వ తేదిని ప్రచురింపబడిన కృష్ణాపత్రిక కాపీల నన్నిటిని బొంబాయి ప్రభుత్వము వశపఱచు కొన్నది.

౨౬:—రంగూను బర్మారాష్ట్రీయాంధ్ర మహాసభ. జి. టి. శాస్త్రిగారు ఆహ్వానసంఘాధ్యక్షులు; శ్యామసుందరరావుగారు ప్రారంభకులు, పరిమి సోమరాజుగారు అధ్యక్షులు.

౨౭:—కడప. విమానాశ్రయస్థానమునకు స్థలము సంపాదింపబడుట.

౨౯:—కార్వేటినగరము. కడపమండలములోని మట్ల సంస్థానాధీశుల వంశజులగు మట్ల అనంతరాజు గారు మరణించిరి.

:—నైజామురియలాకా ఖమ్మంమెట్టు తాలూకా నేలకొండపల్లి కాపురస్థులు, మంత్రవాస్తు శాస్త్రవేత్తలు గండికోట మంత్రాల అప్పయ్యగారి మరణము.

:—మదరాసు. డాక్టరు మల్లయ్యగారి మరణము.

౩౦:—బందరు. ఆంధ్రజాతి అను సూక్ష్మవారపత్రిక తొలిసంచిక వెలువడెను.

### ఫిబ్రవరి. ౧౯౩౫.

౨:—మదరాసు. ధార్మికురాలు పబ్బిశెట్టి అలిమేలు మంగతాయారమ్మగారి మరణము.

౪:—విజయనగరం. మహారాజాకళాశాల ప్రిన్సిపాలు కాళ్ళకూరి జానకిరావుగారి నిర్యాణము.

౮:—కాకినాడ. గోదావరి ఛాంబర్ ఆఫ్ కామర్సు వారిసమావేశము.

౯:—మదరాసు. శ్రీకస్తూరి లక్ష్మీనరసింహారావు గారు యూరపుపోవు స్టీమరెక్కుటకు బొంబాయి వెళ్ళిరి.

౧౧:—ఆంధ్రక్రైస్తవులగు పి. భక్తవత్సలు గారు ఎం.ఎ.బి.ఎస్.సి. ఇండియా ప్రభుత్వపు సీనియరుమార్కెటింగు ఆఫీసరుగ నియమింపబడిరి.

౧౩:—కాకినాడ.పి.ఆర్. కాలేజిఅర్ధశతాబ్దోత్సవము.

౧౪:—గుంటూరు. ఆంధ్రరాష్ట్రీయస్వదేశిపారిశ్రామిక ప్రదర్శనము.

౧౫:—గుంటూరు. 40-వ మండలరాజకీయసభ.

౧౬:—సేలం. దేశసేవకులు మద్దూరి అన్నపూర్ణయ్య గారు జయిలునుండి విడుదలనొందిరి.

౧౯:—మదరాసు. పచ్చయప్పకళాశాలలో మానవల్లి రామకృష్ణకవి ఎం.ఏ. గారు 'రసస్వరూపము' నుగూర్చి ఉపన్యసించిరి.

౨౦:—మదరాసుశాసనసభ. పంచాయతీ జిల్లాబోర్డుల ఎన్నికలలో తిరిగి మార్పులు గావింప సవరణ చట్టము.

### ప్లాన్ పజిల్

ప్లాన్‌పజిల్ సమాధానములు, బహుమానముపొందిన వారినామములు ఈసంచికయందు ప్రచురింపవలసియున్నది. గతమాసపు సంచికలు ఏజెంట్లద్వారా పొందు వారికి సకాలమునకే చేరినను పోస్టుద్వారాపొందు వారికి చాల ఆలస్యముగ చేరినవి. క్రొత్తసంవత్సరమునకు పోస్టల్‌కన్సెషన్ వచ్చుటలోనైన ఆలస్యము కారణముగ జనవరి 25-వ తేదీని పోస్టు చేయవలసిన సంచికలు ఫిబ్రవరి 8-వ తేదీని పోస్టు చేయబడినవి. రంగూను, మొల్మేను ప్రాంతములందలి చందాదారులకు ఫిబ్రవరి 20-వ తేదిలోపున సమాధానమిచ్చుటకు సావకాశముండదు కావున గడువుకాలము మార్చి 20-వ తేదివఱకు పొడిగించబడినది. ఈ కారణమున సమాధానములను, బహుమానార్హుల నామములను ఏప్రిల్ సంచికలో ప్రచురింపబడునని మనవి.

# సువర్ణసుందరరసము
## సర్వసవామేహములకు సంజీవివంటిది

ఎటువంటి సవామేహములనైన కుదుర్చును. ఇంజక్షనులు అవసరము లేదు. అనేకులు వాడి మెచ్చి యున్నారు. 60 ఏండ్లు వైద్యమున అనుభవము గల కీ. శే. వేటూరి సుందరశాస్త్రి గారిచే కనిపెట్టబడినది. వాడువిధము మందుతో పంపబడును.

వెల: 50 మాత్రలు: రు. 5-0-0.

# ఆర్షరసాయనశాల, ముక్త్యాల

## అభ్రకభస్మము.

—: అమృతమువంటిది :—

బహుమూత్రమును, క్షయను, దగ్గును పోగొట్టి వీర్యవృద్ధిని గలిగించును. మూత్రమునందుండు చక్కెరను మాయము చేయును.

ప్రశస్తమైన రసాయనము. వెల: తులము 1 కి: రు. 5-0-0.

కన్సల్టింగ్ ఫిజీషియన్ :—

ఆయుర్వేదభూషణ వేటూరి శంకరశాస్త్రిగారు, ఎ.ఎం.ఎ.సి.

## ఐరావతి

లక్షా అరువదివేల బర్మా ఆంధ్రుల క్షేమాభివృద్ధులకు ప్రతిశనివారము వెలువడు ప్రజాహితపత్రిక. 7 సంవత్సరములనుండి బర్మా ఆంధ్రుల క్షేమాభివృద్ధికై పాటుపడుచున్నది. ఇది ఆంధ్రులకు అండ. కార్మికులకు పట్టుగొమ్మ. యువజనోద్యమమునకు ఉనికి. నిర్మోహమాటముల నిప్పు. అన్యాయముల నంతరింప జేయుటకు బ్రహ్మాస్త్రము. అంతర్యమెరింగినవారికి హాయి చదివినవారికి వి.తాయి.

సంవత్సరపు చందా రూ 3-0-0. తపాలాఖర్చులతో 3-12-0.

చిరునామా :

ఐరావతి పత్రికా కార్యాలయము, 233 బార్ స్ట్రీట్, రంగూను.

## కరుణగీతము [ఉచితముగా పంపబడును]

చెలాడబడిన లేడి వేటరికి తన పరివేదనము పాటలలో చెప్పుకొనుట ఇందు వివరింపబడినది. గుండెను కరిగించు ఘట్టము. చదివితీరవలసినదే. అంచెకూలికై యొకయణా తపాలాబిళ్ళపంపిన యొక్కొక్కరికి 'కరుణగీత' యొక్కొక్కప్రతి పంపబడును. త్వరపడుడు. విలాసము : విజ్ఞానవల్లిక, అనంతపురము.

## రామనామం [ఉచితముగా పంపబడును.]

కవితాసమితి సభ్యులును, వ్యాకరణ వాధురీణులును అగు శ్రీ ముద్దా విశ్వనాథముగారు రచించినది. భక్తులు తప్పక చదువవలసిన గ్రంథము. జేబునందిముడు చిన్నసైజున మంచి కాగితములపై అందముగ అచ్చొత్తింపబడినది. తపాలాఖర్చులకు ఒకఅణా తపాలాబిళ్ళ పంపువారికెల్లరకును ఈ గ్రంథము ఉచితముగా పంపబడును.

విలాసము : వ్యాసకుటీరము, మేలుపాక, వయా ఎలమంచిలి, విశాఖపట్టణముజిల్లా.

### —: ఆంధ్రుల పనితనము :—

మీ ప్రింటింగు పలువుర నాకర్షించవలెనంటే — ఈ కాలములో విధిగా బొమ్మలు — బ్లాకులు ఉండితీరవలెను. నష్టపడకముందే మీరు మేలుకొనండి! ఆంధ్రదేశీయులగు అందరు పత్రికాధిపతులు, గ్రంథప్రకాశకులు కూడ చేతి డ్రాయింగు డిజయినులు, యంగ్రేవడు, హాఫ్‌టోను బ్లాకులు వగైరాలకు మాకు ఆర్డరులిచ్చి త్వరగా చౌకగా — చక్కగా — మా పనితనమందుకొనండి — మీ కథలలో బొమ్మలు — మీ అడ్వరుటైజుమెంట్లలో బ్లాకులు — చరిత్రలలో మ్యాపులు — మరి ఫోటోబ్లాకులు — సీనరీబ్లాకులు — ఇట్టి అన్నిటికి మాకే వ్రాయండి — ఇది అనుభజ్ఞులగు పనివారలున్న ఆంధ్రసంస్థ — ఆంధ్రాభిమానము మఱువకండి! మాదిరిపని ఇచ్చిచూడండి!

పూర్ణా అండుకో — 6 చంద్రభానువీధి, మవుంటురోడ్డు పోస్టు, మదరాసు.

## రత్నపురుషలేహ్యాం


పలుచబడిన వీర్యమును గట్టిపఱచి అమితముగా వీర్యవృద్ధి కలిగించు మూలికలకు రాజు అనదగిన 'రత్నపురుష' ప్రధానద్రవ్యముగా చేయబడిన ఈ లేహ్యమును క్రమముగా సేవించువారు కాయపుష్టి, కండపుష్టినొంది బలారోగ్యములను పొందుదురు. డబ్బీ రూ. 3-0-0

చరకనిలయము, ఆయుర్వేదౌషధశాల, రాజమండ్రి.




అగస్త్యుడు - లోపాముద్ర

ఆంధ్రసాహిత్య పరిషత్తు
కాకినాడ
TELUGU ACADEMY, COCANADA



పక్షితీర్థము



యీ ట్రేడుమార్కును చూచిన మోసపోరు.

# అత్యాశ్చర్య కుష్ఠురోగ నిర్మూలిని

(రిజిష్టర్డు.)

గుణములేదని ఋజువుచేయువారికి రు 1000 లు బహుమానము 18 రకముల కుష్ఠులు, బొల్లి, సుఖరోగములు యేస్థితిలో యెంతకాలము నుండి జీర్ణించియున్నను గ్యారంటీగా బాగుచేయుదుము. మృత్యు ముఖమునుండి అనేకవేల రోగులు రక్షింపబడిరి. యింజక్షనువలన ఫలితముగానని రోగులు మామందువలన పూర్ణారోగ్యమును పొందిరి. పూర్తి వివరములకు అన్ని భాషలలోను దొరకు మా కేట్లాగులకు యీ దిగువ యడ్రసుకు వ్రాయుడు.

లక్ష్మీ అండ్ కంపెనీ (రిజిష్టర్డు.)
కుష్ఠు అండ్ సుఖరోగ చికిత్సా నిపుణులు,
అల్లిపురం మెయిన్‌రోడ్డు, వాల్తేరు ఆర్. యస్. పోస్టు.



# నిజాము రాష్ట్రమునకు

ఆంధ్రభూమికి ఈ క్రిందివారిని ఛీఫ్ ఏజెంటులుగ నియమించినాము. బ్రిటీషు పోస్టలు సౌకర్యములులేక ఆంధ్రభూమికి చందాకట్టుటలో ఇబ్బందిపడుచున్న నిజాము రాష్ట్రాంధ్రులు ఇకమీదట తమతమ చందాధనమును వారికి పంపుచు ఆవిషయమును ప్రత్యేకముగ మా కార్యాలయమునకుగూడ తెలుపుచుండగలరు. శికిందరాబాదు, హైదరాబాదు వాస్తవ్యులు మాసము మాసము విడిసంచికలు వీరికడ కొనుక్కొననగును.

ఛీఫ్ ఏజెంటు నామము, చిరునామా :

శ్రీయుత కాలేరు వెంటయ్యగారు, 4121 మూసాఖాన్ వీధి, శికిందరాబాదు.



# ఆంధ్రభూమి ట్రావెలింగు యేజెంటు

శ్రీయుత నేతి కామేశ్వరశాస్త్రిగారిని ఆంధ్రభూమికి ట్రావెలింగు యేజెంటుగ నియమించినారము. కావున ఆంధ్రభూమి అభిమానులు వారికి చందాలనిచ్చి తగుమైన రసీదు పొందనగునని తెలియజేయుచున్నాము. యిట్లు ఆంధ్రభూమి మేనేజరు.



**కామశాస్త్రము** ఇది వాత్స్యాయనమహర్షి సంస్కృత భాషలో వ్రాసిన సూత్రములకు చక్కని తేటతెల్లమగు తెలుగుసేత. రైలులో అమ్ము పుస్తకాలవంటిదికాదు. సరియైన శాస్త్రగ్రంథము. మనపూర్వులు 'కామ'మను మూడవ పురుషార్థమునకిచ్చిన ప్రాముఖ్యము, ప్రాభవము ఇది చదివినచో తెల్లమగును. అల్లరి చిల్లరి వ్రాతలు కావు. ఆదిలో వ్రాసినవారు పూజ్యులగు మహర్షులు కాబట్టి దీని గొప్పతనము సరసులగు చదువరులు గ్రహింతురుగాక. వెల, ఒక్కరూపాయ.

కొత్త సత్యనారాయణచౌదరి, పండిట్, బోర్డు హైస్కూల్, నిడుబ్రోలు, గుంటూరుజిల్లా.

## కలలరాక నిద్రాభంగము కాకుండుటకే

సాధారణముగ కలలువచ్చుటచే తమకు కలతనిద్ర అయినదని జను లనుచుండుట పలువురకు అనుభవపూర్వకమైన విషయము. ఆక్స్‌ఫర్డు విశ్వవిద్యాలయమున మానసికతత్వశాస్త్రవేత్తగనున్న డాక్టరు విలియమ్‌బ్రౌన్ అనునతడు చెప్పునది దీనికి విరుద్ధముగానున్నది. ఈ విషయమై అత డేమి చెప్పుచున్నాడో చూడుడు: 'నేను చేసిన పరిశోధనలవలన నిద్రామధ్యమున మనము లేచి పోకుండుటకే మనకు కలలువచ్చునని నిర్ధారణ చేయగలుగుచున్నాను. కలలురానిచో సాధారణముగ మనకు రాత్రిఅంతయు గాఢనిద్ర ఉండదని చెప్పవలసియున్నది. మనకు వచ్చు ప్రతిస్వప్నమును ఒకవాంఛను తప్పక నెఱవేర్చుటకే మనకు కలుగుచున్నదని చెప్పవచ్చును. అయితే స్వప్నముతీర్చు వాంఛఎట్టిది? గాఢముగ నిద్రపోవలయునను వాంఛ. కలలు గాంచుచుండుటచేతనే నిద్రపోవుచున్నవాడు కలతలేని నిద్రపోగలుగుచున్నాడు. నే నీ దిగువను చెప్పపోవు విషయము పలువురకు అనుభవములోనిదే అయిఉండునని నా నమ్మకము. మనము నిద్రపోవుచుండగా మనకు ఒక్కొక్కప్పుడు దాహము వేయును. అయితే మన మప్పుడు మేల్కాంచము. స్వప్నములో మనము చెంబులకొలది నీరు త్రాగినట్లు అగును. దానితో మన దాహముతీరినట్లేఅయి ఎట్టి భంగములేక మనము నిద్రాముద్రితులమగుదుము. కలలవిషయమున నేను కావించిన పరిశోధనావసరమున నడచిన ఒక చమత్కారవృత్తాంతమును మీకు చెప్పుటకు నేను ముచ్చటపడుచున్నాను. ఒకడు నిద్రపోవుచున్నాడు. వేడినీళ్ళతో నింపబడిన సీసాకాయను ఒకదానిని అతని పాదములచెంత తగులునట్లు ఉంచితిమి. ప్రపంచప్రఖ్యాతివహించిన వెసూవియస్ అగ్నిపర్వతముచెంత తాను నడుచుచున్నట్లును వేడిలావా తొక్కుచున్నట్లును అతనికి స్వప్నమువచ్చినదట. తరువాత మాతో చెప్పినాడు. వేడినీళ్ళసీసా పాదములకు తాకించినను అతడు కదలకుండుటనుచూచి మేము ఒక నీటిచుక్కను అతనిమొగముపై వైచితిమి. దీనికిని అతడు కదలలేదు. తరువాత అతడు చెప్పినదాని వలన అప్పు డాతనికి ఆ వెసూవియస్ పర్వతమును ఎక్కుచుండుటచే ముచ్చెమటలు క్రమ్మినట్లును తాను సారా త్రాగుచుండినట్లును స్వప్నమువచ్చినట్లు తెలిసినది. అతనిని ఎటులైన లేపుటకు మఱ్ఱుకొనకొల్పితిమి. కాని విచిత్రమేమన దీనికిని అతడు కదలలేదు. ఈసారి అతనికి తన మొగముమీద ఎవరో ముసుగువేసి తీసివేసినట్లు స్వప్నమువచ్చినదట. ఇట్టికథలు అనేకము నా పరిశోధనలచే నే నెఱింగినవి చెప్పగలను. కావున స్వప్నములువచ్చుట మనకు నిద్రాభంగము కాకుండుటకే అని నేను చేయెత్తిచెప్పుచున్నాను. ఈ సిద్ధాంతమును మనసున ఉంచుకొని ఈసారి వారువారు వారివారికి రాత్రులయందు కలుగు స్వప్నములు తమనిద్రకు ఎట్లు సాయపడినవో తెలిసికొనుచుండగలరని ఆశించుచున్నాను.'

—ఆల్ ఎబవుట్ డ్రీమ్సు.

## పై మానపు సంచికలో

ప్రచురింపబడు వ్యాసములలో కొన్ని

౧. శబరి (వచన గద్యవ్యాసము)

—శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు

౨. మందుపుచ్చుకొన్న తప్పు (కథ)

—పమ్మి రామశాస్త్రిగారు

౩. అడ్డాల్లో బిడ్డలు (కథ)

—కడియాల కామేశ్వరరావుగారు

౪. కీటకములు : మానవుడు (విజ్ఞానవ్యాసము)

—జాగు గోపాలరావుగారు

౫. పిశాచం : రొట్టె (కథ)

—తల్లాప్రగడ ప్రకాశరాయుడు.

## కేలండర్ల స్వీకారము

బెజవాడయందలి ఆంధ్రప్రావిడెంటుకంపెనీవారును, నెల్లూరుజిల్లా పెరిదేపియందలి ఆయుర్వేదసమాజమువారును పంపిన 1935-వ సంవత్సరపు కేలండర్లు వందనపూర్వకముగ నందుకొంటిమని మనవి.

# ఇన్స్యూరెన్సు విషయములు

## క్రొత్త భీమాకంపెనీలు: యేజెంట్లు

[గతసంచిక తరువాయి]

భీమావ్యాపారము ఏజెంట్లమూలమున సమకూడును. ఇదియొక పెద్దసమస్య. క్రొత్తకంపెనీలకు పెక్కురు ఏజెంట్లు కావలసియుందురు. కాని క్రొత్తకంపెనీలకు సరియైన ఏజెంట్లు దొరకుదురా? ఇతర కంపెనీలతరఫున పనిచేసి ఏకారణముననో దానిని వదులుకొన్నవారు, ఇతర వృత్తులయందు జయమందనివారు, ఏ వ్యాపారము లేనివారు ఇట్టివారే ప్రాయకముగా క్రొత్త భీమాకంపెనీలకు ఏజెంట్లుగ దొరకుదురు. నూత్నవ్యాపారనిర్మాణమునకు అధికమగు అవకాశములు కల్గింపవలసినదనియు, అనేకవిషయములందు సౌకర్యము కల్గింపవలసినదనియు ఆ యేజెంట్లు కోరుటకు విసుగునొందరు. నిరంతరము 'ఎడ్వాన్సుల' కొఱకు వ్రాయుచునేయుందురు. వారివారి ఈ కోరికలన్నియు విశేషవ్యాపారము కూర్తుమను నమ్మకరారులతో నిండారియుండును. వ్యాపారము కంపెనీకి ప్రాణము. కంపెనీకి జనామోదము కల్గింపవలసియున్నది. ఈ భావములు క్రొత్తకంపెనీ యజమానులను ఈ యేజెంట్లకోరికలను మన్నింప ప్రోత్సహించును.

ఫలమేమి? ఎప్పుడో ఒకప్పుడు నిజపరిస్థితులు అవగతముకాక మానవు. అయితే సాధారణముగ ఇట్లు అవగతమగుట కూడదీసికొనుటకు కాలము మీరినతరువాతనే యగుచుండును. ముగింపునొందని కేసులు, లాప్సులు, ఏజెంట్లబాకీలు, విశేషించిన ప్రారంభపు ఖర్చులు—ఇట్టి అలలమధ్యను ఆ చిన్నపడవ తగులుకొనును. నాశనదేవత నాట్యమాడుచున్నటుల దోచును.

నాశనదేవతను నిశ్చయముగా పారదోలవచ్చును. అట్లు పారదోలుటయే ఇదివరకెప్పుడును జరగకుండెనేని నేడు ఇన్ని భీమాకంపెనీలు చక్కని రక్షణలతో, విశేషమగు వ్యాపారముతో ఎట్లు విరాజమానమగుచుండును? క్రొత్తకంపెనీకి పనిచేయుచున్న, పనిచేసిన ఏజెంట్లు అందరును నమ్మరానివారే అనిచెప్పుట ఘోరమగు అసత్యమును వాకొనుటయు, క్షమింపరాని కృతఘ్నతాదోషమునకు ఒడికట్టుటయు అగును. గౌరవనీయులును, సమర్థులును అగు ఏజెంట్లు—వారి అసంఖ్యాకనామము లిప్పుడు ఆమ్రేడితములు కాకుండును గాక—నిరంతరము విశేషముగా శ్రమించి అనాదరణ, తిరస్కారము, అవమానము అనుచలులకు తట్టుకొని నిలిచి ప్రతిబంధములను ఒత్తిగించుకొని వారివారి కంపెనీలకు అవి నేడుపొందియున్న ప్రతిష్ఠాకరములగు స్థానములను సంపాదించియుండిరి. పాతకంపెనీలు నేడు గర్వముతో పేర్కొను వ్యాపారబాహుళ్యమంతయు నా డట్టి ఏజెంటు మహాశయులుకూర్చినదే అనుట వినహాయింపులేని సత్యము. ఒకప్పుడు ఏజెంట్లమూలమున ఇట్లు వ్యాపారమువచ్చుట జరిగియున్నది. నేడుమాత్రము ఎందుకు జరుగదు? కావున క్రొత్తకంపెనీలు ఏజెంట్ల నియామకమున భయపడ నవసరములేదు. సరియైనవారి నెంచి వారిని కార్యరంగమునదింపి వారిచే పనిగొనుట యందు మాత్రమే మెలకువ చూపించవలయును.

పూర్వమునకును ఇప్పటికిని పరిస్థితులు చాల వ్యత్యస్థములై ఉన్నమాట నిజమే. కాలముయొక్క మారుదలచే ఇపుడు మఱికొన్ని క్రొత్త అవకాశములు లభించుచున్నచో వానివెంటనే కొన్ని క్రొత్తకష్టములును

కలుగుచున్నవి. క్రొత్త వ్యాపారమును కూర్చుటలో నేడగుచున్న వ్యయము ఇంకను మితముదప్పి అపాయ స్థితిలో పడలేదనుట నిశ్చయము. ఒక పది సంవత్సరముల పూర్వముకంటె ఇప్పుడు వ్యాపారమును కూర్చుటకు కొంత అధికవ్యయము అగుచుండుచో నేను దానికి భయపడను. అధికవ్యయములు తప్పుకొనుటకు అధికమగు శక్తిసామర్థ్యములు ఉపయోగింపవలసియుండును. అమ్మకము, నిర్వహణము మొదలగు విషయములందు క్రొత్తప్రపంచపు వ్యాపారమున విశేష శక్తిసామర్థ్యముల ఉపయోగము మానవాభ్యుదయమునకైనదేగదా!

క్రొత్త కంపెనీ మేనేజరు సమర్థులగు ఏజెంట్లను చేర్చుకొని వారికి నాయకత్వము వహించి క్రమమగు కార్యకలాపము నిర్వర్తింపవలయును. ఇది ఆతడు తాను చేయవలసిన పనులలో తొలుతటిదిగ భావింపవలయును. ఈపని కష్టమైనదే. నేను అంగీకరింతును. కాని దుస్సాధ్యమైనది మాత్రముకాదు. నేను చదువుకున్నవారిలో నిర్వ్యాపారత హెచ్చిపోవుచున్నది. కాగా విద్యావంతులు గౌరవనీయులునగు నిర్వ్యాపార యువకులను పలువురిని ఆకర్షించి వారిని భీమాఏజెంటు వృత్తికి సుముఖులనుగా చేసి వారిచే పనిగొని భీమా వ్యాపారమునకు పుష్టిని గూర్చుట విశేష శ్రమకరమైన పనిగాదు. మేనేజరు అట్టివారిని తన కూడ పనిచేయు వారినిగా తలంచి, వ్యవహరింపవలయునే కాని వారు తనక్రింద పనిచేయువారినిగా తలంపరాదు. ఒకానొక మహోద్యమమున మనమెల్లరమును హెచ్చుతగ్గులులేని పనివారలము అను భావము కలుగవలయును. కంపెనీకి ఏజెంట్లు చేయుపనియే ప్రధానాధారము. అట్టి మహాకార్యనిర్వహణమున ఏజెంట్లకు మేనేజరు సహాయభూతుడుగా నుండవలయును. నైతికమగు ఔన్నత్యముతో కూడిన శుభచింతనమును, సాంఘికసేవాభిలాషను ఏజెంట్లయందు మేనేజరు కల్గింపవలసియుండును. వారి క్రొత్తవ్యాపారమునందు తగినంత ప్రతిఫలము వారుపొంది వారు సుఖముగా జీవించుటకు అనువు ఏర్పడునట్లును, పాత వ్యాపారమునందు రిన్యూయల్సుమీద ప్రతిఫలమును ఇచ్చునట్లును, వీలగుచో ప్రావిడెంటుఫండు సౌకర్యముకూడ కల్గించుటకును ఏజెంట్ల విషయమున మేనేజరు శ్రద్ధధానుడై యుండవలయును.

ఏజెంట్లను ఎన్నుకొనుటను గూర్చియు ఏర్పాటు చేయుటను గూర్చియు ఒకటి రెండు మాటలు చెప్పవలసిన ఆవశ్యకముగలదు. ఈవిషయములో ఏ ఒక్క క్రమముగాని ఏఒక్క నిర్ధారణగాని అనుసరించుట కెడములేదని కొందరు అందురు. మొదటిలోనే జీతము పద్ధతిని ప్రతిఫలము కోరువారును, తాము ఆర్జింపగల కమీషనుమీద ఇప్పుడే అడ్వాన్సు అడుగువారును అగు ఏజెంట్లకు క్రొత్తకంపెనీ పూర్తిగా దూరముననుండవలయును. ఆత్మగౌరవము, ఆత్మవిశ్వాసములేని ఏజెంట్లను క్రొత్తకంపెనీ చేరనీయరాదు. దీక్ష, సామర్థ్యము, తెలివి, స్వశక్తియందు పూర్ణవిశ్వాసముగల ఏజెంట్లను ఏర్చి క్రొత్తకంపెనీ కూర్చుకొనవలయును. అట్టివారు కంపెనీ యొసంగగల కొద్ది సాయముతోడనే మంచి పనిచేయగలరు. అట్టి సుగుణములను తావలమగు ఏజెంట్లుదొరుకుట చాల కష్టమగుట నే నెఱుంగుదును. కాని కవులవలె ఏజెంట్లుకూడ పుట్టుకచేతనే అగుదురనుమాట విశ్వసింపరానిది. ఏజెంట్లు తరిఫీయతుచేతను, అనుభవముచేతను ఆదర్శులగుదురు కాని పుట్టుకచేత కారు. ఏజెంటు శక్తిసామర్థ్యముల నెఱిగి దానిని లాభకరముగ ఉపయోగించుకొనుటలోనే క్రొత్తకంపెనీ మేనేజరు ప్రతిభ వెల్లడియగును.

‘క్రొత్త భీమాకంపెనీలు: కొన్నిసమస్యలు’ అను ఈ వ్యాసమును క్రొత్త భీమాకంపెనీలతరఫున వాదించుటకు నేను వ్రాయలేదు అట్టివాదన వానికేమియు అక్కఱలేదనుట నాకు తెలియును. మఱి ఇక వానిని నిరసించుటకును నే నీవ్యాసమును వ్రాయలేదు. క్రొత్తకంపెనీలు బాగుపడి దేశాభ్యుదయమునకు తోడుపడవలయుననియే నే నీవ్యాసము వ్రాసినాను. క్రొత్త కంపెనీలకు నేనిట్లు చెప్పుదును. ‘వీరులారా! హుషార్. పరిసరములను పరికింపుడు. పురోగాములుకండు. మిమ్ము జయలక్ష్మి వరించుట ముమ్మాటికి నిశ్చయము.’

—యస్. సి. బెనర్జీ

# సంపాదకీయ సమాలోచన

## 'కళానిధి'కి సుస్వాగతము

'కళానిధి' అను నూతన మాసపత్రికకు మా మనఃపూర్వకమగు సుస్వాగతమును చేయుచున్నాము. ఇది ప్రత్యేకము కథల కోసమే ఉద్భవించిన పత్రిక. ఏ వాఙ్మయమునకాని కథాపాఠకులు విస్తరించియుందురు. అసలు మానవుడు కథాప్రియుడనుట ప్రత్యేకించి చెప్పనవసరములేనిది కావున ఈ కథల మాసపత్రిక తెనుగునాట ఇతర పత్రికలకంటె విశేషప్రచారము నందగలదు. శ్రీ కొడవటిగంటి కృష్ణమూర్తిగారు కళానిధి సంపాదకులు. వీరు లోగడ గృహలక్ష్మి లో ప్రచురించిన కథావ్యాసములు అద్భుతములుగాను అపూర్వములుగాను ఉన్నవి. సమర్థుడగు కథారచయిత స్వానుదారుడుగ నుండుట ఏ కథల పత్రికకైనను భావిశుభమును సూచించును. వీరిసోదరులగు శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారు ఆంధ్రభూమి పాఠకులకు చిరపరిచితులు. ఈ పంక్తులను వ్రాయుచున్నయతడు 'గృహలక్ష్మి' సంపాదకుడుగనున్నప్పుడు ఆ పత్రికకును, తరువాత నాతడు స్వతంత్రముగ స్థాపించిన ఈ ఆంధ్రభూమి పత్రికకును కుటుంబరావుగారు పలుకథలు రచియించియున్నారు. నేడు ఆంధ్రభూమికి ఏమైన ప్రతిష్ఠయున్నచో దానికి ప్రధానకారకులలో వారొకరనుట మఱువరానిది. తెనుగున వీరి కథలతో ద్రోరయు పాటి కథలు ఇంతవఱకు మఱిలేవని చెప్పవచ్చును. ఆ కథలను పఠించినవారికి మా ఈ వాక్యమునందలి సత్యము తేటతెల్లమగును. అట్టికథకచక్రవర్తులు కళానిధి ప్రచురణమున సోదరునకు బాసటగానున్నారు. పత్రిక భావిశుభమునకు ఇది మఱియొకసూచన ప్రచురణమున ప్రత్యేకత— ప్రచురించువారు సమర్థులు. వారి ఉద్దేశములును ఉత్కృష్టములై ఉన్నవి. కళానిధి వ్యాసకారులను సత్కరింపకుండ వారి రచనములను గైకొనదు. తెనుగున ధనవంతులు నడుపు పత్రికలే ఈ పద్ధతి నింతవఱకు పూర్తిగ నవలంబింపలేదు. కొన్నిచోట్ల మొగమోటముగలవారికి, సంపాదకుని స్నేహితులకు మాత్రము డబ్బు ముట్టుచున్నది. మఱియొక సచిత్రమాసపత్రిక సంపాదకుడు పత్రికమీద లాభముతీయుచున్నను రచయితలకు కానీయైన రాల్పడు ఇట్టస్థితిలో కళానిధి ఇట్టి ఉన్నతాదర్శమును బెట్టుకొనుట తెనుగుజర్నలిజమున కొకనైతికాదర్శమును చూపుటయే. వీరి ఈ ఆదర్శము విజయవంతమగునటుల భగవానుడనుగ్రహించును గాక! కళానిధి తొలిసంచిక గతమాసమున వెలువడినది. ఇందలి కథలుమూడు. కొడవటిగంటి కుటుంబరావుగారి నీలవేణి, గుడిపాటి వెంకటచలంగారి చుక్కమ్మ, కొడవటిగంటి కృష్ణమూర్తిగారి అదృష్టవంతుడు అనునవి. ఈ పత్రికాసంపాదకుడు ఉచితజ్ఞుడగుటచే తనకథను తుదిని ముద్రించుకొన్నాడు. ఇది ఆ సంపాదకుని వినమ్రభావమును, ఇతరులను గౌరవించి తాను గౌరవము పొందవలయునను ఆతని పవిత్రమైన ఉద్దేశమును వెల్లడిం


చుచున్నది నేటి తెనుగుపత్రికాసంపాదకు లలో కొంద ఱీవిషయమును ముఖ్యముగ గమనింపవలసియున్నది. విస్తరభీతిని కథలను ప్రత్యేకించి పరామర్శింప లేక పోవుచున్నాము. కథకులు మువ్వురును కథారచనమున సిద్ధహస్తులగుట వాని ప్రత్యేకతను వివరింప నవసరము లేదని తలంచుచున్నాము. క్రౌనుసైజున గ్లేజుకాగితములమీద సుందరముగ ముద్రింపబడి చిత్రపటములతో పత్రిక ఆకర్షణీయముగ నున్నది. సాలుచందా మూడురూపాయిలు; విడిసంచిక నాలుగు అణాలు. గ్రంథాలయాలకుగాని క్లబ్బులకు గాని సంవత్సరచందా ఆరురూపాయిలు. తెనుగు జర్నలిజముచరిత్రలో కళానిధి ఒక నూతనాధ్యాయ ప్రారంభమునకు తోవ చూపునను దృఢవిశ్వాసముతో నున్నాము. చిరునామా : కళానిధి కార్యాలయము, తెనాలి, గుంటూరుజిల్లా.

## తెనుగు వారి నార్త్ క్లిఫ్

ఈ సంచికలో ప్రచురింపబడిన లార్డు నార్త్ క్లిఫ్ చరిత్ర కొన్నివిషయములలో దేశోద్ధారక నాగేశ్వరరావుపంతులుగారి చరిత్రకు జతపడుచున్నది. నార్త్ క్లిఫ్ పెద్దలు ఆతడు న్యాయవాదికావలయునని ఆశించిరి. కాని ఆతడు పత్రికాసంపాదకుడైనాడు. శ్రీ నాగేశ్వరరావుగారి విషయమునకూడ వారి పెద్దలు వారు న్యాయవాదులగుటను ఆశించిరి. కాని వారు పత్రికాసంపాదకులైరి. నార్త్ క్లిఫ్ను, నాగేశ్వరరావుగారును తమ తమ పత్రికాప్రచురణప్రారంభము వారపత్రికలతోడనే గావించిరి. ప్రపంచావృతమగు ఆంగ్లభాషనగుట నార్త్ క్లిఫ్ పత్రికలు శతాధికమైనవి. రెండుకోట్ల జనులుగల ఆంధ్రభాషనగుట నాగేశ్వరరావుగారి పత్రికలు ఒక దినపత్రిక, ఒక వారపత్రిక, ఒకమాసపత్రికమాత్ర మయినవి. తెనుగునమఱి యేఒక వ్యక్తియు ఇట్లు మూడుపత్రికల ప్రచురణభారమును వహించియుండలేదు. అగుట వారు తెనుగువారి నార్త్ క్లిఫ్ అనబడుట కెంతయు తగియున్నారు వారి ఆంధ్రపత్రిక ఇకముందు సచిత్ర వారపత్రికగ పెంపుపొందింపబడనున్నదనివినుట కెంతయు ఆనందము కలుగుచున్నది. ఆంగ్లేయులు నార్త్ క్లిఫ్ను పలురీతుల గౌరవించినట్లే ఆంధ్రులు తమ నార్త్ క్లిఫ్అయిన నాగేశ్వరరావుగారిని విశ్వదాత, దేశోద్ధారకాది బిరుదములతోడను, భారత శాసనసభకు ఎన్నుకొనుటచేతను గౌరవించుచున్నారు.

## డాక్టర్ శ్రీ జమ్మి వెంకటరమణయ్యగారికి ఆంధ్రభూమి కృతజ్ఞత

'ఆంధ్రభూమి' ప్రారంభింపబడి నప్పటి నుండియు దీని అభివృద్ధినిగూర్చి విశేషముగు శ్రద్ధను, అభిమానమును చూపుచున్న ఆంధ్రమహాశయులలో డాక్టర్ శ్రీ జమ్మి వెంకటరమణయ్యగారు తొలుత పేర్కొనదగినవారు వారిపోషణము ఆంధ్రభూమికి నిరంతరము కార్యోత్సాహమును ప్రసాదించుచున్నది. వారు ఎల్లవేళల ఈ పత్రికను తమపత్రికగ భావించుచు తమ కలకత్తా బ్రాంచిద్వారా ముప్పదిమంది ఏడాది చందాదారులను కూడ చేర్పించియున్నారు. ఇన్నివిధముల వారికి ఆంధ్రభూమి ఋణపడియున్నది. మదరాసున డాక్టరుగారి వ్యాపార విజయము ఆంధ్రవిజయమున కొకనిదర్శనమగును. శ్రీ డాక్టరు జమ్మి వేంకటరమణయ్యగారికి ఇతోధిక వ్యాపారవిజయమును, నిరంతరశుభమును ప్రసాదింప భగవానుని ప్రార్థించుచున్నాము.




## జనవరి, ౧౯౩౫.

౨౪:—బొంబాయి. 1934-వ సంవత్సరపు జూలై నెల 14-వ తేదిని ప్రచురింపబడిన కృష్ణాపత్రిక కాపీల నన్నిటిని బొంబాయి ప్రభుత్వము వశపఱుచుకొన్నది.

౨౬:—రంగూను బర్మారాష్ట్రీయాంధ్ర మహాసభ. జి. టి. శ్యామూగారు ఆహ్వానసంఘాధ్యక్షులు; శ్యామసుందరరావుగారు ప్రారంభకులు, పరిమి సోమరాజుగారు అధ్యక్షులు.

౨౮:—కడప. విమానాశ్రయస్థానమునకు స్థలము సంపాదింపబడుట.

౨౯:—కార్వేటినగరము. కడపమండలములోని మట్ల సంస్థానాధీశుల వంశజులగు మట్ల అనంతరాజుగారు మరణించిరి.

:—నైజాంయిలాకా ఖమ్మంమెట్టు తాలూకా నేలకొండపల్లి కాపురస్థులు, మంత్రవాస్తు శాస్త్రవేత్తలు గండికోట మంత్రాల అప్పయ్యగారి మరణము.

:—మదరాసు. డాక్టరుమల్లయ్యగారి మరణము.

౩౦:—బందరు. ఆంధ్రజాతి అను నూత్నవారపత్రిక తొలిసంచిక వెలువడెను.

## ఫిబ్రవరి. ౧౯౩౫.

౨:—మదరాసు. ధార్మికురాలు పచ్చిశెట్టి అలిమేలు మంగతాయారమ్మగారి మరణము.

౪:—విజయనగరం. మహారాజాకళాశాల ప్రిన్సిపాలు కాళ్ళకూరి జానకిరావుగారి నిర్యాణము.

౭:—కాకినాడ. గోదావరి ఛాంబర్ ఆఫ్ కామర్సు వారిసమావేశము.

౯:—మదరాసు. శ్రీకస్తూరి లక్ష్మీనరసింహారావుగారు యూరపుపోవు స్టీమరెక్కుటకు బొంబాయి వెళ్ళిరి.

౧౧:—ఆంధ్రక్రైస్తవులగు సి. భక్తరుశామయ్యలుగారు ఎం.ఎ.బి.ఎస్.సి. ఇండియా ప్రభుత్వపు సీనియరుమార్కెటింగు ఆఫీసరుగ నియమింపబడిరి.

౧౩:—కాకినాడ.పి.ఆర్. కాలేజిఅర్ధశతాబ్దోత్సవము.

౧౪:—గుంటూరు. ఆంధ్రరాష్ట్రీయస్వదేశీపారిశ్రామిక ప్రదర్శనము.

౧౫:—గుంటూరు. 40-వ మండలరాజకీయసభ.

౧౬:—సేలం. దేశసేవకులు మద్దూరి అన్నపూర్ణయ్యగారు జయిలునుండి విడుదలనొందిరి.

౧౯:—మదరాసు. పచ్చయప్పకళాశాలలో మానవల్లి రామకృష్ణకవి ఎం.ఏ. గారు 'రసస్వరూపము' నుగూర్చి ఉపన్యసించిరి.

౨౦:—మదరాసుశాసనసభ. పంచాయతీ జిల్లాబోర్డుల ఎన్నికలలో తిరిగి మార్పులు గావింప సవరణ చట్టము.

## ప్లస్ పజిల్

ప్లస్ పజిల్ సమాధానములు, బహుమానముపొందినవారినామములు ఈసంచికయందు ప్రచురింపవలసియున్నది. గతమాసపు సంచికలు ఏజెంట్లద్వారా పొందువారికి సకాలముననే చేరినను పోస్టుద్వారాపొందువారికి చాల ఆలస్యముగ చేరినవి. క్రొత్తసంవత్సరమునకు పోస్టల్ కన్సెషన్ వచ్చుటలోనైన ఆలస్యము కారణముగ జనవరి 25-వ తేదీని పోస్టు చేయవలసిన సంచికలు ఫిబ్రవరి 8-వ తేదీని పోస్టు చేయబడినవి. రంగూను, మోల్మెను ప్రాంతములందలి చందాదారులకు ఫిబ్రవరి 20-వ తేదిలోపున సమాధానమిచ్చుటకు సావకాశముండదు కావున గడువుకాలము మార్చి 20-వ తేదివఱకు పొడిగించబడినది. ఈ కారణమున సమాధానములును, బహుమానార్హుల నామములును ఏప్రియల్ సంచికలో ప్రచురింపబడునని మనవి.

# సువర్ణసుందరరసము
## సర్వసవామేహములకు
## సంజీవివంటిది

ఎటువంటి సవామేహములనైన కుదుర్చును. ఇంజక్షనులు అవసరములేదు. అనేకులు వాడి మెచ్చియున్నారు. 60 ఏండ్లు వైద్యమున అనుభవము గల కీ. శే. వేటూరి సుందరశాస్త్రి గారిచే కనిపెట్టబడినది. వాడువిధము మందుతో పంపబడును.

వెల: 50 మాత్రలు: రు. 5-0-0.

# ఆర్షరసాయనశాల, ముక్త్యాల

## అభ్రకభస్మము.

—: అమృతమువంటిది :—

బహుమూత్రమును, క్షయను, దగ్గును పోగొట్టి వీర్యవృద్ధిని గలిగించును. మూత్రమునందుండు చక్కెరను మాయము చేయును. ప్రశస్తమైన రసాయనము. వెల: తులము 1 కి: రు. 5-0-0.

కన్సల్టింగు ఫిజీషియన్ :—

ఆయుర్వేదభూషణ వేటూరి శంకరశాస్త్రి గారు, ఎ.ఎం.ఎ.సి.

## ఐరావతి

లక్షా అరువదివేల బర్మాఆంధ్రుల క్షేమాభివృద్ధులకు ప్రతిశనివారము వెలువడు ప్రజాహితపత్రిక. 7 సంవత్సరములనుండి బర్మాఆంధ్రుల శ్రేయోభివృద్ధికై పాటుపడుచున్నది. ఇది ఆంధ్రులకుఅండ. కార్మికులకు పట్టుకొమ్మ. యువజనోద్యమమునకు ఉనికి. సిరోన్మాటముల నిప్పు. అన్యాయముల నంతరింప జేయుటకు బ్రహ్మాస్త్రము. ఆంతర్యమెరింగినవారికి హాయి చదివినవారికి మిఠాయి.

సంవత్సరపుచందా రు. 3 0-0. తపాలాఖర్చులతో 3 12-0.

చిరునామా :

ఐరావతి పత్రికా కార్యాలయము, 283 బార్ స్ట్రీట్, రంగూను.

## కరుణగీతము

[ఉచితముగా పంపబడును]

వేటాడబడిన లేడి వేటరికి తన పరివేదనము వెడలబోసికొనుట ఇందు వివరింపబడినది. గుండెను కరగించు ఘట్టము. చదివితీరవలసినదే. అంచెఖర్చుకై యొకయణా తపాలాచీటీపంపిన యొక్కొక్కరికి 'కరుణగీత' యొక్కొక్క ప్రతి పంపబడును. త్వరపడుడు. విలాసము : విజ్ఞానవల్లిక, అనంతపురము.

## రామనామం

[ఉచితముగా పంపబడును.]

కవితాసమితి సభ్యులును, వ్యాసరచనాధురీణులును అగు శ్రీ ముద్దా విశ్వనాధముగారు రచించినది. భక్తులు తప్పక చదువవలసినగ్రంథము. జేబునందిముడు చిన్నసైజున మంచి కాగితములపై అందముగ అచ్చొత్తింపబడినది. తపాలాఖర్చులకు ఒకఅణా తపాలాబిళ్ళ పంపువారికెల్లరకును ఈ గ్రంథము ఉచితముగా పంపబడును.

**విలాసము : వ్యాసకుటీరము, మేలుపాక, వయా ఎలమంచిలి, విశాఖపట్టణముజిల్లా.**

### —: ఆంధ్రుల పనినాణ్యము :—

మీ ప్రింటింగు పలువుర నాకర్షించవలెనంటే—ఈ కాలములో విధిగా బొమ్మలు—బ్లాకులు ఉండితీరవలెను. నష్టపడకముందే మీరు మేలుకొనండి! ఆంధ్రదేశీయులగు అందఱు పత్రికాధిపతులు, గ్రంథప్రకాశకులు గూడ చేతి డ్రాయింగు డిజైనులు, యంగ్రేవడు, హాఫ్‌టోను బ్లాక్లు వగైరాలకు మాకు ఆర్డరులుఇచ్చి త్వరగా చౌకగా—చక్కగా—మా పనితనమందుకొనండి—మీ కథలలో బొమ్మలు—మీ అడ్వరుటైజుమెంట్లలో బ్లాకులు—చరిత్రలలో మ్యాపులు—మరి ఫోటోబ్లాకులు—సీనరీబ్లాకులు—ఇట్టి అన్నిటికి మాకేవ్రాయండి—ఇది అనుభవజ్ఞులగు పనివారలున్న ఆంధ్రసంస్థ—ఆంధ్రాభిమానము మఱువకండి! మాదిరిపని ఇచ్చిచూడండి!

పూర్ణా అండుకో—6 చంద్రభానువీధి, మవుంటురోడ్డు పోస్టు, మదరాసు.

## రత్నపురుషలేహ్యాం

పలుచబడిన వీర్యమును గట్టిపఱచి అమితముగా వీర్యవృద్ధి కలిగించు మూలికలకు రాజు అనదగిన 'రత్నపురుష' ప్రధానద్రవ్యముగా చేయబడిన ఈ లేహ్యమును క్రమముగా సేవించువారు కాయపుష్టి, కండపుష్టినొంది బలారోగ్యములును పొందుదురు. డబ్బీ రూ. 3-0-0

చరకనిలయము, ఆయుర్వేదౌషధశాల, రాజమండ్రి.